PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 295 | విజయవాడ, గురువారం 29 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 29 May 2025 | Rs

సోషల్ మీడియా ఖాతాలు పరిశీలిస్తాం

- అమెరికాకు వచ్చే వారికి తేల్చిచెప్పిన ట్రంప్ సర్కార్
- విద్యార్థి వీసాల షెడ్యూలింగ్ తాత్కాలిక నిలిపివేత

7

ఫైనల్‌కు చేరేదెవరో..?

- నేడు పంజాబ్‌-బెంగళూరు జట్ల మధ్య క్వాలిఫయర్‌-1 మ్యాచ్

8

బలం, బలగం కార్యకర్తలే

- నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ
- తప్పు చేసిప వారిని వదిలేది లేదని హెచ్చరిక

అధ్యక్షునిగా మరోసారి ఎన్నికైన చంద్రబాబు

జాతీయ అధ్యక్షునిగా ప్రమాణం స్వీకారం చేస్తున్న నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం, కడప)

కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం, బలగం అని ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. కడపలో జరుగుతన్న మహానాడులో ఆయన మరోసారి జాతీయ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మాట్లాడుతూ తనకు హైకమాండ్ కార్యకర్తలేనని, వారు చూపిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తప్పు చేసిన వారినెవరినీ వదిలిపెట్టేది లేదని, వారిపట్ల చండశాసనుడిలా వ్యవహరిస్తానని అన్నారు. టిడిపి కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. రాయలసీమను కరవు సీమగా, ఎడారి సీమగా కానివ్వబోమని హామీ ఇచ్చారు. పోలవరం తర్వాత ఆ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తున్న ప్రాజెక్టు హంద్రీనీవా అని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో వెలిగొండను పూర్తి చేయబోతున్నామని తెలిపారు. పోలవరం నుంచి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ నీరు ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వంశధార నుంచి పెన్నా వరకూ నదుల్ని అనుసంధానించాలన్నదే లక్ష్యమని అన్నారు. సముద్రంలోకి వృధాగా పోయే నీళ్లను వాడుకుంటే తెలంగాణాకూ లాభమేనని, బిఆర్ఎస్ దీనిపై లేనిపోని విమర్శలు చేస్తోందని అన్నారు. గోదావరిపై తెలంగాణాలో ప్రాజెక్టు కడితే తమకు అభ్యంతరం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలు రెండు తనకు సమానమేనన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరిచ్చి రైతుల రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్రానికి విద్యుత్ కొరత లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్రాన్ని క్లీన్ , గ్రీన్ ఎనర్జీ హబ్ గా రూపొందిస్తున్నామని తెలిపారు. కరెంటు ఛార్జీలు పెంచబోమని పునరుద్ఘాటించారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నేతలు అంతా ఇళ్లపై సోలార్ ప్యానళ్లు పెట్టుకోవాలని సూచించారు. రాయలసీమను అభివద్ధిలో అగ్రభాగాన నిలిపే బాధ్యతను టీడీపీ తీసుకుందని, ఇక్కడ డిఫెన్స్ పరిశ్రమల స్థాపన కోసం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. తిరుపతి, శ్రీశైలం లాంటి దివ్యక్షేత్రాలను పూర్తి స్థాయిలో అభివద్ధి చేస్తామన్నారు. 10 రోజుల్లో కడప స్టీల్ ప్లాంట్ కు జిందాల్ కంపెనీ శంకుస్థాపన చేస్తుందని, రెండు దశల్లో రూ.9వేల కోట్లతో ప్లాంట్ ఉప్రముఖ పర్యాటక కేంద్రంగా గండికోటను తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదే అని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం సాధించామని, వక్స్ బోర్డు ఆస్తులను కాపాడతామని చెప్పారు.

గేమ్ ఛేంజర్‌గా ఆరు శాసనాలు

అంతకుముందు 'నా తెలుగు కుటుంబం'లో భాగంగా లోకేష్ ప్రవేశపెట్టిన ఆరు శాసనాలపై మాట్లాడుతూ వాటిని తెలుగువారి చరిత్ర తిరగరాసే గేమ్ ఛేంజర్‌గా అభివర్ణించారు. కాలానికి అనుగుణంగా పార్టీలో, పాలనా విధానాల్లో నూతనత్వం కోసం వీటిని చర్చించుకుంటున్నామని తెలిపారు. పార్టీలో ఉన్న కోవర్టులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది పార్టీలోనే ఉంటూ కోవర్టులుగా పనిచేస్తూ ఇష్టారాజ్యంగా రాజకీయాలు చేస్తున్నారన్నారు. వలస పక్షులు వస్తాయి, పోతాయని, శాశ్వతంగా ఉండేది కార్యకర్తే అని చెప్పారు.

బాబు ఎన్నిక ఇలా

టిడిపి అధ్యక్షుని ఎన్నికకు ఎన్నికల కమిటీ ఛైర్మన్ వర్ల రామయ్య మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. చంద్రబాబును అధ్యక్షుడిగా 21 మంది ప్రతిపాదించారు. ఇతరులెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. దీంతో చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వర్ల రామయ్య బుధవారం ప్రకటించారు. అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావు, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, షరీఫ్, దగ్గుమళ్ల ప్రసాద్ ఆయనకు ధృవీకరణ పత్రం అందించారు. ఆ తరువాత జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబుతో వర్ల రామయ్య ప్రమాణం చేయించారు.

రాజ్యసభకు కమల్ హాసన్

- ముగ్గురు అభ్యర్థులను ప్రకటించిన స్టాలిన్

చెన్నై : ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షులు కమల్‌హాసన్ త్వరలో రాజ్యసభకు వెళ్లనున్నారు. ఈ మేరకు డిఎంకె బుధవారం అభ్యర్థులను ప్రకటించింది. గతేడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఒక స్థానాన్ని ఎంఎన్ఎంకు కేటాయించినట్లు డిఎంకె అధ్యక్షులు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఎంపి పి.విల్సన్‌ను మరోసారి అభ్యర్థిగా ప్రకటించడంతోపాటు, మాజీ మంత్రి ఎస్ఆర్ శివలింగం, రచయిత్రి సాల్మాగా ప్రసిద్ధి చెందిన ఎ.రోక్కయ్య మాలిక్‌ను అభ్యర్థులుగా ఎంపిక చేశారు. ఈ ప్రకటన తరువాత బుధవారం తమ అధ్యక్షులు కమల్‌హాసన్‌ను రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిగా ప్రకటిస్తూ ఎంఎన్ఎం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దేశవ్యాప్తంగా ఎనిమిది రాజ్యసభ స్థానాలకు ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లో తమిళనాడులో ఆరు, అస్సాంలో రెండు స్థానాలు ఉన్నాయి. తమిళనాడులో ప్రస్తుత రాజ్యసభ సభ్యులు పి.విల్సన్,అన్బుమణి రామదాస్, ఎం.షణ్ముగం, ఎన్.చంద్రశేఖర్, ఎం.మహమ్మద్ అబ్దుల్లా, వైగో పదవీకాలం జులైతో ముగియనుంది. ఈ ఆరు స్థానాలకే ఎన్నికలు జరగనున్నాయి.

కొండపైకి వెళ్లకుండా అధికారులను, అదానీ కంపెనీ ప్రతినిధులను అడ్డుకుంటున్న గిరిజనులు

మా భూముల జోలికొస్తే ఊరుకోం

'అదాని' మనుషులను అడ్డుకున్న మారిక గిరిజనులు

ప్రజాశక్తి- వేపాడ (విజయనగరం జిల్లా)

వేపాడ మండలం మారిక గ్రామాల పరిధిలో అదానికి చెందిన ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు విషయమై ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు బుధవారం వెళ్లిన మండల స్థాయి అధికారులను, అదాని కంపెనీ ప్రతినిధులను మారిక గిరిజనులు అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో ప్రాజెక్టు ఏర్పాటు చేసి తమ బతుకు తీయవద్దని కోరుతూ 35 రోజులుగా గిరిజనులు ఆందోళనలు చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అయినా, ప్రాజెక్టుకు అనుకూలంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. భూసేకరణకు ముందుగా సామాజిక ప్రభావ అంచనా నివేదిక తయారీకి ఎస్ఐఎ బృందం సభ్యులు, మండల స్థాయి అధికారులు, అదాని కంపెనీ ప్రతినిధులు గిరిజనులతో సమావేశమయ్యేందుకు, ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకు బుధవారం వెళ్లారు. గిరిజనులంతా ఐక్యంగా గ్రామ పొలిమేరల్లో వారిని అడ్డుకున్నారు. పవర్ ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లోనూ భూములిచ్చేది లేదంటూ వారిని మూడు గంటలకుపైనే రోడ్డుపైనే అడ్డుకున్నారు ఈ సందర్భంగా మారిక యువకులు మాట్లాడుతూ తమ గ్రామాన్ని, పొలాలను పవర్ ప్రాజెక్టుకు ఇచ్చేది లేదని, తమకు ఎటువంటి సర్వేలూ, సమావేశాలూ వద్దని తేల్చి చెప్పారు. వచ్చిన వారంతా కొండ దిగి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. తామంతా కొండపైనే బతకగలమని, ప్రకృతి వనరులే మాకు సంపదని, కొండను విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. భూములిస్తే జీవనాధారం కోల్పోతామని తెలిపారు.

సామాజిక నిపుణులు పి.దేవరాజు మాట్లాడుతూ నూతన భూసేకరణ చట్టం 2013 ప్రకారం ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ కోసం వచ్చామని చెబుతూ సమావేశం నిర్వహించాలని ప్రయత్నించినప్పటికీ గిరిజనులు తీవ్రంగా హెచ్చరించడంతో వారంతా వెనుతిరిగారు. ఆందోళనలో మారిక గ్రామ నాయకులు జాలరి వీర్రాజు, గెమ్మెల బాబూరావు, అప్పలనాయుడు, సోమేశ్, శ్రీను, ఆసు వెంకటరావు గణేష్, దేవుడు కిలో ఆనంద్ , శోభన్ బాబు. బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. అధికారుల బృందంలో తహశీల్దార్ రాములమ్మ, హెచ్‌డిటి సన్యాసినాయుడు, ఎంపిడిఒ సూర్యనారాయణ, సామాజిక అధ్యయన బృందం సభ్యులు శ్రీనివాస్, రామ్మోహన్, అదాని ప్రాజెక్ట్ మేనేజర్ నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

రుణ రికవరీ ఏజెంట్ల వేధింపులతో

వ్యవసాయ కార్మికుని ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రుణ రికవరీ ఏజెంట్ల వేధింపులకు తాళలేక వ్యవసాయ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఏలూరు జిల్లా పెదవేగి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కె.కన్నాపురం గ్రామానికి చెందిన కమిలి భాస్కరరావు (35) వ్యవసాయ పనులు చేసుకుంటూ భార్య పిల్లలతో జీవిస్తు న్నారు. కొద్దిపాటి స్థలంలో ఇల్లు నిర్మించుకు నేందుకు ఒక ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ నుంచి గతేడాది సెప్టెంబర్‌లో రూ.4.60 లక్షలు రుణం తీసుకున్నారు. నాటి నుంచి భాస్కరరావు ప్రతినెలా ఒకటో తేదీన రుణ బకాయి చెల్లిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మే ఒకటో తేదీన చెల్లించాల్సిన వాయిదాను చెల్లించలేక పోయారు. దీనిపై ఫైనాన్స్ సంస్థ రుణ రికవరీ ఏజెంట్లు పదేపదే భాస్కరరావుపై ఒత్తిడి తీసుకొచ్చారు. మంగళవారం కూడా రికవరీ ఏజెంట్లు ఆయన ఇంటికి వెళ్లి రుణ బకాయిలు చెల్లించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ముందే అవమానించారు. దీంతో మనస్తాపానికి గురైన భాస్కరరావు మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడం, రాత్రైనా ఇంటికి రాకపోవడంతో బంధువులు, సన్నిహితులను కుటుంబ సభ్యులు ఆరా తీశారు. బుధవారం ఉదయం ఇంటికి సమీపంలో ఉన్న తోటలో భాస్కరరావు ఉరి వేసుకుని ఉండటాన్ని అటువైపుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీ కులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రుణం తీసుకున్నప్పటి నుంచి వాయిదాలు ప్రతినెలా సక్రమంగానే చెల్లించారని, ఒక నెల వాయిదా కోసం రికవరీ ఏజెంట్ల వేధింపుల వల్లే భాస్కరరావు మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. పెదవేగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిగుండంలా భూగోళం!

- రాబోయే ఐదేళ్లలో సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటే అవకాశాలు
- వడగాడ్పులు, వరదలు, కరువు కాటకాలు, అగ్నిప్రమాదాలు అత్యంత సాధారణం
- వాతావరణ సంస్థల హెచ్చరిక

7

బాధితులకు పునరావాసం కల్పించాలి

- ఇళ్ల కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించిన అఖిలపక్షం

3

టిజివి ఎస్ఆర్ఎంసి ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి

అక్రమ కేసులు ఎత్తివేయాలి

పరిశ్రమలో వాడే రసాయనాల వివరాలు బయటపెట్టాలి : వి శ్రీనివాసరావు

టిజివి ఎస్ఆర్ఎంసి కెమికల్ పరిశశ్రు పొల్యూషన్ వల్ల జరుగుతున్న నష్టాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుకు వివరిస్తున్న ఇ తాండ్రపాడు గ్రామస్తులు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా ఇ.తాండ్రపాడులోని టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమలో రసాయనాల ఉత్పత్తి పెంపు కోసం గూండాల సమక్షంలో సొంతమనుషులతో ఈ నెల 14న ప్రహసనంగా జరిపిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి అక్రమ కేసులను ఎత్తివేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కర్నూలులోని సుందరయ్య భవన్లో విలేకర్లతో మాట్లాడారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇ.తాండ్రపాడు గ్రామస్తులను కలిసి పరిశ్రమ కాలుష్య వల్ల దుష్పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రి టిజి భరత్ తండ్రి, మాజీ ఎంపీ టిజి వెంకటేష్‌కు చెందిన పరిశ్రమ కాలుష్యంపై కవిత రాసినందుకు సిపిఎం నాయకులు, మోటార్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ ఇన్‌ఛార్జి వడ్ల వెంకటేశ్వర్లుపై కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వర్లును రెండు రోజులు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి 22న ఫిర్యాదు అందినట్లు దొంగతనం కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. 19న దొంగతనం జరిగినట్లు పేర్కొంటూ, 22న ఫిర్యాదు అందినట్లు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. పరిశ్రమ విస్తరణ కోసం టిజి వెంకటేష్ ఈ నెల 14న సొంత మనుషులతో ఫ్యాక్టరీలో ప్రజాభిప్రాయ సేకరణ చేసి అంతా ఓకే అనిపించుకున్నారన్నారు. పరిశ్రమలో ప్రజాభిప్రాయ సేకరణ ఎలా పెడతారని, యజమానిని ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లాలోని అసెన్షియా పరిశ్రమలో గతేడాది ఆగస్టు 22న జరిగిన పేలుడులో 17 మంది చనిపోయిన విషయాన్ని గుర్తు

మిగతా 7లో

వరి సహా 14 పంటలకు మద్దతు ధరలు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

కంటితుడుపు చర్యే : రైతు సంఘాలు



కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర మంత్రివర్గం ఖరీఫ్ సీజన్లో వరి సహా 14 పంటలకు మద్దతు ధరలు ప్రకటించింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్వింటాల్ వరిపై రూ.69 పెంచడంతో కనీస మద్దతు (ఎంఎస్‌పి) ధర రూ.2,369కి చేరింది. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం మంత్రివర్గ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఈ మద్దతు ధరలు కంటితుడుపు చర్యేనని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2 ప్లస్ 50 శాతం ఆధారంగా మద్దతు ధరలు ప్రకటించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జొన్నలు క్వింటాల్‌కు రూ.328, సజ్జలు క్వింటాల్‌కు రూ.150, రాగులు క్వింటాల్‌కు రూ.596, మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.175 పెంచినట్టు కేంద్రమంత్రి వివరించారు. కందిపప్పు క్వింటాల్‌కు రూ.450, పెసర్లు క్వింటాల్‌కు రూ.86, మినుములు క్వింటాల్‌కు రూ.400, వేరుశెనగ క్వింటాల్‌కు రూ.480 పెంచినట్టు తెలిపారు. పొద్దుతిరుగుడు క్వింటాల్‌కు రూ.441, సోయాబీన్ క్వింటాల్‌కు రూ.436, కుసుమలు క్వింటాల్‌కు రూ.579, వలిసెలు క్వింటాల్‌కు రూ.820, పత్తి క్వింటాల్‌కు రూ.589 పెంచి నట్టు చెప్పారు. 2025-26లో సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్-ఎస్) కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుత వడ్డీ రాయితీ 1.5 శాతం యథాతథంగా కొనసాగుతుంది. రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కోట్లతో పాటు అన్నదాతల పెట్టుబడిపై 50 శాతం మార్జిన్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.

రూ.3,653 కోట్లతో బద్వేల్- నెల్లూరు నాలుగు లేన్ల రోడ్డు

బద్వేల్- నెల్లూరు నాలుగు లేన్ల రహదారి విస్తరణకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. రూ.3,653 కోట్లతో ఎన్‌హెచ్-67లో 108.134 కిలోమీటర్ల పొడవున ఈ రహదారిని అభివృద్ధి చేయనుంది. బద్వేల్‌లోని గోపవరం నుంచి నెల్లూరు జిల్లాలోని గురివిందపూడి వరకు నిర్మాణం చేపట్టే ఈ కారిడార్‌తో కృష్ణపట్నం పోర్టుకు ప్రయాణ దూరం దాదాపు 33.9 కిలోమీటర్లు తగ్గనుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని మూడు పారిశ్రామిక కారిడార్‌లలో విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ (విసిఐసి)లోని కొప్పర్తి, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ (హెచ్‌బిఐసి)లోని ఓర్వకల్, చెన్నై -బెంగళూరు పారిశ్రామిక కారిడార్ (సిబిఐసి)లోని కృష్ణపట్నంలను ఇది అనుసంధానించనుంది. బద్వేల్- నెల్లూరు కారిడార్ వైఎస్ఆర్ కడప జిల్లాలోని ప్రస్తుత జాతీయ రహదారి ఎన్‌హెచ్-67లోని గోపవరం గ్రామం వద్ద ప్రారంభమై ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని ఎన్‌హెచ్-16 (చెన్నై-కోల్‌కతా)లోని కృష్ణపట్నం ఓడరేవు జంక్షన్ వద్ద ముగుస్తుంది.

ప్రతిపాదిత కారిడార్ కృష్ణపట్నం ఓడరేవుకు ప్రయాణ దూరాన్ని ప్రస్తుత బద్వేల్-నెల్లూరు రహదారితో పోలిస్తే 142 కిలోమీటర్ల నుంచి 108.13 కిలోమీటర్లకు అంటే 33.9 కిలో మీటర్లు తగ్గిస్తుంది. వార్ధా-బల్లార్షా (మహారాష్ట్ర), రత్లాం-వార్ధా (మధ్యప్రదేశ్) మధ్య రైల్వే లైన్‌కు ఆమోదం లభించింది. ఈ రెండు ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం దాదాపు రూ. 3,399 కోట్లు కాగా, 2029-30 నాటికి పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దు

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్తగా ప్రారంభించిన 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వం పి-4 విధానంలో ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇందుకు సంబంధించి పత్రికల్లో వస్తున్న కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి రామ్మోహన్, కె ప్రసన్నకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలను 66 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే వాదనలున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించాలని కోరారు. వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవడమే కాకుండా పేద ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన మెడికల్ సీట్లు అమ్ముకునే జిఓలు 107, 108ని రద్దు చేస్తామని విశాఖలో యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ హామీ ఇచ్చారని, ఈ మాటకు కట్టుబడి జిఓల రద్దుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు, ప్రజలకు నష్టం చేసే ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులను ఏకం చేసి ఉద్యమానికి పిలుపునిస్తామన్నారు.

ఏడాదిలో ఏం చేశారో చెప్పలేదు

మహానాడుపై మాజీ సిఎం జగన్ విమర్శ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏడాది కాలంలో ముఖ్యమంత్రిగా ఏమి చేశారో చంద్రబాబు మహానాడు వేదికగా చెప్పలేకపోయారని మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో ఉన్న వైసిపి ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. మహానాడు వేదికగా జగన్‌ను తిట్టడం హీరోయిజంగా వారు ప్రకటించుకుంటు న్నారని, ఏమి చేశారో చెప్పుకోవడం లేదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా చంద్రబాబు నెరవేర్చలేకపోయారని విమర్శించారు. రాష్ట్రంలో కలియుగ రాజకీయాలు చేస్తున్నారని, చంద్రబాబు పాలనకు ఇది నిదర్శనమని తెలిపారు. విశ్వసనీయత లేని రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కోవిడ్ కష్టకాలంలో ఆదాయం లేకపోయినా ప్రజలే ముఖ్యమని వారికి న్యాయం చేశామని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామన్నారు. వైసిపి కార్యకర్తలు గర్వంగా ప్రతి గడపకూ వెళ్లగలరని, చంద్రబాబు అలా వెళ్లలేరని విమర్శించారు. ఏడాది పాలనలో వ్యవస్థల న్నీ నిర్వీర్యమయ్యాయని, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలు తిరోగమనంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ లేక పేదలు అప్పులపాలు అవుతున్నారని అన్నారు. రైతులకు ఏ పంటకూ మద్దతు ధర రావడం లేదని పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించిందని తెలిపారు. రైతుల బతుకు దళారుల పాలవతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలవడం ఖాయమని, కార్యకర్తలకే అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇప్పుడు చేసినదానికి వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని అన్నారు.

తండ్రీ కొడుకులకు కుటుంబంపై అభిమానం లేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌కు ఆయన సొంత కుటుంబంపై ఏ మాత్రమూ అభిమానం లేదని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. ఆయన తాత ఖర్జూరనాయుడుపై లోకేష్‌కు చిన్నచూపు ఉందని, సొంత మేనత్తలనే గృహ ప్రవేశానికి పిలవలేదని విమర్శించారు. ఇతరుల కుటుంబాల గురించి సుద్దులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహానాడుకు హాజరైన ప్రతినిధులు

ఎన్‌టిఆర్ స్ఫూర్తితో ముందుకు...

- చంద్రబాబు నాయుడు

మహానాడు ప్రాంగణం నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

ఎన్‌టిఆర్ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ 102వ జయంతి సందర్భంగా బుధవారం కడపలో జరుగుతున్న మహానాడులో చంద్రబాబు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'యుగపురుషుడు ఎన్‌టిఆర్‌కు ఘననివాళి' తీర్మానాన్ని కేంద్ర మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు తేజం, పౌరుషం, ఆత్మగౌరవం ఎన్‌టి రామారావు అని చెప్పారు. 'సమాజమే దేవాలయం- ప్రజలే దేవుళ్లు ' అని నినదించి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్‌టిఆర్ కృషి చేశారని అన్నారు. ఒకే వ్యక్తి ఇటు సినిమాలు, అటు రాజకీయాలు రెండు రంగాల్లో రారాజుగా రాణించారని చెప్పారు. సంక్షేమం, అభివద్ధి, సుపరిపాలనతో పాలనలో కొత్త ఒరవడికి ఆద్యులుగా నిలిచారని అన్నారు. .ఆయన ఆశయాలు సాధించడం కోసమే పి-4 తీసుకువచ్చినట్లు చెప్పారు.

'తెలుగు'ఘనతను చాటి చెప్పారు : సీనియర్ నేతలు

తెలుగువారి ఘనతను ప్రపంచానికి ఎన్‌టిఆర్ చాటి చెప్పారని టిడిపి సీనియర్ నేతలు అశోక్ గజపతిరాజు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మ కాయల చినరాజప్ప, టిడి జనార్ధన్, పయ్యావుల కేశవ్ తదితరులు అన్నారు. మహిళలకు ఆస్తిలో వాటా కల్పించారని చెప్పారు.రాజకీయాల్లోకి యువతను ఆహ్వానించి కొత్త తరాన్ని సృష్టించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారి కాంగ్రెస్సేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని వెల్లడించారు. ఎన్టీఆర్ వల్లే తాము రాజకీయాల్లో వచ్చామన్నారు.

'ఎఐ'తో ఎన్‌టిఆర్

ఎఐ సాంకేతికత ఉపయోగించి ఎన్టీ రామారావు మాట్లాడుతున్నట్లు మహానాడులో ప్రదర్శించారు. మహానాడు వేదిక నుంచి ఆయన మాట్లాడుతునట్లు సృష్టించిన ఈ వీడియో టిడిపి కార్యాకర్తలను ఆకట్టుకుంది. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు తాను ఐటీ గురించి మాట్లాడిన సమయంలో ప్రజలు నమ్మలేదని, ఇప్పుడు ఎఐ ద్వారా ఎన్‌టిఆర్ అందర్నీ దీవించారని అన్నారు.

ఎన్‌టిఆర్ కు పుష్పాంజలి

సంక్షేమానికి పెద్దపీట : పట్టాభి

తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీఠ వేస్తోందని టిడిపి నాయకులు పట్టాభి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ అమలుకు పూర్తి స్థాయి కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే దీపం పథకం అమలు జరుపుతోందన్నారు. తల్లికి వందనం, అన్నదాతకు తోడ్పాటును అతి త్వరలోనే అమలు చేస్తుందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో అమలు జరుగుతుందన్నారు. ఇక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఎనిమిది లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు నారా లోకేశ్ ప్రయత్నం చేసారని వివరించారు. నిరుద్యోగ యువతకు భృతి ఇచ్చే కార్యక్రమాన్ని కూడా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆడబిడ్డకు ఇస్తామన్న రూ.1500 అమలు చేస్తామని తెలిపారు.

టూరిజం అభివృద్ధికి బాటలు : విశాఖ ఎంపి భరత్

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చర్యలు తీసుకోవడం జరుగుతోందని విశాఖ ఎంపి భరత్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. విశాఖపట్నం, అఖండ గోదావరి, గండికోట తదితర ప్రాజెక్టుల కోసం కేంద్రం నుంచి రూ.200 కోట్లు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మరింతగా టూరిజం అభివృద్ధి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం టూరిజాన్ని పూర్తిగా విస్మరించడమే కాకుండా విశాఖలో ఋషికొండను రూ.500 కోట్లు ఖర్చు పెట్టి బోడికొండగా మార్చిందని విమర్శించారు.

జోరుగా పునర్ నిర్మాణం

- ధూళిపాళ్ల నరేంద్ర ...

మహానాడు నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

గత ఐదేళ్ల కాలంలో విధ్వంసానికి గురైన అన్ని వ్యవస్థల పునర్ నిర్మాణ పనులు రాష్ట్రంలో జోరుగా సాగుతున్నాయని టిడిపి ఎంఎల్‌ఎ ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు.మహానాడు లో బుధవారం ఆయ 'విధ్వంసం నుండి పునర్ నిర్మాణం వైపు' అనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019లో వైసిపి అధికారంలోకి వస్తూనే ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగానున్న 'ప్రజా వేదిక' కూల్చివేశారని, అక్కడ నుండి విధ్వంస పాలన ప్రారంభమైందని చెప్పారు. రాజధాని నిర్మాణాన్ని నిలిపివేయడం, పోలవరం కాంట్రాక్టర్ల మార్పు తదితర వాటితో రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగిందన్నారు. మద్యం విధానంలో మార్పులు తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడారని చెప్పారు. టిడిపి అధికారంలో వచ్చిన తరువాత నారా చంద్రబాబునాయుడి నేతృత్వంలో వ్యవస్థలను గాడిలో పెట్టే పనులు పెద్దఎత్తున చేపట్టినట్లు చెప్పారు. అమరావతి పునర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడమే కాకుండా ప్రధాన మంత్రి నరేంద్రమోడిని ఇక్కడికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా నాలుగు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులూ రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. తద్వారా యువతకు లక్షలాది ఉద్యోగాలు లభించనున్నాయరు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బలపరుస్తూ ప్రసంగించారు. ఐదేళ్ల వైసిపి పాలనలో విధ్వంసానికి గురైతే, తెలుగుదేశం ప్రభుత్వ హయంలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. కర్నాటక సరిహద్దులోనున్న తమ నియోజకవర్గం మడకశిర ప్రాంతంలోనూ డిఫెన్సు పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు.

తెలుగు కీర్తి విశ్వఖ్యాతి

'తెలుగు కీర్తి- విశ్వఖ్యాతి' అన్న అంశంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టిన టిడిపి పేత నక్కా ఆనంద్ మాట్లాడుతూ దేశంలో తెలుగు దనానికి ఖ్యాతిని ఎన్‌టిఆర్ తీసుకువచ్చారని చెప్పారు. 1982లో తెలుగువారి ఆత్మగౌరవం పేరుతో టిడిపిని స్థాపించి. ఎనిమిది నెలల్లోనే అధికారంలోకి రావడం ద్వారా తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ఆయన చాటిచెప్పారని అన్నారు. ఆ ఖ్యాతిని విశ్వ విఖ్యాతం చేసిన ఘనత నారా చంద్రబాబునాయుడిదేనని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత ఐటి రంగంపై దృష్టి సారించి, బిల్‌గేట్స్ తదితరులతో మాట్లాడి ఉమ్మడి రాష్ట్రంలో ఐటి వంటి పరిశ్రమలను తీసుకొచ్చారని చెప్పారు. ఈ తీర్మానానికి తెలంగాణ తెలుగుదేశం నాయకులు నన్నూరు నర్సిరెడ్డి బలపరిచారు.

మహిళా ప్రతినిధుల జోష్...

సాగునీటికి అత్యంత ప్రాధాన్యం

- నిమ్మల రామానాయుడు

మహానాడు నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 'సమగ్ర సాగునీటి ప్రణాళికలతో ఉజ్వల ప్రగతి' అన్న అంశంపై మహానాడులో బుధవారం ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.అనంతరం మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి మారిందని చెప్పారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అదే విధంగా 2026 జూన్ నాటికి పోలవరం కుడికాలువ లైనింగు పూర్తి చేసి విశాఖపట్నం నగరానికి, స్టీల్ ప్లాంట్‌ను నీటిని అందిస్తామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం పనులు పూర్తవకనే పూర్తయినట్టుగా చూపించిన వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. హంద్రీనీవా ఎప్పుడూలేని విధంగా ఈ ఒక్క బడ్జెట్‌లోనే రూ.3800 కోట్లు కేటాయించి శరవేగంగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

కేంద్ర సహకారంతోనే...

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చాలా వరకు అమలుచేస్తున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. 'రాష్ట్రానికి కేంద్ర సహకారం' అనే అంశంపై తీర్మానాన్ని ప్రశేశపెట్టిన ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూలేని విధంగా రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు తొమ్మిది వేల కోట్లు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అదే విధంగా 98 వేల కోట్లతో పెట్రో కారిడార్ నిర్మాణం చేపట్టనున్నట్టు వివరించారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో కేంద్రం నిధులు సక్రమంగా వినియోగించుకోకపోవడంతో 90 రకాల పథకాలు ఆగిపోయాయని చెప్పారు.

తెలంగాణలో రైతుబంధు తిరిగి ప్రారంభించాలి

- తెలంగాణ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్

తెలంగాణ రాష్ట్రంలో తిరిగి రైతు బంధు ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర నాయకులు దుర్గా ప్రసాద్ మహానాడులో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలంగాణ రాష్ట్రంలో అమల్లోనున్న రైతుబంధు పథకాన్ని ఇప్పటి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. తిరిగి ప్రారంభించి రైతులకు తోడ్పాటును అందివ్వాలని కోరారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట తలపెట్టిన పోలవరం-బనకచెర్ల వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుందని ఆ ప్రాంతంలో ప్రచారం చేస్తున్నారన్నారు. ఇది సరైంది కాదు అని అన్నారు. పోలవరం-బనకచెర్ల వల్ల తెలంగాణకు ఏ మాత్రం నష్టం ఉండబోదని తెలిపారు.

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత

- బిసి.జనార్థన్‌రెడ్డి

రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని బిసి.జనార్థన్‌రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసి ప్రభుత్వ హయంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని విమర్శించారు. గంజాయి, నేరాలు అధికంగా ఉండేవన్నారు. తమ ప్రభుత్వం పూర్తి స్థాయిగా అరికట్టేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

పి4.. విజన్ 2047

- రాజకీయ తీర్మానంలో టిడిపి
- కేంద్రంతో సహకార ధోరణి
- లౌకికవాదం ఊసే లేదు

మహానాడు నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

పి4,విజన్ 2047ల సాధనకు ప్రతి టిడిపి కార్యకర్త అంకితం కావాలని మహానాడు పిలుపునిచ్చింది. ఈమేరకు కేంద్ర మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు ప్రవేశపెట్టిన రాజకీయతీర్మానాన్ని మహానాడులో బుధవారం ఏకగ్రీవంగా ఆమోదించారు. తీర్మానంలో వివిధ అంశాలను ప్రస్తావించినప్పటికీ కీలకమైన భాగం పి4, విజన్ 2047 చుట్టూ తిరిగింది. 'పేదరికాన్ని నిర్మూలించేందుకు చంద్రబాబు ప్రవేశపెట్టిన పి4 పథకంలో భాగస్వాములవుదాం... స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధనకు అంకితమౌదాం' అని తీర్మానంలో పిలుపునిచ్చారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టిఆర్ రాష్ట్రాల హక్కుల కోసం కేంద్రంతో చేసిన పోరాటాన్ని, నేషనల్ ఫ్రంట్‌లో పోషించిన కీలక పాత్రను ఘనంగా ప్రస్తావించారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వంతో సహకార ధోరణే తమ విధానమని స్పష్టం చేశారు. 'కేంద్రం, రాష్ట్రాల మధ్య రాజ్యాంగబద్ధమైన సహకార ధోరణి ఉండాలి.ఏ విధమైన పొరపొచ్చాలు లేకుండా సామాజిక ఆర్థిక అభివృద్ధికి కలిసి పనిచేయాలన్నది టిడిపి విధానం' అని తీర్మానంలో పేర్కొన్నారు. అయితే, ప్రత్యేక హోదాను తిరస్కరించడంతో పాటు, విభజన హామీల అములకు ఏమాత్రం సహకరించని కేంద్రం తీరును ప్రస్తావించలేదు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ల'అన్న ఎన్‌టిఆర్ నినాదాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూనే 'లౌకికవాదం' అన్న పదాన్ని ప్రస్తావించడానికి కూడా సిద్ధపడలేదు. 'జాతీయ భావాలున్న ప్రాంతీయ పార్టీ'గా టిడిపిని చెప్పుకుంటూనే దేశ వ్యాప్తంగా మైనార్టీలు, దళితులపై జరుగుతున్న దాడులను, వారిలో నెలకొన్న అభద్రతను ప్రస్తావించలేదు. అదే సమయంలో వైసిపి హయంలో రాష్ట్రంలో దళితులపై ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడిని టిడిపి రాజకీయ తీర్మానం తీవ్రంగా ఖండించింది 'ఇది దేశ సమగ్రతపై జరిగిన దాడి'గా పేర్కొంది. ఆపరేషన్ సింధూర్ భారతదేశ చరిత్రలో ఒక సంచలన విజయంగా పేర్కొంది.ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వ ం తీసుకునే చర్యలకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవినీతి, అరాచకపాలనలో బాధితులుగా మారిన ప్రజలకు నేనున్నానని భరోసా ఇచ్చేందుకు లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్రప్రజానీకంలో చైతన్యాన్ని రగిలించిందని, కేడర్‌లో 'నిజం గెలవాలి' కార్యక్రమం మనోస్థయిర్యాన్ని నింపిందని పేర్కొంది. గడిచిన ఎన్నికల్లో కూటమికి అపూర్వ విజయం చేకూర్చిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపింది.

హాజరైన నేతలు

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద లోకేష్, మహిళా నేతలు

పోలవరం నిర్వాసితులకు వెంటనే పరిహారం

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాడ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో గిరిజన, రైతు కూలీ సంఘాల సంయుక్త ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్య దేశంలోనే ఒక పెద్ద మానవ సంక్షోభమని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 5 లక్షల మంది నిర్వాసితులు ఉండగా, వీరిలో 3 లక్షల మంది గిరిజనులే ఉన్నారని తెలిపారు. ప్రాజెక్టును ప్రారంభించి 20 ఏళ్లయినా నేటికీ నిర్వాసితులకు భూమికి భూమి, నష్టపరిహారం అందించలేదన్నారు. వ్యవసాయం తప్ప మరో పని చేతకాని గిరిజనులు ఉపాధి లేక తినడానికి తిండి దొరకక అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. 1.06 లక్షల కుటుంబాలకు గానూ కేవలం 13 వేల కుటుంబాలకు కాగితాలపైనే పునరావాసం కల్పించినట్లు తెలిపారు. కేంద్రం పోలవరం ఎత్తు తగ్గించినా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం నిస్సహాయ స్థితిలో ఉందన్నారు. ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఝాన్సీ మాట్లాడుతూ.. కొండ మొదలు పంచాయతీ ఆర్ అండ్ ఆర్ కాలనీలో 500 కుటుంబాలకు నేటికీ నష్టపరిహారం అందలేదని తెలిపారు. ఏ రకమైన ఉపాధి అవకాశాలు లేని గిరిజన యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సేకరించిన 167 ఎకరాలను ఈ సీజన్ నుంచైనా రైతులకు కేటాయిస్తే సాగు చేసుకుంటారని చెప్పారు. ఆల్ ఇండియా కిసాన్ సంఘటన్ ఎపి కన్వీనర్ మరీదు ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. నిర్వాసితులకు ప్రభుత్వాలిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కొండ మొదలు సర్పంచి వేట్ల విజయ మాట్లాడుతూ.. గ్రామస్తుల సమక్షంలో హామీల అమలుకు ఒప్పందాన్ని చేసి, అమలు చేయకుండా గిరిజనులను మోసం చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల లక్షలాది గిరిజన కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రైతు సమాఖ్య నాయకులు అక్కినేని భవానీ ప్రసాద్, మాజీ కలెక్టర్ బి శ్రీనివాసులు, రైతు కూలీ సంఘం నాయకులు వేట్ల శ్రీరాములు, గిరిజన సంఘం ఉపాధ్యక్షులు కొండా రామిరెడ్డి, గిరిజన, రైతు కూలీ సంఘం నాయకులు జోగారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బేవరేజెస్ హమాలీల కూలీ రేట్లపై చర్చలు విఫలం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి బేవరేజెస్, ఐఎంఎల్ డిపోల్లో పనిచేస్తున్న హమాలీల కూలీ రేట్ల పెంపుపై మద్యం తయారీ సంస్థల యాజమాన్యాలతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. మొత్తం 2,200 మంది హమాలీలకు గత వేతన ఒప్పందం ఈ ఏడాది మార్చి 31తో ముగిసిందని కార్మిక సంఘాలు తెలిపాయి. ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఒప్పందం అమలు జరగాల్సి ఉందని చెప్పారు. ఈ విషయంపై మంగళగిరిలోని ఎక్సైజ్‌శాఖ డైరెక్టరేట్‌లో అధికారుల సమక్షంలో మద్యం తయారీ సంస్థల యాజమాన్యాలు, కార్మిక సంఘాల నాయకుల మధ్య బుధవారం చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా సిఐటియు అనుబంధ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రతి పెట్టెకు రూ.2 చొప్పున రేట్లు పెంచాలని కోరారు. ప్రమాదాలకు గురైన హమాలీలకు వైద్య సేవలు అందించేందుకు యజమాన్యాలు, ప్రభుత్వం పథకం రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్చల్లో ఎక్సైజ్‌శాఖ సిజిఎం చరణ్ కుమార్, జిఎం శ్రీనివాసరావు, సిఐటియు అనుబంధ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వి సుబ్బారెడ్డి, ఎం మదన్మోహన్, రాష్ట్ర కార్యదర్శి వి కొండలరావు, ఉపాధ్యక్షులు ఎన్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మా భూములకు రక్షణ కల్పించండి

- హైకోర్టులో సజ్జల కుటుంబం పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

కడప జిల్లా, సీకేదిన్నె మండలం పరిధిలోని 63.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఈ నెల 21న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలంటూ వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును నిలిపేయాలంటూ సజ్జల దివాకర్ రెడ్డి కొడుకు సజ్జల సందీప్ రెడ్డి, భార్య భగీరథి, మరో సోదరుడు సజ్జల జనార్ధన్‌రెడ్డి ఆయన భార్య విజయకుమారి, అల్లుడు వై సత్య సందీప్ వేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ చేయనుంది.

సీపెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) డిప్లమో కోర్సుల దరఖాస్తు తేదీని జూన్ ఒకటో తేదీ వరకూ పొడిగించినట్లు విజయవాడ కేంద్రం డైరెక్టర్ సిహెచ్ శేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 29తో ముగియనుండటంతో ఆసక్తి గల విద్యార్థుల కోసం తేదీని పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. సీపెట్ ఎపిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కూడా ఉందని, అడ్మిషన్ టెస్టును జూన్ 8న యథావిధిగా నిర్వహిస్తారని వివరించారు. ఇతర వివరాలకు 7893586494 నెంబర్‌ను సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

జూన్‌లో ఖాళీలనూ పరిగణనలోకి తీసుకోవాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో జూన్ నెలలో రిటైరయ్యే ఉద్యోగుల ద్వారా వచ్చే ఖాళీలనూ బదిలీల ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎపిపిటిడి (ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర ఆయనకు వినతిపత్రం అందజేశారు.

ఎస్‌హెచ్‌జిల పుస్తకాల్లో అవినీతిని అరికట్టాలి

- ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పొదుపు గ్రూపుల తీర్మానాలు, పొదుపు పుస్తకాల అమ్మకాల్లో అధికారుల అవినీతిని అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గతంలో పొదుపు గ్రూపుల మహిళలు తీర్మానాల పుస్తకాలు, అకౌంట్ పుస్తకాలు, ఓటర్లు తదితర పుస్తకాలు మార్కెట్‌లోని షాపుల్లో కొనుగోలు చేసి వినియోగించేవారని, ఇప్పుడు తమ దగ్గర మాత్రమే కొనాలని ఉద్యోగులు ఒత్తిడి తేవడమే కాకుండా అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 విలువ చేసే పుస్తకాన్ని రూ.400కు విక్రయిస్తున్నారని చెప్పారు. స్వయం సహాయక సంఘాల నిర్వహణ పేరుతో రూ.కోట్లలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించాలని కోరారు.

'గృహిణి' పథకానికి ప్రభుత్వ యోచన

- కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాపు మహిళల కోసం గృహిణి అనే పథకాన్ని ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉందని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తెలిపారు. ఈ పథకంలో మహిళలకు వ్యాపారాలు చేసుకునేందుకు ఆర్థిక చేయూత అందించనున్నట్లు పేర్కొన్నారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు కార్పొరేషన్‌కు ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4,600 కోట్లు కేటాయించిందని తెలిపారు. గత ప్రభుత్వంలో రద్దు చేసిన కాపు భవనాలను పునరుద్ధరిస్తామన్నారు.

కాపు కార్పొరేషన్ రుణాలు ఇవ్వడంలో ఇబ్బందులు ఉండవన్నారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ ఎమ్‌డి ఎస్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై పవన్‌కల్యాణ్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కడప జిల్లా, కంబాలదిన్నెలో మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య ఘటనపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బంధువే ఈ దారుణానికి పాల్పడటం సమాజానికి సిగ్గుచేటన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అంతిమ లబ్ధిదారు ఎవరు?

- దూకుడు పెంచిన ఇడి
- మద్యం నిందితుల్లో ఆందోళన
- ములాఖత్‌పై జైలుకెళ్లిన సజ్జల, లేళ్ల, మొండితోక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం కేసు విచారణ వేగం పుంజుకుంది. విజయవాడ పోలీస్ కమిషనరు రాజశేఖర్‌బాబు నేతృత్వంలోని సిట్ దర్యాప్తు బృందం దూకుడుగా ముందుకెళ్తోంది. ఇదే సందర్భంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) బృందం రంగంలోకి దిగింది. దీంతో ఈ కేసులో అంతిమ లబ్ధిదారు ఎవరనే విషయం త్వరలో తేలనుందనే ప్రచారం సాగుతోంది. మద్యం కేసులో ఎ-వన్‌గా ఉన్న రాజ్ కసిరెడ్డిని బుధవారం ఇడి అధికారులు విజయవాడ జిల్లా జైలులో సుదీర్ఘంగా విచారించారు. ఈ కేసుకు సంబంధించి ఇడి అధికారులు సంధించిన ప్రశ్నలకు రాజ్‌కసిరెడ్డి ఉక్కిరిబిక్కిరైనట్లు సమాచారం. ఒకవైపు ఇడి విచారణ సాగుతున్న రోజే మద్యం కుంభకోణం కేసులో ఎ6గా ఆరోపణలు ఎదుర్కొంటూ ఇదే జైలులో ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డిని వైసిపి స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్ ములాఖత్‌పై కలిశారు. వీరి ములాఖత్ మధ్యాహ్నం 2:30 నుంచి 2:55 వరకు సాగింది. ఇడి రంగంలోకి దిగడంతో అసలు అంతిమ లబ్ధిదారుని పేరు ఎక్కడ వెల్లడిస్తారేమోననే ఆందోళనతో వైసిపి నేతలు ములాఖత్ అయి ఉంటారనే ప్రచారం సాగుతోంది. ఇడి రంగంలోకి దిగడంతో మద్యం కుంభకోణం కేసు రానున్న రోజుల్లో ఎలాంటి మలుపులు తీసుకుంటుందోననే అనుమానాలు ప్రజల్లో నెలకొన్నాయి.

మద్యం కేసులో సంపాదించిన డబ్బును ఎలా హవాలా రూపంలో మార్చారు? తిరిగి ఆ డబ్బుతో బంగారం, ప్లాట్లు, రియల్ ఎస్టేట్ రంగంలో ఎలా పెట్టుబడులుగా మార్చారు? ముడుపులు ఎన్ని దశల్లో చేతులు మారాయి? ఎపిసోడ్‌లో అంతిమ లబ్ధిదారు ఎవరు? అనే విషయాలపై ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. ఒకట్రెండు ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేదని, మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉన్నట్లు తెలిసింది. రాజ్ కసిరెడ్డి సమాధానాలు సరిగ్గా చెప్పడం లేదని భావించిన ఇడి అధికారులు.. సిట్ అధికారులు సేకరించిన డాక్యుమెంట్లు, మిగిలిన ఒకవైపు ఇడి అధికారులు మంగళవారం సిట్ దర్యాప్తు అధికారి, విజయవాడ సిపి రాజశేఖర్‌బాబుతో కూలంకషంగా చర్చించారు.

ఈ కేసు దర్యాప్తులో ఇప్పటి వరకు సేకరించిన సమాచారం సిట్ నుంచి ఇడికి చేరింది. ఇడి అధికారులు మరో రెండు రోజులు జైలులో ఉన్న మిగిలిన నిందితులను కూడా ప్రశ్నించే అవకాశం లేకపోలేదని సమాచారం.

రాజకీయాల్లోకి వచ్చినా కండువా మారదు

- మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయాల్లోకి వచ్చినా కండువా మారదని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తెలిపారు. రాజకీయ చైతన్యం కోసం కూడా సిద్ధం అవుతామని చెప్పారు. బుధవారం నాడిక్కడ తెలంగాణ భవన్‌లో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగతంగా తన పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికి దక్కిన గౌరవమని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే వర్గీకరణ ఉద్యమం సాధ్యమైందని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డును గౌరవంగా కాకుండా బాధ్యతగా అనుకుంటున్నానని అన్నారు. ఇంకా పరిష్కారం కాని సమస్యల కోసం భవిష్యత్ ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు.

గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - ఆచంట

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం రావిలంక వద్ద వశిష్ట గోదావరిలో మంగళవారం సాయంత్రం స్నానానికి దిగి గల్లంతైన ముగ్గురు బాలుర మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా నాగుల్లంకకు చెందిన కేతా ప్రవీణ్, సానబోయిన సూర్యతేజ, పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం పెదలంకకు చెందిన నీతిపూడి పౌలుకుమార్ మంగళవారం సాయంత్రం స్నానానికి గోదావరిలో దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. బుధవారం చేపట్టిన గాలింపు చర్యల్లో ముగ్గురి మృతదేహాలూ లభ్యమయ్యాయి. వాటిని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. ఆచంట ఎస్ఐ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు కస్టడీకి నందిగం సురేష్

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

వైసిపి నేత, బాపట్ల మాజీ ఎంపి నందిగం సురేష్‌ను పోలీసులు మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా జైలు నుంచి తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు ఆయనను విచారణ నిమిత్తం బుధవారం తరలించారు. మూడు రోజులపాటు తుళ్లూరు పోలీసులు విచారించనున్నారు. ఈ నెల 17వ తేదీ రాత్రి ఉద్దండరాయునిపాలెంలో ఇసుకపల్లి రాజు అనే వ్యక్తిపై దాడి కేసులో సురేష్ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సురేష్‌ను చూసేందుకు వైసిపి నాయకులు, సురేష్ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ వద్దకు రాగా పోలీసులు అనుమతించలేదు.

బాధితులకు పునరావాసం కల్పించాలి

ఇళ్ల కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించిన అఖిలపక్షం

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

వేణుగోపాలపురం కాలనీ బాధితులకు పునరావాసం కల్పించి, ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. మంగళం పరిధి తిరుమల నగర్ పంచాయతీ వేణుగోపాల్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఇళ్లను కూల్చిన ప్రాంతాన్ని బుధవారం ఉదయం అఖిలపక్ష నాయకులు సందర్శించి బాధితులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ.. పక్కా ప్రణాళికతోనే ఇళ్లను కూల్చివేసినట్లుగా నిర్ధారణ అవుతోందన్నారు. దీని వెనక బడాబాబులు ఉన్నారని, నిబంధనల ప్రకారం బాధితుల వద్ద అన్ని రికార్డులూ ఉన్నా, అర్ధరాత్రి ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ గాని, ఆర్‌డిఓ గాని, తహశీల్దార్ గాని ఈ ప్రాంతాన్ని పరిశీలించలేదంటే ప్రజల పట్ల వారికి బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. ఈ దురాగతానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, అదేవిధంగా ఒకే స్థలాన్ని ఇద్దరికీ జిపిఎ చేసిన వారిని ఈ కేసులో భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, న్యాయవాది వెంకటయ్య, సిపిఎం,ఐద్వా, బిఎస్‌పి నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లను కూల్చి వేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్ష పార్టీ నాయకులు

ధర్నా చేస్తున్న పార్టీలు ప్రజాసంఘాల నాయకులు

పోలీసుల దాడి మానవహక్కుల ఉల్లంఘనే

- అమానుషంగా వ్యవహరించిన వారిని విధుల నుంచి తప్పించాలి
- కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, విసికె, బిఎస్‌పి నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)

దళిత, మైనారిటీ యువకులపై నడిరోడ్డుపై అత్యంత పాశవికంగా వ్యవహరించిన పోలీసులను తక్షణమే విధుల నుంచి తప్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, విసికె, బిఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. పోలీసుల చర్యలను నిరసిస్తూ గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, విసికె, బిఎస్‌పి నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. తెనాలి డివిజన్ జెఎసి సారథ్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. ఏ కేసులోనైనా నిందితులకు శిక్షలు అమలు చేసే అధికారం కోర్టు పరిధిలోని అంశమని, దానిని ఉల్లంఘించి పోలీసులు లాఠీలతో నిందితులపై దాడి చేయడం మానవహక్కుల ఉల్లంఘనేనని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగిపోయాయని, సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోనే దళితుల సామాజిక బహిష్కరణ ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. తెనాలి ఘటనపై ప్రభుత్వం స్పందించి ఇందుకు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలీసుల చర్యలను ఎంఆర్‌పిఎస్ తీవ్రంగా ఖండిస్తోందని, ఉద్యమం తీవ్ర రూపం దాల్చకముందే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం శాఖ మంత్రి, తెనాలి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించాలని డిమాండ్ చేశారు. విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జె విద్యాసాగర్ మాట్లాడుతూ.. తెనాలిలో పోలీసులు బరితెగించి ప్రవర్తించారని, దళితుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బిఎస్‌పి నాయకులు కారుమంచి సునీల్ సందీప్ మాట్లాడుతూ.. కానిస్టేబుల్‌పై నిందితులు దాడి చేశారని చెప్పడం కేవలం పోలీసుల కట్టుకథన్నారు. ధర్నాలో బాధిత కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు ఈమని అప్పారావు, ములక శివసాంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కెకె లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

ప్రజాశక్తి -అనంతగిరి (అల్లూరి జిల్లా)

కొత్తవలస కిరండోల్ (కెకె.లైన్)లో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. టైడ, సిమిడిపల్లి మార్గంలో 53/34 మైలురాయి వద్ద సుమారు 20కి పైగా బోగీలు పక్కకు ఒరిగాయి. కిరండోల్ నుంచి ఐరన్ లోడుతో విశాఖ వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఐరన్ లోడు వల్ల ఎక్కువ బోగీలు పక్కకు ఒరిగి ఉంటాయని రైల్వే శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో పలుమార్లు పట్టలు తప్పినా ఒకటి రెండు బోగీలు మాత్రమే పక్కకు ఒరిగేవని, సగానికిపైగా బోగీలు పట్టాలు తప్పడం ఇదే తొలిసారని స్థానికులు చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న విశాఖ రైల్వే అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బోగీలను పట్టాలు ఎక్కించే పనిలో నిమగ్నమయ్యారు.

రైళ్ల రద్దు

18515 కిరండోల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్ ప్రెస్‌ను బుధవారం, 58501 విశాఖపట్నం - కిరండోల్, 58502 కిరండోల్ - విశాఖపట్నం పాసింజర్లను గురువారం రద్దు చేశారు. 18516 కిరండోల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది.

బోగీలను పరిశీలిస్తున్న డిఆర్ఎం

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అడ్డగింత

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గృహాలకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించే ప్రక్రియను ఒంగోలు భగత్‌సింగ్ కాలనీవాసులు అడ్డుకున్నారు. బుధవారం ఉదయం అదాని కంపెనీకి చెందిన ప్రతినిధి విద్యుత్ సిబ్బందితో కలిసి భగత్‌సింగ్ కాలనీకి చెందిన మూడు గృహాలకు తొలుత స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఉపక్రమించారు. తమ నివాసాలకు ఉన్న మీటర్లు పని చేస్తున్నాయని, ఈ ఏడాది మార్చిలో రూ.12 వేలు వెచ్చించి మీటర్లు ఏర్పాటు చేసుకున్నామని, ఇప్పుడు ఎందుకు స్మార్ట్ మీటర్‌ను బిగిస్తున్నారని కాలనీకి చెందిన గుంజి శ్రీను వారిని ప్రశ్నించారు. మీటర్లకు డబ్బు చెల్లించవలసిన అవసరం లేదని, ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధి, విద్యుత్ సిబ్బంది నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. శ్రీను నిరాకరించడంతో పొరుగునే ఉన్న వంశీధర్ ఇంటికి మీటర్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. మీటర్ మార్చాలని తాను డిపార్టుమెంట్‌ను కోరలేదని, డబ్బులు కట్టలేదని, కొత్త మీటర్ ఎలా బిగిస్తారని ఆయన కూడా ప్రశ్నించారు. పొరుగున సిహెచ్ డేవిడ్ ఇంటికి స్మార్ట్ మీటర్ బిగించేందుకు ప్రయత్నించగా ఆయనా నిరాకరించారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు తదితరులు అక్కడకు చేరుకున్నారు. 'స్మార్ట్‌మీటర్లు ఎవరు బిగించమన్నారు? కాంట్రాక్టర్ ఎవరు.?' అని సిబ్బందిని ప్రశ్నించడంతో వారు అక్కడి నుంచి ఉడాయించారు.

స్మార్ట్ మీటర్లను బిగించేందుకు వచ్చిన అదాని ప్రతినిధి

విశాఖ సెంట్రల్ జైలుకు ఉగ్ర కుట్ర నిందితులు

- ముగిసిన కస్టడీ

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

ఉగ్రవాద కుట్ర కేసులో నిందితులుగా ఉన్న సిరాజ్, సమీర్‌లను బుధవారం తిరిగి విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. ఉగ్రవాద కుట్ర కేసులో నిందితులుగా ఉన్న వీరిని విజయనగరం పోలీసులు ఏడు రోజుల కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఉగ్ర కదలికలు, పేలుళ్ల వ్యూహాలు, సూత్రధారులు, పాత్రధారులు తదితర అంశాలపై వారి నుంచి ఎన్ఐఎ అధికారులు సమాచారం రాబట్టి ఉండవచ్చని సమాచారం. కస్టడీ గడువు ముగియడంతో బుధవారం సాయంత్రం తిరిగి విశాఖ సెంట్రల్ జైలుకు వారిని తరలించారు.

యోగాంధ్రలో 28.55 లక్షల మంది నమోదు

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యోగాంధ్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, ఈ కార్యక్రమంలో తమ వివరాలను భారీగా నమోదు చేసుకుంటున్నారని వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. 12 జిల్లాల్లో లక్ష్యానికి మించి వివరాలు నమోదు చేసుకున్నారన్నారు. మొదటి వారం ప్రగతిపై నివేదికలో వివరాలను బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్యానికి చేరువలో మరో 8 జిల్లాల్లో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్‌లలో విశాఖపట్నం, అంబేద్కర్ కోనసీమ, ప్రకాశం జిల్లాలు వెనుకంజలో ఉన్నాయన్నారు. నెలరోజుల పాటు సాగే యోగాంధ్రలో మొత్తం 2 కోట్ల మంది నమోదు లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పారు. మొదటి వారంలో 26.66 లక్షల మంది నమోదు చేసుకోవాల్సి ఉండగా, 28.55 లక్షల మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. 2,600 మంది మాస్టర్ ట్రైనర్ల నమోదు లక్ష్యంగా ఉండగా, 10,609 మంది నమోదు చేసుకున్నారని, 5,353 మంది మాస్టర్ ట్రైనర్లు శిక్షణ కూడా పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. 1.25 లక్షల మంది ట్రైనర్లు వారి వివరాలు నమోదు చేసుకున్నారని వెల్లడించారు.

డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి

విద్యా దృక్పథాలు-కమిటీలు-కమిషన్ల సూచనలు

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

విద్యా కమిటీల కమిషన్ల సూచనలు

(Recommendations of various Committees and Commissions during Pre-Independent and Post-Independent Period)

భారతదేశంలో స్వాతంత్రానికి పూర్వం, స్వాతంత్ర్యం తర్వాత విద్య గురించి వివిధ కమిటీలు, కమిషన్లు చేసిన సూచనలు గురించి తెలుసుకొందాం.

ఉడ్ తాఖీదు-1854
(Wood's Despatch-1854)

బ్రిటీష్ శాసన సభ కోరిక మేరకు ఈస్టిండియా కంపెనీ యొక్క బోర్డ్ ఆఫ్ కంట్రోల్ భారతదేశంలో ఒక సమగ్ర విద్యా వ్యవస్థను ప్రవేశ పెట్టడానికి నిర్ణయించింది. తదనుగుణంగా బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడు చార్లెస్ ఉడ్ ఒక తాఖీదును భారతదేశ పరిపాలనకు 1854లో పంపాడు. అదే ఉడ్ తాఖీదు" (Wood's Despatch).

ఉడ్ తాఖీదులోని ముఖ్యాంశాలు

1. ప్రతి ప్రావిన్స్‌లోను విద్యాశాఖను ఏర్పాటుచేసి దానిని నిర్వర్తించడానికి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇనస్ట్రక్షన్స్, అతనికి సహాయకారులుగా డెప్యూటీ డైరెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లను నియమించాలి.
2. విద్యా సంస్థలు ప్రాథమిక, జూనియర్, మిడిల్ పాఠశాలలుగా ఉండాలి.
3. ఇంగ్లీష్ కావాలన్న వారికి ఇంగ్లీష్, ఇతరులకు మాతృభాషను బోధనా భాషగా ఉపయోగించాలి.
4. లోకల్ బాడీలు ప్రయివేటు విద్యాసంస్థలను నడుపుకోవచ్చు.
5. పాఠశాలల స్థాపనకవసరమైన ఉపాధ్యాయుల కోసం ఉపాధ్యాయ శిక్షణకు ఏర్పాట్లు చేయాలి.
6. ఆడపిల్లల విద్యకు వసతులు కల్పించాలి.
7. మంచి పుస్తకాలు భారతీయ భాషల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు రాయాలి.
8. విద్యా సంస్థల్లో తటస్త మత విధానాన్ని అనుసరించాలి.

ఉడ్ తాఖీదు, హెచ్‌ఆర్ జేమ్స్ అన్నట్లు భారతీయ విద్యా విధానం 'మాగ్నా కార్టా' లాంటిది. దీని వలన విద్యాస్థాయిలు క్రమబద్ధీకరించ బడ్డాయి. బొంబాయి, మద్రాసు, కలకత్తాలలో విశ్వవిద్యాలయాలు వెలిశాయి. రాష్ట్రాల్లో విద్యా శాఖలు ఏర్పడ్డాయి. సహాయ విరాళాల విధానం కారణంగా ప్రభుత్వేతర రంగాల్లో విద్యా వ్యాప్తికి ప్రోత్సాహం లభించింది.

హంటర్ కమిషన్-1882
(భారతీయ విద్యా కమిషన్-1882)
(Hunter Commission - Indian Education Commission)

ఉడ్ తాఖీదుతో ఆశించినంత స్థాయిలో విద్యా వ్యాప్తి జరగకపోవడంతో విద్యా రంగ స్థితిగతులను పరిశీలించి విద్యాభివృద్ధికి మరొక ప్రణాళికను రూపొందించడానికి గవర్నర్ జనరల్ రిప్పన్ 1882లో సర్ విలియం హంటర్ అధ్యక్షతన భారతీయ విద్యా కమిషన్ (Indian Education Commission)ను నియమించారు. ఈ హంటర్ కమిషన్ భారతదేశ చరిత్రలో మొట్టమొదటి విద్యా కమిషన్.

హంటర్ కమిషన్ సూచనలు

1. ప్రభుత్వ కృషి ఎక్కువగా ప్రాథమిక విద్యా వ్యాప్తికె కేంద్రీకరించబడాలి.
2. ప్రాథమిక స్థాయిలో మాతృభాష బోధనా భాషగా ఉండాలి.
3. దేశీయ పాఠశాలలు నిర్వహించే ఉపాధ్యాయులకు వృత్తి విద్యలో శిక్షణ పొందేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇవ్వాలి.
4. ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ మోడల్ పాఠశాలను స్థాపించాలి.

5. ప్రభుత్వం మాధ్యమిక పాఠశాలల, కళాశాలల నిర్వహణను క్రమేపి విరమించుకొని వాటి నిర్వహణను ప్రభుత్వేతర సంస్థలకు, వ్యక్తులకు అప్పగించాలి. అయితే వీటికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి.
6. విద్యలో భారతీయతకు ప్రాధాన్యం ఇవ్వాలి.
7. మత విద్యను ప్రభుత్వ సంస్థలు చేపట్టరాదు కానీ ప్రయివేటు సంస్థలు ఆ పని చేసుకోవచ్చు.
8. స్త్రీలు, వెనుకబడిన తరగతుల వారి విద్యకు తగినన్ని అవకాశాలు కల్పించబడాలి.

హంటర్ కమిషన్ చేసిన సూచనలపై తీసుకొన్న చర్యలతో స్థానిక పరిపాలనా వ్యవస్థలు ఏర్పాటు చేయబడి విద్యా రంగం బాగా విస్తరింప బడింది.

హర్టాగ్ కమిటీ-1929
(Hartog Committee - 1929)

బ్రిటీష్ ప్రభుత్వం భారతందేశంలో విద్యా సమస్యలను అధ్యయనం చేయడానికి సర్ ఫిలిప్ హర్టాగ్ ఆధ్వర్యంలో ఒక కమిటీ (Hartog Committee) ని నియమించగా అది 1929లో తన నివేదికను సమర్పించింది.

హర్టాగ్ నివేదికలోని ముఖ్యాంశాలు

1. ప్రాథమిక విద్యలో మితిమీరి ఉన్న వృధా, స్తబ్దతలను తొలగించడానికి ఒక విద్యా విధానాన్ని తయారు చేయాలి.
2. విద్యారంగంలో ప్రమాణాలు పెరగడానికి ఉపాధ్యాయుల సర్వీస్ స్థితిగతులను మెరుగుపరచాలి.
3. స్త్రీ విద్య అభివృద్ధి
4. మైనార్టీల, వెనుకబడిన తరగతుల వారికి తగురీతిన విద్యనందించాలి.
5. విద్యార్థుల అభిరుచులకు తగినట్లుండడానికిగాను పాఠ్యాంశాలను విస్తృతపర్చాలి.
6. సెకండరీ స్థాయిలో వృత్తిపరమైన, సాంకేతికపరమైన, పరిశ్రమల పరమైన విద్యను ప్రోత్సహించాలి.

ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా ఈ కమిటీ సిఫార్సులు అంతగా అమలు కాకపోయినా 1921లో ఏర్పాటై ఆ తర్వాత రద్దయిన కేంద్ర విద్యా సలహా సంఘం (Central Advisory Board of Education) ఈ కమిటీ కారణంగా 1935లో తిరిగి పునరుద్ధరింపబడింది.

సార్జంట్ కమిటి - 1944 (Sargent Committee - 1944)

రెండో ప్రపంచ యుద్ధం (1939-44) తర్వాత భారతదేశంలోని విద్యాభివృద్ధి కోసం జాన్ సార్జంట్ సారథ్యంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది.

సార్జంట్ నివేదికలోని ముఖ్యాంశాలు

1. 3-6 సంవత్సరాల పిల్లలకు ప్రీప్రైమరీ, నర్సరీ విద్యనందించడంతో పాటు ఇందుకుగాను స్త్రీ ఉపాధ్యాయినిలను నియమించాలి.
2. 6-14 సం॥ల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య నందించే అవకాశం ఉండాలి.
3. 11-17 సం॥ల పిల్లల విద్యకు తగిన పాఠశాల వసతులు కల్పించబడాలి.
4. సాంకేతిక, వృత్తిపర, ఉపాధి, పరిశ్రమల విద్య కోసం శిక్షణా కేంద్రాలు స్థాపించాలి.
5. వయోజన విద్యకు అవకాశం కల్పించాలి.
6. ఉపాధ్యాయ శిక్షణను సరైన దిశలో అభివృద్ధి పరచాలి.
7. పేద బలహీన పిల్లలకు పౌష్టికాహారం అందించడానికి చర్యలు తీసుకోవాలి.
8. శారీరక, మానసిక వికలాంగులకు ప్రత్యేక వసతులు కల్పించాలి.
9. విద్యా పరిపాలనా వ్యవస్థను పటిష్టపర్చాలి.

భారతదేశంలో విద్యాభివృద్ధి కోసం సమర్పించిన నివేదికల్లో సార్జంట్ నివేదిక చాలా సమగ్రమైనది.

ముదలియార్ కమిషన్ (మాధ్యమిక విద్యా కమిషన్) - 1952-53

(Mudaliar Commission - 1952-53)

మాధ్యమిక విద్యలో సంస్కరణల కోసం 1952లో ఎ.లక్షణస్వామి ముదలియార్ 2 (Secondary Education Commission) ఏర్పాటుచేయబడింది.

ముదలియార్ కమిషన్ 1953లో చేసిన సూచనలు

1. మాధ్యమిక విద్యను ప్రయోజనకరంగా చేయడానికి మాధ్యమిక విద్యా కాల పరిమితిని పెంచి 12 సం॥ల పాఠశాల విద్యను ఏర్పాటు చేయాలి. ఈ 12 సం॥ల పాఠశాల విద్య 5 సం॥ల ప్రాథమిక విద్య, 3 సం॥ల మాధ్యమిక విద్య, 4 సం॥ల ఉన్నత మాధ్యమిక విద్యగా ఉండాలి.
2. ఇంటర్మీడియట్ ఉన్నత మాధ్యమిక విద్యా విధానం ఉండాలి.
3. బహుళార్థక మాధ్యమికోన్నత పాఠశాలలు స్థాపించాలి.
4. సాంకేతిక పాఠశాలలను, పరిశ్రమల పాఠశాలలను బహుళ సంఖ్యలో పరిశ్రమలకు దగ్గరలో స్థాపించాలి.



5. వికలాంగులు, వెనుకబడిన వారి కోసం పాఠశాలలు స్థాపించాలి.
6. పాఠ్యప్రణాళికలను విస్తృత పరచాలి.
7. విద్యార్థులకు సబ్జెక్టులను ఎంచుకోనే వీలు కల్పించాలి
8. పాఠ్య పుస్తకాల నాణ్యతను పెంచడానికి ఉన్నత స్థాయి కమిటీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించాలి.
9. ఎన్‌సిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్ లాంటి అంశాలకు స్థానం ఉండాలి.
10. ఆరోగ్యం పెంచడం కోసం ఆటలు ఆడించాలి.
11. విద్యార్థుల కోసం సలహా, మార్గదర్శకత్వ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
12. పరీక్షా విధానాన్ని సంస్కరించాలి.
13. ఉపాధ్యాయుల అర్హతలు, జీతం, సర్వీస్ నిబంధనల గురించి సూచనలు చేసారు.
14. పాఠశాల వసతుల వివరాలు కూడా ఇందులో పొందుపర్చబడ్డాయి.

కొఠారి కమిషన్ (విద్యా కమిషన్) - 1964-66 (Kothari Commission - Education Commission)

జాతీయ విద్యా విధానాన్ని సమూలంగా పరిశీలించి దాని అభివృద్ధికి తగిన సూచనలు చేయడం కోసం దేశవిదేశ ప్రముఖులతో డిఎస్ కొఠారి అధ్యక్షతన 1964లో భారత ప్రభుత్వం విద్యా కమిషన్ (Education Commission) ను నియమించింది. ఈ కమిషన్ 1966 జూన్ 29న ప్రభుత్వానికి సమర్పించిన తన Education and National Development అనే రిపోర్టులో అనేక సూచనలను చేసింది.

విద్యా కమిషన్ నివేదికలోని ముఖ్యాంశాలు

1. ఉత్పాదకతను పెంచడం, సామాజిక, జాతీయ సమగ్రతను సాధించడం, ఆధునీకరణ ప్రక్రియను వేగవంతం చేయడం, సామాజిక నైతిక ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడం జాతీయ విద్యా లక్ష్యాలుగా ఉండాలి.
2. విద్యా విధానం 10+2+3 గా ఉండాలి.
3. విజ్ఞానశాస్త్ర విద్యలో అంతర్భాగంగా ఉండాలి.
4. బోధనారంగానికి ప్రజ్ఞ కలవారిని ఆకర్షించడానికి తగిన అవకాశాలు ఉండాలి.
5. విద్యలో పని అనుభవానికి ప్రాధాన్యత ఉండాలి.
6. అన్ని విద్యా స్థాయిల్లో సామాజిక సేవ, జాతీయ సేవ అంతర్భాగంగా ఉండాలి.
7. దిగువ ప్రాథమిక స్థాయిలో మాతృభాష బోధనా భాషగా ఉండాలి. ఉన్నత ప్రాథమిక స్థాయిలో రెండు భాషలు బోధించొచ్చు.
8. విద్యను వృత్తిపరం చేయడం ఎంతైనా అవసరం.
9. విద్య సార్వత్రీకరణ కోసం సామాన్య పాఠశాల వ్యవస్థ (Common School System)ను ప్రవేశ పెట్టాలి.
10. వికలాంగులకు, వెనుక బడినవర్గాల వారికి మెరుగైన విద్యా సౌకర్యాలను అధిక సంఖ్యలో అందించాలి.
11. విద్యా విస్తరణ మానవ శక్తుల అవసరాల కనుగుణంగా జరగాలి.
12. నిరక్షరాస్యతను నిర్మూలించుటకు వయోజన విద్యా పథకాలను చేపట్టాలి..
13. బోధనలో నూతన విధానాల్ని వినియోగించు కోవడంతో పాటు ప్రాక్టికల్స్‌కు తగిన స్థానాన్ని ఏర్పర్చాలి.
14. విద్యావకాశాలు అందరికీ సమాన స్థాయిలో అందుబాటులోకి రావాలి.
15. ఉచిత పాఠ్యపుస్తకాలు అందించాలి.
16. ప్రాథమిక విద్యా సౌకర్యం 1 మైలు లోపు, ఉన్నత ప్రాథమిక విద్యా సౌకర్యం 3 మైళ్ళ లోపు వుండాలి.
17. ప్రాథమిక స్థాయిలో ట్యూషన్ ఫీజు విధించరాదు.
18. ప్రాథమిక స్థాయిలో ఒక భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం, పని అనుభవం, ఆరోగ్య విద్య, సృజనాత్మక కృత్యాలు కరిక్యులంలో వుండాలి.
19. ఉన్నత ప్రాథమిక స్థాయిలో మాతృభాష లేదా ప్రాంతీయ భాషతో పాటు హిందీ లేదా ఇంగ్లీష్ భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం, కళలు, పని అనుభవం, వ్యాయామ విద్య, నీతి విద్య కరిక్యులంలో వుండాలి.

ఈశ్వర్ భాయ్ పటేల్ కమిటీ - 1977 (టెన్ ఇయర్ కరిక్యులం రివ్యూ కమిటీ) (Ishwarbhai Patel Committee - 1977)

జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి (NCERT) 1975లో '10-ఇయర్ స్కూల్ కరిక్యులం - ఏ ఫ్రేమ్ వర్క్' అనే పాఠ్య ప్రణాళికను తీసికొచ్చింది. దీనిని రివ్యూ చేయడం కోసం 1977లో ఈశ్వర్ భాయ్ పటేల్ అధ్యక్షతన 'రివ్యూ కమిటీ ఆన్ 10 ఇయర్ స్కూల్ కరిక్యులం'ను ఏర్పాటు చేసింది.

కరిక్యులం రివ్యూ కమిటీ సూచనలు

1. విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక నిర్మాణ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక సంస్థలకు, విద్యా బోర్డులకు స్వేచ్ఛ నివ్వడం ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికా రచన, నిర్వహణకు అవకాశం లభిస్తుంది.
2. విద్యా ప్రణాళికలో మానవశాస్త్రాలు (humanities), విజ్ఞానశాస్త్రాలు (sciences), సాంఘికోపయోగ ఉత్పత్తి పని (SUPW) లకు తగిన ప్రాధాన్యత వుండాలి.
3. SUPWతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు పాఠశాల టైం టేబుల్ స్థానం కల్పించాలి.
4. 1 నుండి 5వ తరగతి వరకు చేసిన సూచనలు:

ఎ. ప్రాథమిక స్థాయిలో పిల్లలు పాఠశాలలో రెండున్నర నుండి మూడు గంటలకు మించి ఉండనవసరంలేదు.
బి. ఖచ్చితమైన టైం టేబుల్ అంత ఆరోగ్యకరమైన విధానం కాదు.
సి. భాషకు తప్ప ఒకటి, రెండో తరగతులకు పాఠ్యపుస్తకాల అవసరంలేదు.
డి. 3 నుండి 5వ తరగతి వరకు భాష, గణితం, పరిసరాల విజ్ఞానానికి ఒక్కో పుస్తకం చాలు.
ఇ. ఇంటి పని ఐదో తరగతి వరకు అవసరం లేదు.
ఎఫ్. ఖచ్చితమైన విద్యా సంవత్సరం కాక స్థానిక అవసరాల కనుగుణంగా విద్యా సంవత్సరం వుండాలి.

5. పాఠ్యపుస్తకాల తయారీలో బోధనోపకరణాలపై దృష్టి పెట్టాలి.
6. నియత, అనియత విద్యా విధానాల ద్వారా మధ్యలో బడి మానేసిన పిల్లలు పాఠశాల ప్రధాన స్రవంతిలో చేరడానికి అవకాశం కల్పించాలి.
7. సృజనాత్మక ప్రక్రియలను, ప్రయోగాలను, పరిశోధనలను చేపట్టడానికి అనువైన వాతావరణాన్ని పాఠశాలల్లో కల్పించాలి.
8. పిల్లలు ఉల్లాసంగా చదువుకోడానికి, ఉపాధ్యాయులు బాగా పనిచేయడానికి తగిన వసతులను కల్పించాలి.

రేపు : జాతీయ విద్యావిధానం -1986

సంపాదకీయం

వెండితెర వివాదం!

తెలుగు సినిమా పరిశ్రమలో గతంలో ఎన్నడూ లేని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అనేక సంక్షోభ సమయాల్లో ప్రభుత్వంతో కలిసి అడుగులేసి రాష్ట్ర ప్రజానీకానికి అండగా నిలిచిన చరిత్ర తెలుగు సినిమాది! ప్రభుత్వాల్లోని పెద్దలు కూడా సినీ పరిశ్రమకు వచ్చిన కష్టాన్ని తమదిగా భావించి పరిష్కరించడానికి కృషి చేసేవారు. పరస్పరం వ్యక్తమైన ఆ సౌహార్ద్రత, స్నేహ భావాల వల్లే చెన్నై (ఒకప్పటి మద్రాసు) నుండి తెలుగు పరిశ్రమ భాగ్యనగరానికి తరలిరాగలిగింది. లేకుంటే ఇప్పటికీ తెలుగు పరిశ్రమకు తమిళనాడే కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది! కానీ, పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సాగే ఆ బంధాలు ఇప్పుడు మాయమవుతున్నాయి. వెండితెర రాజకీయ రంగును పులుముకుంటోంది. రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం విడుదలకు సిద్ధమైన సమయంలోనే థియేటర్ల బంద్ అంశం తెరమీదకు రావడం, దానికి పవన్‌కల్యాణ్ తీవ్రంగా స్పందించడంతో వివాదం ఒక్కసారిగా భగ్గుమంది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభుత్వ, సినీ ప్రముఖుల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. నిజానికి ఇది ఇప్పటికిప్పుడు ముందుకొచ్చిన అంశం కాకపోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సినిమా సమస్యల పరిష్కారం కోసం తన నివాసానికి వచ్చిన సినీ ప్రముఖులు చిరంజీవి తదితరులకు సరైన మర్యాద ఇవ్వలేదంటూ వివాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. సినిమా రంగానికి చెందిన వారు కొందరు టిడిపితో మరికొందరు వైసిపితో సన్నిహితంగా ఉండటంతో ఈ వివాదం గత ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా కూడా మారింది. మెగాస్టార్‌గా గుర్తింపు పొందిన చిరంజీవికి, ఆయన బంధువు సినీ ప్రముఖులు అల్లు అరవింద్ కుటుంబాల్లో నెలకొన్న వివాదాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. బంద్ ప్రకటనలో కుట్ర ఉందని, దాని వెనుక ఉన్న వారిని వెలికితీయాలని పవన్‌కల్యాణ్ అనడం వెనుక ఈ కోణం కూడా ఉండవచ్చు. అనంతరం అల్లు అరవింద్, దిల్ రాజు వంటి వారు వివరణలిచ్చారు.

తాజా వివాదంలో థియేటర్ల నిర్వహణ, టికెట్ ధరల నియంత్రణ, ప్రభుత్వ సహకారం, తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పరిశ్రమలో ఉన్న కొందరు నిర్మాతలు, పంపిణీదారులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమైంది. పవన్ కల్యాణ్ స్వయంగా సినిమా హాళ్లలో సౌకర్యాలు, తినుబండారాల ధరలు వంటి అంశాలను ప్రస్తావించారు. నిర్మాతలు తమ సినిమాలకు ఖర్చు పెరిగిందని టిక్కెట్ ధరలు పెంచాలని కోరుతున్నారు. పలుకుబడి ఉన్న వారు ప్రభుత్వ పెద్దలను కలిసి వ్యవహారాలను చక్కబెట్టుకుంటే, ఆ పని చేయలేని చిన్న నిర్మాతలు చిక్కిపోతున్నారు. అధికారులూ, నిర్మాతలూ టికెట్ ధరల కోసం కోర్టు మెట్లెక్కాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొత్త ఫిల్మ్ పాలసీ తెస్తామంటూ చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఎనిమిదేళ్లుగా చిన్న సినిమాలకు సబ్సిడీలు విడుదల కావడం లేదు. నంది అవార్డులు నిలిచిపోయాయి. స్టూడియోల అభివృద్ధి ఒక కలగా మారింది. హైదరాబాద్‌లో వందల కోట్ల పెట్టుబడులతో సినిమాలు తీస్తుంటే, మన రాష్ట్రంలో విజయవాడ, విశాఖ, తిరుపతి వంటి నగరాల్లో కనీస మౌలిక వసతులే లేవు. షూటింగ్ లైసెన్స్‌లకు కూడా ఒక విధానం లేదు. ఆధునిక వసతులతో టెక్నికల్ యూనిట్లు, సౌండ్ స్టూడియోల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఇవేవీ లేకుండా రాష్ట్రంలో సినిమా పరిశ్రమ ఎలా అభివృద్ధి చెందుతుంది? హైదరాబాద్ నుండి ఇక్కడకు ఎందుకు తరలి వస్తుంది?

ఇక మల్టీప్లెక్స్‌ల్లో చిన్న వాటర్ బాటిల్, పాప్‌కార్న్, సమోసా ధరలు సగటు ప్రేక్షకులకు చుక్కలు చూపిస్తున్నాయి. టిక్కెట్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. వీటి కారణంగానే చాలా కుటుంబాలు సినిమాలకు వెళ్లడం మానుకుంటున్నాయి. సినిమా పరిశ్రమ కళకళలాడాలంటే ప్రజలు థియేటర్లకు వెళ్లాలి. అది జరగాలంటే, టిక్కెట్ల ధరలు పెంచడం వంటి తాత్కాలిక చర్యలు ప్రజల జేబుకే చిల్లుపెడతాయి. కక్ష సాధింపు చర్యలు, బెదిరింపులు పరిష్కారం కావు. తెలుగుదేశం, జనసేన పార్టీల వ్యవస్థాపకులు సినీ రంగం నుండి వచ్చినవారే. తమ మూలాలను మరచిపోకుండా, సమన్వయంతో పరస్పర చర్చల ప్రాతిపదికన సినిమా సంక్షోభాన్ని ప్రభుత్వమే పరిష్కరించాలి. అంతిమంగా సామాన్య ప్రజలకు చౌకగా వినోదం అందుబాటులో ఉండాలి.

మంచి మాట

ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోనూ, బల ప్రయోగంతోనూ అణచివేయలేరు. చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

- సాల్వడార్ అలెండీ,
అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత.

విశ్లేషణ

ఇంటి పన్నుల బాదుడు

ఈ స్థితిలో ప్రజలు, పౌర సంఘాలు అప్రమత్తంగా ఉండి ఈ విధానాలను తిప్పి కొట్టాలి. తక్షణం ఇంటి పన్నుల పెంపు కోసం నిర్వహిస్తున్న సర్వేని నిలిపివేయాలి. ఇప్పటికే పెంచిన 15 శాతం ఇంటి పన్ను రద్దు చేయాలి. ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలి. చట్టాన్ని, జీవోలను ఉపసంహరించాలి. మంచినీరు, డ్రైనేజీ చార్జీలను హేతుబద్ధం చేయాలి. పేదలకు ఉచితంగా మంచినీరు అందించాలి. నీటి మీటర్లు ఆపాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లలో స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వాలి. పెండింగ్‌లో ఉన్న గ్రాంట్లు మంజూరు చేయాలి. ఇంటి పన్ను పెంపుపై పౌర, ప్రజా సంఘాలు ఉమ్మడిగా ప్రభుత్వంపై, అధికార ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తేవాలి. క్షేత్ర స్థాయి నుండి ఉద్యమాలకు సిద్ధం కావాలి.

సిహెచ్. బాబూరావు

రాష్ట్రంలో కూటమి పాలనకు సంవత్సరం పూర్తయి తొలి వార్షికోత్సవానికి సిద్ధమవుతోంది. 123 నగరాలు, పట్టణాల్లోని కోటి 50 లక్షల మంది ప్రజలకు రూ.784 కోట్ల ఇంటి పన్నుల పెంపుతో వార్షికోత్సవ 'కానుక'ను పాలకులు అందిస్తున్నారు. ఈ ఏప్రిల్ నుండి గుట్టుచప్పుడు కాకుండా 15 శాతం (రూ.320 కోట్లు) ఇంటి పన్ను (ఆస్తి పన్ను) పెంచేశారు. మళ్లీ మొత్తం 40 లక్షల ఇళ్ళు, కట్టడాలకు కొలతలు వేసి మరో 20 శాతం (రూ.464 కోట్లు) పన్నులు పెంచడానికి ఆగమేఘాలపై సర్వే చేస్తున్నారు. మొత్తం కలిపి 35 శాతం (రూ.784 కోట్లు) భారం పట్టణ ప్రజల నెత్తిన పడుతుంది. ఈ పన్ను భారం రూ.1500 కోట్ల వరకు పెరిగే ప్రమాదం ఉంది. విశాఖలో రూ.112 కోట్లు, విజయవాడలో రూ.40 కోట్లు, తిరుపతిలో రూ.18 కోట్లు ఇలా 123 పట్టణాల వారీగా పన్నుల పెంపుకు ముందస్తుగానే లక్ష్యాలు నిర్ణయించి ఆదేశాలు పంపారు.

కేంద్రం షరతులు.. రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు...

గతంలో పట్టణాలలో అద్దె విలువను బట్టి ఇంటి పన్ను వేసేవారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే పెంచేవారు. కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో ఆత్మ నిర్భర్ భారత్ పేరుతో రాష్ట్రాలకు రుణ పరిమితిని పెంచడానికి షరతులు విధించింది. పట్టణ సంస్కరణల ముసుగులో అద్దె విలువ కాకుండా ఆస్తి విలువ (భూమి, కట్టడం మొత్తం విలువ) ఆధారంగా ఆస్తి పన్ను (ఇంటి పన్ను) విధించాలని ఆదేశాలు ఇచ్చారు. నాటి వైసిపి ప్రభుత్వం అప్పుల కోసం లొంగిపోయి ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని అంగీకరించింది. 2020లో తొలుత ఆర్డినెన్స్, ఆ తర్వాత చట్టం, ఆపై జీవోలు (నెంబర్ 198) విడుదల చేసింది. భారీగా పన్నులు పెరగనున్నందున జనం, సంఘాలు, సిపిఎం ఆందోళనలు చేశాయి. ప్రజల కళ్ళు కప్పటానికి వైసిపి సర్కార్ ప్రతి సంవత్సరం 15 శాతం మించి పన్ను పెంచబోమని నమ్మబలికింది. కొన్ని ఆదేశాలు ఇచ్చారు. ఆస్తి విలువ ఆధారిత విధానాన్ని మాత్రం రద్దు చేయడానికి మొండిగా నిరాకరించింది.

ఈ విధానం ప్రకారం ఆస్తి విలువపై నివాస గృహాలకు ప్రతి సంవత్సరం 0.1 నుండి 0.5 శాతం వరకు, నివాసం కాని ఇతర నిర్మాణాలపై (వ్యాపార, ఇతర సంస్థలు) 0.2 నుండి 2 శాతం వరకు, ఖాళీ స్థలాలపై 0.25 నుండి 0.5 శాతం వరకు పన్ను విధిస్తారు. ప్రభుత్వాలు ఆదాయం కోసం ప్రతి సంవత్సరం అధికారయుతంగా భూములు, కట్టడాల విలువను ఇష్టం వచ్చినట్లు పెంచుతాయి. ఈ విధానంతో ప్రతి సంవత్సరం శాశ్వతంగా పన్నులు పెరుగుతూనే ఉంటాయి. గతంలో అద్దె విలువ ఆధారంగా వేసే పన్నులకు, ఆస్తి విలువ ఆధారంగా వేసే పన్నులకు భారీ తేడా ఉంటున్నది. 2021 నుండి 5 సంవత్సరాలలో ఇంటి పన్ను రాష్ట్రంలో సంవత్సరానికి రూ.1188 కోట్ల నుండి రూ. 2137 కోట్లకు పెరిగిపోయింది. దాదాపు ప్రతి సంవత్సరం రూ.948 కోట్ల అధికంగా పన్ను భారం పడుతున్నది.

మాట తప్పిన కూటమి

ఎన్నికల సమయంలో తెలుగుదేశం, కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, ఇంటి పన్ను భారాలు వేయబోమని హామీ ఇచ్చాయి. మేనిఫెస్టోలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 15 శాతం ఇంటి పన్ను పెరిగింది. మళ్లీ 2025 ఏప్రిల్ నుండి ప్రజల కళ్ళు కప్పి 15 శాతం పెంచేశారు. ఇంతటితో ఆగకుండా ఇప్పుడు మళ్లీ సర్వే ప్రారంభించి, 20 శాతం తగ్గకుండా పన్నులు పెంచాలని ఈ నెల 14వ తేదీన రాతపూర్వకంగా మున్సిపల్ శాఖ ఆదేశాలు ఇచ్చింది. పన్నులు లేని ఇళ్లకు పన్ను వేస్తామని, పన్నులలో తేడాలు సరిచేస్తామని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది. పన్ను లేని ఇళ్లకు పన్ను వేయటానికి అన్ని ఇళ్లకూ ఎందుకు సర్వే చేయాలి? కొలతలు వెయ్యాలి? సర్వే చేయకుండానే ఏ మున్సిపాలిటీలో, ఎంత పన్ను పెంచాలో ముందుగానే కోటాలు ఎందుకు ఇచ్చారు? దీనినిబట్టి ఏదో ఒక వంకతో పన్నులు పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వే చేస్తున్నదని అర్థమవుతున్నది. అధికారులు ప్రతి ఇంటికి వస్తున్నారు. సర్వే చేస్తున్నారు. కొలతలు వేస్తున్నారు. ఇంటిలో అదనపు గది కట్టినా, బాత్రూమ్ కట్టుకున్నా, అదనపు అంతస్తు నిర్మించుకున్నా, వరండా రేకుల షెడ్డు వేసుకున్నా, చిరు వ్యాపారం పెట్టుకున్నా...ఒక్క గజం కట్టడం పెరిగినా దీనిని అదనపు కట్టడంగా, వినియోగ మార్పిడిగా గుర్తించి మొత్తం పన్ను మార్చేస్తారు. కొత్త పన్నుగా పరిగణిస్తారు. గతంలో ఉన్న పన్నుపై 15 శాతం మించి పన్ను పెంచకూడదనే నిబంధనను పక్కన పెట్టేస్తారు. మొత్తం ఆస్తి విలువ ఆధారంగా మొత్తం విస్తీర్ణానికి పన్ను వేస్తారు. దీనివలన పాత పన్నులతో సంబంధం లేకుండా అడ్డగోలుగా పెరిగే ప్రమాదం ఉంది.

పాత ఇళ్లకు ప్లాన్లు లేవు. చిన్న ఇళ్లకు ప్లాన్లు ఉండవు. ప్లాన్ తీసుకుని ఇల్లు నిర్మించుకున్నా, చిన్న మార్పులు ఉంటాయి. అదనపు గదులు కట్టుకుంటారు. అధికారుల సర్వేలో ప్లాన్ లేనివి, ప్లాన్‌లో లేకుండా అదనంగా కట్టినవి గుర్తించి, వాటిని అక్రమ కట్టడాలుగా ముద్ర వేస్తారు. పది శాతం లోపు ప్లాన్‌కి మించి నిర్మాణాలు ఉంటే 25 శాతం వరకు, 10 శాతం మించిన అదనపు కట్టడం ఉంటే 50 శాతం వరకు, మొత్తం అంతస్తుకు ప్లాను లేకపోతే 100 శాతం వరకు పెనాల్టీ విధించడానికి సిద్ధమవుతున్నారు. ఇది ఒక్క సంవత్సరం కాదు. ప్రతి సంవత్సరం ఇంటి పన్నుతో పాటు కలిపి దీనిని అదనంగా వసూలు చేస్తారు. మరోవైపు పలు చోట్ల దశాబ్దాల నుండి పేదలు ప్రభుత్వ స్థలాలలో ఇళ్ళు వేసుకుని జీవిస్తున్నారు. వారికి పట్టాలు ఉండవు. ప్లాన్లు ఇవ్వరు. ఇప్పుడు మొత్తం ఆ ఇళ్ళు అన్నింటిని అక్రమ కట్టడాలుగా పరిగణిస్తారు. వారందరికీ ఇంటి పన్నుతో పాటు 100 శాతం ప్రతి సంవత్సరం పెనాల్టీ వసూలు చేస్తారు. అప్పులు చేసి స్థలాలు కొని, ఇళ్ళు కట్టుకున్న పేద, మధ్యతరగతి ప్రజలపై పన్నులు పెంచి, పెనాల్టీలు వేసి శిక్షించడం తగునా? పలు గ్రామాలను...మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేశారు. దీనితో పంచాయితీలలో కంటే అధికంగా పన్నులు పెరిగి విలీన గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఇళ్లకు అత్యధిక భాగం ప్లాన్లు ఉండవు. ఇప్పుడు వాటిని అనధికార కట్టడాలుగా గుర్తిస్తే, విలీన ప్రాంతాలలో ప్రతి ఒక్కరి పైన 100 శాతం పైన పెనాల్టీ పడే ప్రమాదం ఉంది. ఇంటి పన్నుపై అదనంగా 8 శాతం గ్రంథాలయ సెస్ వసూలు చేస్తున్నారు. ఇంటి పన్ను పెరగగానే గ్రంథాలయ సెస్ పెరుగుతుంది. ఇంటి పన్నుపై సంవత్సరం పూర్తి కాకుండానే, రెండు నెలల నుండే 24 శాతం వడ్డీ వసూలు చేయటం దుర్మార్గం. పన్ను సకాలంలో చెల్లించలేదని మంచినీటి కనెక్షన్లు తొలగిస్తున్నారు ఇళ్లకు సీళ్లు వేస్తున్నారు.

వ్యాపార సరుకులుగా పౌర సదుపాయాలు

ఇంటి పన్నులో సగభాగం జనరల్ పన్ను కాగా, మిగిలిన సగ భాగం మంచినీరు, డ్రైనేజీ, వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ పన్నుగా ఉంటుంది. ఒకవైపున ఇంటి పన్నులో భాగంగా ఇవన్నీ వసూలు చేస్తూనే మరోవైపు మంచినీటి చార్జీలు, భూగర్భ డ్రైనేజీ చార్జీలు వసూలు చేయటం మరో మోసం. పేదలకు మంచినీటి కనెక్షన్లు ఉచితమని, 200 రూపాయలకే కనెక్షన్లని నమ్మించి ఇచ్చారు. ఇప్పుడు ప్రతి నెలా రూ.100 నుండి రూ.400 వరకు నీటి చార్జీలు పట్టణాల్లో వసూలు చేస్తున్నారు (గుంతకల్లు పట్టణంలో రేకుల షెడ్డు వేసుకున్న నిరుపేద ఇంటికి సంవత్సరానికి రూ.54 ఇంటి పన్ను కాగా, రూ.1344 మంచినీటి చార్జీ). కొన్ని నగరాలలో ఇంటి పన్ను ఆధారంగా నీటి చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇంటి పన్ను పెరిగితే మళ్లీ మంచి నీటి చార్జీలు పెరుగుతాయి. సంస్కరణలలో భాగంగా నీటి మీటర్లు పెట్టడానికి రంగం సిద్ధమవుతోంది. ఇక లీటర్ల చొప్పున నీరు కొనుక్కోవాల్సిందే. భూగర్భ డ్రైనేజీ సదుపాయం ఉన్న ప్రాంతాలలో ఇళ్లల్లో మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయో లెక్కించి వాటి ఆధారంగా డ్రైనేజీ చార్జీలు వసూలు చేయటం దారుణం. మంచినీటి కనెక్షన్లకు, డ్రైనేజీ కనెక్షన్లకు ముందుగా డొనేషన్ల పేరుతోనూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. వ్యాపారుల దగ్గర ట్రేడ్ లైసెన్సుల వసూళ్లకు అడ్డు అదుపు లేదు. పార్కుల్లో ప్రవేశానికి ఫీజులు నిర్ణయిస్తున్నారు. ఇలా ప్రతి పనికి రేటు కట్టి మరీ యూజర్ చార్జీలు, పన్నులు, ఫీజులు వసూలు చేయటం సర్వసాధారణంగా మారిపోయింది.

ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు మంచినీరు, డ్రైనేజీ, ప్రజారోగ్యం తదితర పౌర సదుపాయాల కల్పన, నిర్వహణను పూర్తిగా విస్మరించాయి. ప్రభుత్వం, మున్సిపల్ మంత్రి పట్టణాల అభివృద్ధినీ పట్టించుకోవటం లేదు. కానీ ఖజానా నింపుకోవటానికి, యుద్ధ ప్రాతిపదికపై జూన్ నెలాఖరు లోపల సర్వేలు పూర్తి చేయాలని, పన్నులు పెంచాలని ఆదేశాలు ఇచ్చారు. చట్ట ప్రకారం మున్సిపాలిటీలలో ఎన్నికైన కౌన్సిళ్లకు సంబంధం లేకుండా పన్నులు పెంచకూడదు. కానీ ప్రభుత్వాలు పైనుండి ఆదేశాలిస్తూ స్థానిక సంస్థలను లెక్క చేయకుండా పన్నులు పెంచడం నిరంకుశత్వం.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను సేవా సంస్థలుగా కాకుండా వ్యాపార సంస్థలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్చేశాయి. ప్రజలపై నిరంతరం పన్నులు పెంచి స్థానిక సంస్థలు నడుపుకోవాలని ఆదేశిస్తున్నారు. దీనిలో భాగంగానే ఇంటి పన్ను ప్రతి సంవత్సరం ఆస్తి విలువ ఆధారంగా పెంచే విధానాలను తెచ్చారు. మంచినీరు, డ్రైనేజీని వ్యాపార సదుపాయాలుగా మార్చేశారు. ప్రజల ఆందోళన ఫలితంగా చెత్త పన్ను రద్దు చేశారు. కానీ దొడ్డిదారిన ఇంటి పన్ను పెంచి అంతకు మించిన భారాన్ని ప్రజలపై కూటమి ప్రభుత్వం వేయటం మోసపూరితం. మరోవైపు అదాని ఇతర కార్పొరేట్ కంపెనీల పోర్టులు, పరిశ్రమలు, స్టార్ హోటళ్ల, సంస్థలకు ఆస్తి పన్ను చెల్లించకుండా మినహాయింపులు ఇస్తున్నారు. కొత్తగా బడా పరిశ్రమలు పెడితే వారికి పన్నుల రాయితీలని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. 40 చదరపు గజాల లోపు ఉన్న పేదల ఇళ్లకు రూ.50 మాత్రమే పన్ను విధించాలని నిబంధనలు ఉన్నా, దానిని సక్రమంగా అమలు చేయడం లేదు. బడా కంపెనీలకు రాయితీలు, పేద, మధ్య తరగతికి పన్నుల భారాలు ప్రభుత్వాల విధానంగా మారిపోయింది.

అందరిదీ ఒకటే దారి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక సంస్కరణలను బలపరచటంలో, అమలు చేయడంలో టిడిపి, జనసేన, వైసిపి అందరిదీ ఒకటేదారి. ఎవరు ప్రభుత్వంలో ఉంటే వారు ప్రజావ్యతిరేక సంస్కరణలను అమలు చేస్తూ ప్రజలపై భారాలు పెంచుతున్నారు. వైసిపి దారిలోనే కూటమి ప్రభుత్వం నడుస్తోంది.

ఈ స్థితిలో ప్రజలు, పౌర సంఘాలు అప్రమత్తంగా ఉండి ఈ విధానాలను తిప్పి కొట్టాలి. తక్షణం ఇంటి పన్నుల పెంపు కోసం నిర్వహిస్తున్న సర్వేని నిలిపివేయాలి. ఇప్పటికే పెంచిన 15 శాతం ఇంటి పన్ను రద్దు చేయాలి. ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలి. చట్టాన్ని, జీవోలను ఉపసంహరించాలి. మంచినీరు, డ్రైనేజీ చార్జీలను హేతుబద్ధం చేయాలి. పేదలకు ఉచితంగా మంచినీరు అందించాలి. నీటి మీటర్లు ఆపాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లలో స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వాలి. పెండింగ్‌లో ఉన్న గ్రాంట్లు మంజూరు చేయాలి. ఇంటి పన్ను పెంపుపై పౌర, ప్రజా సంఘాలు ఉమ్మడిగా ప్రభుత్వంపై, అధికార ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తేవాలి. క్షేత్ర స్థాయి నుండి ఉద్యమాలకు సిద్ధం కావాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

వ్యాఖ్య

సుప్రీంకోర్టు ముందు విడ్డూరపు నాటకం

మనం చాలా విడ్డూరమైన రాజకీయ నాటకంలో చిక్కుకు పోయాం. సుప్రీంకోర్టు రాష్ట్రపతి ప్రశ్నలపై స్పందించి తీరాల్సిన అవసరం లేదు. ఒక వేళ స్పందించినా ఆ అభిప్రాయాలకే కట్టుబడి వుండనవసరం లేదు. మోడీ ప్రభుత్వం చాలా గొప్ప విషయంలా చేసిన ఈ తతంగం ఎందుకో మరీ ముఖ్యంగా అది ఇప్పుడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో దాని బండారమేమిటో ఇట్టే తెలిసిపోతుంది. అయితే ఇది కేవలం రాజకీయ నాటకం మాత్రమే అనుకోవడం అమాయకత్వమే. ప్రభుత్వం హిందూత్వ భావజాల పరంగా నడుస్తున్నది. భారత రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి, అందులోని ఏర్పాట్లకు ఆ భావజాలం వ్యతిరేకమైంది. ఆర్‌ఎస్‌ఎస్ అగ్ర సిద్ధాంతకారుడైన ఎం.ఎస్.గోల్వాల్కర్ సమాఖ్యతత్వం అనేదాని నిజమైన స్ఫూర్తిని ఏనాడూ ఆమోదించలేదు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తరపున ప్రస్తావనగా మళ్లీ దాని పరిశీలనకే పంపడం ద్వారా ఢిల్లీలో ఒక చవకబారు ప్రహసనం ఆవిష్కృతమవుతున్నది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదించడానికి లేదా తిరస్కరించడానికి నిర్ణీత కాల వ్యవధిని నిర్ణయిస్తూ అదివరలో ఇచ్చిన తీర్పుపై వివరణ కోరుతూ ఈ ప్రస్తావన పంపడం మహా విడ్డూరపు నాటకం తప్ప మరొకటి కాదు. కోర్టు మొదట ఇచ్చింది...నిరంకుశ ఏకపక్ష ఉత్తర్వు ఏమీ కాదు. అనేక తీర్పుల ద్వారా రూపొందిన సుస్థాపితమైన న్యాయసూత్రాల మార్గంలో వున్నదే.

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి వ్యవహరించిన తీరుపై అదివరలో సుప్రీం ఇచ్చిన ఆదేశాలపై 14 ప్రశ్నలు లేవనెత్తుతూ 143(1) అధికరణం కింద రాష్ట్రపతి ఈ ప్రస్తావన పంపించారు. శాసనసభ ఆమోదించిన 14 బిల్లులకు అంగీకార ముద్ర వేయకుండా గవర్నర్ అంతులేని జాప్యం చేయడంపై తమిళనాడు ప్రభుత్వమే కోర్టును ఆశ్రయించింది. రాజ్యాంగ నిర్మాతలూ వచ్చిన బిల్లులపై 'సాధ్యమైనంత తొందరగా' సంతకం చేయాలని గౌరవప్రదంగా పేర్కొన్నారు. కావాలనే కాల వ్యవధి అన్న పదం వాడకుండా సాధ్యమైనంత తొందరగా అన్న ఈ పదం వాడారుగానీ దాని అర్థం ఎడతెగని జాప్యం చేయవచ్చని కాదు. మరికొన్ని ఇతర రాజ్యాంగాల వలెగాక మన రాజ్యాంగం ప్రకారం కోర్టు అభిప్రాయాన్ని కోరే నిబంధన స్పష్టంగానే పేర్కొనబడింది. రాష్ట్రపతి మాత్రమే కాదు. ఒక పౌరుడు కూడా కోర్టు అభిప్రాయం అడగవచ్చును. రాష్ట్రపతి అడిగినంత మాత్రాన కోర్టు అధికార పూర్వకంగా లోబడి వుండాలనేమీ లేదు.

చాలా లెక్కలతోనే...

వాస్తవాలు ఇలా వున్నప్పుడు కేంద్రం ఈ రాజకీయ సన్నివేశాన్ని సృష్టించడం చాలా తీవ్రమైన లెక్కలతోనే జరిగిందని భావించాల్సి వస్తుంది. బిజెపి యేతర ప్రభుత్వాలు తమ శాసనాధికారాన్ని ఉపయోగించడం మోడీ ప్రభుత్వానికి ఇష్టం లేదు. కనుకే సుప్రీంకోర్టు ఉత్తర్వుపై దానికి మినహాయింపులు వుండటమే కాదు. అసలు ఏ మాత్రం మింగుడు పడలేదేమోనని భావించవలసి వస్తుంది.

తమిళనాడు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక ఎలాంటి హడావుడి లేదు సరికదా గవర్నర్ నిగూఢమైన నిశ్శబ్దం పాటిస్తున్నారు. కానీ జగడాలమారి ఉపరాష్ట్రపతి మాత్రం రాజకీయ తగాదాకు తెరతీశారు. సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంటుగా మారిపోయిందని ఆయన నోరు పారేసుకున్నారు. మరోవైపు చూస్తే గవర్నర్ రవి అసలేమీ జరగనట్టే ప్రవర్తిస్తున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వు మేరకు ఆయనకు విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా వుండే హక్కు లేకుండా పోయినప్పటికీ ఆయన మాత్రం అందమైన పర్వత విడిదిలో వైస్ ఛాన్సలర్ల సమావేశం ఏర్పాటు చేశారు.

ఆ రెండు మార్గాలు వదలి...

మామూలుగా ఏదైనా తీర్పుపై అసంతృప్తి ఏర్పడినట్టయితే సమీక్షించాల్సిందిగా కోరుతూ పిటిషన్ దాఖలు చేయొచ్చు. ఎందుకంటే సుప్రీంకోర్టు నిర్ణయానికి అతీతంగా మరే అప్పీళ్లు వుండవు. అరుదైన సందర్భాల్లో ఉపశమనం కలిగించమని కోరుతూ క్యూరేటివ్ పిటిషన్ వేయొచ్చు. మరో మార్గం ఏమంటే ఆ తీర్పు ప్రభావం తోసిపుచ్చేలా పార్లమెంటులో మరో చట్టం చేయవచ్చును. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం సెర్చి కమిటీ ఎలా వుండాలన్న అంశంలో ప్రభుత్వం చేసిందదే. కానీ ఈ సందర్భంలో ప్రభుత్వం అలాంటి అవకాశాలు వేటినీ ఉపయోగించుకోలేదు. ఇలాంటి అంశాల్లో సంప్రదింపులు జరపాల్సిన అటార్నీ జనరల్‌తోనూ మాట్లాడలేదు.

ఒరిగేదేంటి?

గందరగోళం లేకుండా ఒక విషయం స్పష్టం చేయాలి. 74వ అధికరణానికి 42వ రాజ్యాంగ సవరణ చేసిన తర్వాత రాష్ట్రపతి కేంద్ర క్యాబినెట్ సలహా ప్రకారం నడుచుకోవడం అనివార్యమే. కనుక ప్రస్తుతం రాష్ట్రపతి పంపిన ప్రస్తావన రాజకీయ సంకేతం తప్ప మరొకటి కాదు. సాధ్యమైనంత తొందరగా అన్న పద ప్రయోగం కాల వ్యవధిని సూచిస్తుందని సుప్రీంకోర్టు చెప్పిన వ్యాఖ్యానంతో తాను అంగీకరించడం లేదనే సందేశం ప్రభుత్వం పంపదల్చుకుంది. ఈ తిరస్కారం సువ్యవస్థితమైన న్యాయ సూత్రాలకు విరుద్ధం. 1974లో షంషేర్ సింగ్ కేసులో గవర్నర్లు ఎన్నికైన రాష్ట్ర మంత్రివర్గ సూచనల మేరకే పనిచేయాలని స్పష్టం చేయబడింది. బ్రిటన్ లేదా అమెరికా అధ్యక్షుల వలె వారు ఇష్టానుసారం వ్యవహరించలేరని చెప్పింది.

అసలు దాడి

ఈ విధంగా మనం చాలా విడ్డూరమైన రాజకీయ నాటకంలో చిక్కుకు పోయాం. సుప్రీంకోర్టు రాష్ట్రపతి ప్రశ్నలపై స్పందించి తీరాల్సిన అవసరం లేదు. ఒక వేళ స్పందించినా ఆ అభిప్రాయాలకే కట్టుబడి వుండనవసరం లేదు. మోడీ ప్రభుత్వం చాలా గొప్ప విషయంలా చేసిన ఈ తతంగం ఎందుకో మరీ ముఖ్యంగా అది ఇప్పుడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో దాని బండారమేమిటో ఇట్టే తెలిసిపోతుంది. అయితే ఇది కేవలం రాజకీయ నాటకం మాత్రమే అనుకోవడం అమాయకత్వమే. ప్రభుత్వం హిందూత్వ భావజాల పరంగా నడుస్తున్నది. భారత రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి, అందులోని ఏర్పాట్లకు ఆ భావజాలం వ్యతిరేకమైంది. ఆర్‌ఎస్‌ఎస్ అగ్ర సిద్ధాంతకారుడైన ఎం.ఎస్.గోల్వాల్కర్ సమాఖ్యతత్వం అనేదాని నిజమైన స్ఫూర్తిని ఏనాడూ ఆమోదించలేదు. చిన్న చిన్న రాష్ట్రాలు కేంద్రీకృత యూనిటరీ తరహా ప్రభుత్వం వుండాలని ఎప్పుడూ చెబుతూ వచ్చారు.

మూల సిద్ధాంతాలపైనే దాడి జరుగుతున్న ప్రస్తుత పరిస్థితులలో అందుకు అడ్డుపడే బలమైన శక్తిగా రాజ్యాంగం నిలిచి వుందనేది ఈ విడ్డూరపు రాజకీయ నాటకంలో మరోసారి స్పష్టమవుతున్నది. సాధ్యమైనంత త్వరగా అన్న మాట వెనక అసలైన లక్ష్యం ఏమిటనేదానిపై రాజ్యాంగపర వ్యాఖ్యానం తెలుసుకోవడం ఇక్కడ అసలైన లక్ష్యం కాదు. ప్రజాస్వామికంగా ఎన్నికైన చట్టసభల సార్వభౌమిక అధికారాన్ని దెబ్బ తీయాలన్నదే అసలైన ఉద్దేశం.

(మే21 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవాక్యం

టీచర్ల బదిలీ సాంకేతిక లోపాలు

ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్‌లో అనేక సాంకేతిక లోపాలున్నాయి. దీంతో ఉపాధ్యాయులకు రావాల్సిన స్టేషన్ పాయింట్లు, సర్వీస్ పాయింట్లు సరిగ్గా రావడం లేదు. 2021లో బదిలీ అయ్యి ప్రస్తుతం 2025లో రీఅపోర్షన్ అవుతున్న ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు రావడం లేదు. అదే విధంగా 2021లో బదిలీ అయ్యి 2023, 2025 లలో రెండుసార్లు రీఅపోర్షన్ అవుతున్న ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు రావడంలేదు. ప్రస్తుతం పాత స్టేషన్ పాయింట్లు ఎడిట్ ఆప్షన్ మండల, జిల్లా విద్యా శాఖాధికారులకు ఇచ్చారు. అధికారులు వీటిని సరి చేయాల్సి ఉంది. అందువల్ల ఉపాధ్యాయులు బదిలీలకు సకాలంలో దరఖాస్తు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. టీచర్ల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం బదిలీల షెడ్యూల్ గడువు పెంచాలి. ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి.

- వాసిలి సురేష్,
నెల్లూరు జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

కేరళ, మహారాష్ట్రలో భారీ వర్షాలు

ఒడిశాకు చేరుకున్న రుతుపవనాలు

న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాల ప్రభావంతో కేరళ, మహారాష్ట్రలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. కేరళలోని కోజికోడ్, వయనాడ్ జిల్లాలకు బుధవారం భారత వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 31 వరకు అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. అలప్పుజ, తిరువనంతపురం, కొల్లాం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా కేరళ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలిస్తున్నారు. ప్రత్యేక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

ముంబయిలో పలు ప్రాంతాలు జలమయం

మహారాష్ట్ర రాజధాని ముంబయిలో భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. కీలకమైన జంక్షన్లలో నిలిచిపోయిన నీటిని తొలగించడానికి పంపులను ఏర్పాటు చేయడం, ఆపరేట్ చేయడంలో విఫలమైనందుకు నాలుగు మినీ పంపింగ్ స్టేషన్ల నిర్వాహకులు ఒక్కొక్కరికి రూ 10 లక్షల చొప్పున ముంబయి అధికారులు జరిమానా విధించారు. కింగ్స్ సర్కిల్, మంత్రాలయ, దాదర్ టీటీ ఈస్ట్, పరేల్ టీటీ, కలచౌకి, వాడాలా, హిందమాతా, కెంప్స్ కార్నర్, చర్చిగేట్, చించ్‌పోక్లి, దాదర్ వంటి ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కర్ణాటకలోనూ అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. బాధిత ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర సిఎం సిద్ధరామయ్య అధికారులను ఆదేశించారు. రాజస్థాన్‌లోనూ కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలు బుధవారం నాటికి ఒడిశాలోని కొన్ని ప్రాంతాలకు చేరుకున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. సాధారణ సమయం కంటే దాదాపు 13 రోజులు ముందుగానే రాష్ట్రంలో వర్షాలు ప్రవేశించినట్లు తెలిపింది.

నేటి నుంచి సరిహద్దు రాష్ట్రాల్లో మాక్ డ్రిల్స్

న్యూఢిల్లీ : పాకిస్తాన్ సరిహద్దు రాష్ట్రాలైన గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, జమ్ముకాశ్మీర్‌లో గురువారం నుంచి తిరిగి మాక్ డ్రిల్స్ నిర్వహిస్తారు. హర్యానా ప్రభుత్వం ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ షీల్డ్' పేరిట పౌర రక్షణ విన్యాసాలు జరుపుతుంది. 22 జిల్లాల్లో సాయంత్రం ఐదు గంటల నుండి ఈ విన్యాసాలు చేపడతారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్‌తో సరిహద్దు ఉన్న రాష్ట్రాల్లో పౌర రక్షణ మాక్ డ్రిల్స్ చేపట్టడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

సిఎం హామీ ఇచ్చినట్లే నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలి

- రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీల వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి, మంత్రుల కమిటీ మార్చురులో ప్రకటించిన హామీకి భిన్నంగా ప్రైవేట్ పొగాకు కంపెనీలు వ్యవహరిస్తున్నాయని రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఆయా సంఘాల ప్రతినిధులు బుధవారం వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావును కలిసి వినతిపత్రం అందజేశాయి. మొదటి గ్రేడింగ్‌గా చెప్పబడిన పొగాకుకు రూ.8 వేలు, రూ.9 వేలు, రూ.10 వేలు అని చెప్పి, మూడు, నాలుగు రకాలుగా గ్రేడింగ్ చేస్తున్నారన్నారు. రెండో రకంలో రూ.4 వేలు, రూ.5 వేలు, రూ.6 వేలు, రూ.7 వేలు అని నాలుగు రకాలుగా గ్రేడింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రేడ్ చేస్తేనే కొంటామని చెబుతుండటంతో సుమారు సగం పొగాకు పక్కన పడేసే పరిస్థితులు నెలకొన్నాయని ఏపి కౌలు రైతు సంఘం కార్యదర్శి ఎం హరిబాబు, ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె కృష్ణయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రేట్ల ప్రకారం వెంటనే కొనుగోలు చేయాలని, సరైన చర్యలు తీసుకోకపోతే ఆత్మహత్యలు పెరిగే అవకాశముందని తెలిపారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో దేవినేని అవినాష్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా తనపై తిరువూరు పోలీసులు పెట్టిన కిడ్నాప్ సహా నాలుగు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వైసిపి నేత దేవినేని అవినాష్ హైకోర్టును ఆశ్రయించారు. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చి వివరణ తీసుకునేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఎన్నిక సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ అయిన తన మరదలు షేక్ నదియా, ఆమె భర్తను వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తో మాట్లాడమని చెప్పి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి స్వామిదాస్ తీసుకెళ్లి నిర్బంధించారని ఆరోపిస్తూ షేక్ మస్తాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతరులు కూడా ఇదే తరహా ఫిర్యాదులు చేశారు. దేవినేని అవినాష్‌పై పోలీసులు నాలుగు కేసులు నమోదు చేయడంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు విచారణ చేయనుంది. రాజకీయ కక్షతో కేసు బనాయించారని, తన అరెస్టు లక్ష్యంగా రాజకీయ ప్రత్యర్థులు వ్యవహరిస్తున్నారని, అరెస్ట్ నుంచి తనకు రక్షణ కల్పించాలని అవినాష్ పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

రాజధాని పరిధిలో మాస్టర్ ప్లానుకు కొత్త చిక్కులు

- గత భూసేకరణ ప్రకటనలు రద్దు
- ఆ భూములపై హక్కులు లేని ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో మాస్టర్‌ప్లాను అమలుకు కొత్త చిక్కులొచ్చాయి. సమీకరణ కింద ఇవ్వని భూములను సేకరణ పద్ధతిలో తీసుకుంటామని ఇచ్చిన నోటిఫికేషన్లో ఉన్న గ్రామాల వారీ ప్రకటనలను గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. ఇలా రద్దయిన భూములు సుమారు 1,500 ఎకరాల వరకూ ఉన్నాయి. ఇవన్నీ ఎక్కువశాతం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించే ప్రాంతంలోనే ఉన్నాయి. వాటిల్లో పనులు చేపట్టాలంటే రైతుల అనుమతి కావాలి. దీనిపై సిఆర్‌డిఏ అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఒకసారి నోటిఫికేషన్ వెనక్కు తీసుకున్న తరువాత మరలా అదే సర్వే నెంబర్లకు నోటిఫికేషన్ ఇవ్వడం అంత తేలికైన విషయం కాదు. రైతులు కోర్టుకు వెళితే ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. 2015 జనవరి ఒకటోతేదీ నుండి రాజధాని పరిధిలో భూ సమీకరణ ప్రక్రియను అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టింది. దీన్ని పలువురు రైతులు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో 2015 జూన్ నాటికి మొత్తం రాజధాని గ్రామాల పరిధిలో 4,410 ఎకరాల వరకూ పూలింగుకు ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టంలో సెక్షన్ 11/1 కింద సేకరణ నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిపై రైతులు కోర్టును ఆశ్రయించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేయడంతో అక్కడ పనులు నిలిపివేసింది. 2024 ఫిబ్రవరి 28న అన్ని గ్రామాల్లోనూ భూసేకరణ ప్రకటనలు వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఉపసంహరణలోనూ గ్రామంలో సేకరణ ప్రకటన ఇచ్చిన అన్ని భూములను కాకుండా కొన్నిటిని మినహాయించింది. రోడ్డు ప్లాను ఉన్న భూములను సేకరణలోనే ఉంచింది. లింగాయపాలెంలో 98.57 ఎకరాలకు నోటిఫికేషన్ ఇస్తే అక్కడ 51.06 ఎకరాలను మినహాయించింది. వెంకటపాలెంలో 66.11 ఎకరాలు సేకరణ తీసుకుంటామని ప్రకటించి 39.83 ఎకరాలకు ఉపసంహరించుకుంది. అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అయితే అంతకుముందు సేకరణ ప్రకటనలో ఉన్న భూములను రైతులు వెనక్కు తీసుకున్నారు. కొన్ని భూములు అప్పటి సిఆర్‌డిఏ అధికారులు వ్యక్తిగత కారణాలతో అడ్డుపెట్టుకున్నారు. సేకరణ ప్రకటనలో ఉన్న భూములను పూలింగుకు ఇస్తామంటే అమ్మకానికి అనుమతి ఇచ్చారు. అలా కొనుగోలు చేసిన వారు పూలింగుకు ఇచ్చేశారు. మిగిలిన భూముల్లో కొంతవరకు సేకరణ నుండి ఉపసంహరిస్తూ లింగాయపాలానికి 50, వెంకటపాలానికి 47 నెంబరుతో లోకల్ విత్‌డ్రా గెజిట్ ఇచ్చారు. దీనిలో 2013 భూసేకరణ చట్టంలో సెక్షన్ 19(1) ఫారం 7 ప్రకారం గ్రామాల వారీ సేకరణ వెనక్కు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అయితే వాటి తాలూకా 11/1 నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేయలేదు.

AUTHUM

ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు: 707, రహేజా సెంటర్, ఫ్రీ ప్రెస్ జర్నల్ రోడ్, నారిమన్ పాయింట్, ముంబయి-400 021.
ఫోన్: (022) 6747 2117, ఫ్యాక్స్: (022) 6747 2118, ఇ-మెయిల్: info@authum.com

అనుబంధం-4-ఎ (రూల్ 8(6)కు నియమాలను చూడండి) ఇ-వేలం & అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన (అనుబంధం-4ఎ)(రూల్ 8(6)

ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ("AIIL") కు తనఖాపెట్టిన స్థిరాస్తి అమ్మకం (ఎన్‌సిఎల్‌టీ తేది.10.05.2024 నాటి ఉత్తర్వుల ద్వారా AIIL కు రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ ('RCFL") నుండి లెండింగ్ బిజినెస్ డీమర్జర్‌ను అనుసరించి రిజల్టింగ్ కంపెనీ) దీని కార్పొరేట్ కార్యాలయం: **ది రూబీ 11వ అంతస్తు, నార్త్-వెస్ట్ వింగ్, ప్లాట్ నెం.29, సేనాపతి బాపట్ మార్గ్, దాదర్ (పశ్చిమ), ముంబై- 400028.(మహారాష్ట్ర)** మరియు **బ్రాంచ్ ఆఫీస్: 3వ అంతస్తు, ధ్రువ్ ఆర్కేడ్, నెం.6-3-248/ బి/1, నవీన్ నగర్, రోడ్ నెం.1, బంజారా హిల్స్, హైదరాబాద్ 500034** వద్ద కలిగియుంది. ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇందు తదుపరి "చట్టం"గా పేర్కొనబడును) క్రింద ఏదైతే, ఆథం ఇన్వెస్ట్‌మెంట్ & ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడిన ప్రకటన అనుసరించి దిగువ ఆస్తులను స్వాధీనంచేసుకొని, దిగువ రుణ ఖాతాలు/సదరు నం.లలో ఆథం ఇన్వెస్ట్‌మెంట్ & ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ లిమిటెడ్ బకాయిలను రియలైజ్‌చేయుట కొరకు **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన దానిని విక్రయించుటకు క్రింది సంతకందారు ద్వారా వెబ్‌సైట్ **:www.bankeauctions.com** వద్ద ఇవ్వబడిన ఇ-వేలం ప్లాట్‌ఫారం ద్వారా విక్రయించబడుతుంది.

రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారులు: (రుణ ఖాతా నెంబరు: RLSRVIJ 000280099, RLSLVIJ000254357 /హైదరాబాద్ బ్రాంచ్: 1) మెస్సర్స్ రోహిత్ ప్రెస్, చిరునామా: యాజమాన్య సంస్థ ద్వారా దాని యజమాని, శ్రీమతి సతులూరి సునీత, డోర్ నెం.75-12-26, భవానీపురం, విజయవాడ, ఆం.ప్ర-520012 మరియు ఇక్కడ కూడా: యాజమాన్య సంస్థ ద్వారా దాని యజమాని శ్రీమతి సతులూరి సునీత, డోర్ నెం.94/3, డోర్ నెం.75-12-26, భవానీపురం, విజయవాడ, ఆం.ప్ర-520012. **2) మెసర్స్ వివినాయక్ పేపర్స్, చిరునామా:** పార్ట్‌నర్‌షిప్ ద్వారా దాని పార్ట్‌నర్స్ 1) శ్రీమతి సాతులూరి సునీత, 2) శ్రీమతి మోక్ష సదాని సాతులూరి, ఆర్.ఎస్ 32/3, షెడ్ నెం.4, సూర్యపాలెం రోడ్, గౌపూడి, కృష్ణ, ఆంధ్రప్రదేశ్ - 521225. **3) శ్రీమతి సాతులూరి సునీత, చిరునామా:** డి.నెం.6-21-42, కెటి రోడ్, కొత్తపేట రోడ్, కొత్తపేట, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్-520001 మరియు ఇంకా వద్ద: డోర్ నెం.3-12, ఆర్ఎస్ నెం.75/5ఎ, ప్లాట్ నెం.88, రాయనపాడు, కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ మండలం, ఆంధ్రప్రదేశ్ -52124. ఇంకావద్ద: డోర్ నెం.7-112, రాయనపాడు, ఆర్ఎస్ నెం.75/5ఎ, ప్లాట్ నెం. 91, కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ మండలం, ఆంధ్రప్రదేశ్- 521241.
4) శ్రీ సాతులూరి సుబ్బా రాయుడు, చిరునామా: డి.నెం.6-21-42, కెటి రోడ్, కొత్తపేట రోడ్, కొత్తపేట, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్-520001.
5) శ్రీమతి మోక్ష సాధని సాతులూరి, చిరునామా: డి.నెం.6-21-42, కెటి రోడ్, కొత్తపేట రోడ్, కొత్తపేట, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్-520001.

డిమాండ్ నోటీసు తేదీ మరియు మొత్తం: 25.01.2017 / 21.01.2017 నాటికి రూ. 1,21,77,056 /- (రూపాయలు ఒక కోటి ఇరవై ఒక్క లక్షల డెబ్బై ఏడు వేల ఏడు మరియు యాభై ఆరు మాత్రమే)

భౌతిక స్వాధీనతా తేదీ : 24.05.2024, మే 31, 2025 నాటికి మొత్తం బకాయిలు రూ. 3,56,47,534/- (రూపాయలు మూడు కోట్ల యాభై ఆరు లక్షల నలభై ఏడు వేల ఐదు వందల ముప్పై నాలుగు మాత్రమే)

రిజర్వ్ ధర : రూ. 31,91,500/- (రూపాయలు ముప్పై ఒక్క లక్షలు-తొంభై ఒక్క వేల ఐదు వందల మాత్రమే)
ధరావత్తు (ఈఎండి): రూ. 3,19,150/- (రూపాయలు మూడు లక్షల పంతొమ్మిది వేల నూట యాభై మాత్రమే)

స్థిరాస్తి/సెక్యూర్డ్ ఆస్తి వివరణ: ఆస్తి నెం.1: డోర్ నెం.3-12, పూర్తి ఆర్ఎస్ నెం.75/5ఎ, రాయనపాడు, కృష్ణా జిల్లా, విజయవాడ గ్రామీణ మండలం, ఆంధ్రప్రదేశ్-521241. **ఆస్తి నెం.2**: పూర్తి ఆర్ఎస్ నెం.75/5ఎ, ప్లాట్ నెం.91, డోర్ నెం. 7-112, కృష్ణా జిల్లా, విజయవాడ గ్రామీణ మండలం, ఆంధ్రప్రదేశ్-521241.

తనిఖీచేయు తేది: 15 జూన్, 2025న ఉ॥ 11:00గం.ల నుండి మ॥ 3:00గం.లు	ధరావత్తుకు చివరి తేది: 17 జూన్, 2025 సా॥5:00గం.లు	ఇ-వేలం తేది/ సమయం: 18 జూన్, 2025 ఉ॥11:00గం.లు-13:00గం.లు.

చెల్లించు విధానం: చెల్లింపులన్నీ కూడా హైదరాబాద్ వద్ద చెల్లబడు నట్లుగా "ఆథం ఇన్వెస్ట్‌మెంట్ & ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ లిమిటెడ్" పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా కాని ఆర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌టి ద్వారా చేయవలెను. ఖాతా వివరాలు: ఎ) ఖాతా పేరు: ఆథం ఇన్వెస్ట్‌మెంట్ & ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ లిమిటెడ్ సిహెచ్‌డి ఖాతా, బి) బ్యాంకు పేరు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, సి) ఖాతా నెం: 99999917071983, డి) ఐఎఫ్ఎస్‌సి కోడ్: హెచ్‌డిఎఫ్‌సి0001119.

ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకపు నియమాలు& నిబంధనలు:

1) ఆస్తిని "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన విక్రయించబడుతుంది. అట్టి అమ్మకానికి ఏదేని విధంగా వ్యారంటీస్& ఇండెమినిటీస్ ఉండవు.
2) వివరాలు, సహాయం, విధానం మరియు ఇ-వేలం పై ఆన్‌లైన్ బిడ్డింగ్ కొరకు, ఆసక్తిగల బిడ్డరుదారులు సంప్రదించండి: సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నెం.68, 3వ అంతస్తు, సెక్టార్-44,గుర్గాం, హర్యానా-122003 (సంప్రదించు నెం.729181124, 25, 26) సపోర్ట్ ఇమెయిల్-**Support@bankeauctions**, శ్రీ భావిక్ పాండ్య, మొబైల్: 8866682937, ఇ-మెయిల్: **Gujarat@c1india.com**.
3) తదుపరి వివరాలు& సందేహాల కొరకు, సంప్రదించండి: **అధీకృత అధికారి: శ్రీ దశరథ రాము మల్లెపుడి-(మొబైల్: 8886842299/ 7670964545)**
4) పై పేర్కొన్న తేది/ ప్రదేశం వద్ద వేలం అమ్మకం నిర్వహించుటకు సంబంధించి, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు అనుసరించి పై సదరు రుణ ఖాతా యొక్క రుణగ్రహీత/ తాకట్టుదారు/ హామీదారులకు 30(ముప్పై) రోజుల నోటీసుగా కూడా ఈ ప్రచురణను భావించగలరు. **వివరణాత్మక నియమ& నిబంధనలకు దయచేసి (యూజ్ కోడ్:196627 మరియు ఎన్ఐటి డాక్యుమెంట్‌ను చూడండి) (https://www.bankeauctions.com)** వెబ్‌సైట్‌ను పరిశీలించండి.

ప్రదేశం: విజయవాడ
తేది: 29-05-2025
సం/-
అధీకృత అధికారి

HDFC BANK We understand your world

హెడ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబాయి, మహారాష్ట్ర-400013
రీజనల్ ఆఫీస్ : డోర్ నెం.50-96-5, ప్లాటు నెం.175, సీతమ్మధార, పాత SBH ఎదురుగా, విశాఖపట్నం-530013.

ఇ-వేలం అమ్మకం ప్రకటన స్థిరాస్తుల యొక్క అమ్మకం కొరకు అమ్మకం బహిరంగ ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8 (6) నిబంధనలతో చదవబడు బ్యాంక్‌కు తనఖా పెట్టిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తులు (రూల్ 9(1) ని చూడండి) అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,** వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు/తనఖాదారు(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తము వడ్డీ మరియు ఖర్చులు కలిపి మొత్తము రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,** అధీకృత అధికారిచే **తేది.31.05.2024 న లాంఛనాత్మక స్వాధీనం** చేసుకున్న బ్యాంకుకు తనఖా పెట్టిన / ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను **"ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది"** అనే ప్రాతిపదికపై **తేది.16.06.2025** న విక్రయించబడునని **హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,** వారు యావన్మంది ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)కు ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) / తనఖాదారు(లు) యొక్క రిజర్వు ధర మరియు ధరావత్తు వివరాలు క్రింద పేర్కొనబడ్డాయి. దిగువ పేర్కొన్న ఆస్తుల విక్రయం వెబ్‌పోర్టల్ **https://www.bankeauctions.com** ద్వారా ఇ-వేలం నిర్వహించబడుతుంది.

స్థిరాస్తుల వివరాలు / ఖాతా / మొత్తం బకాయి / ధరావతు మొదలగు వివరములు :
బ్రాంచి & ఖాతా పేరు : మెస్సర్స్ హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్, గొల్లపూడి బ్రాంచ్, విజయవాడ
మెస్సర్స్ శ్రీ సాయి బాలాజీ ఏజెన్సీస్
ఋణగ్రహీత & హామీదారు(లు) / తనఖాదారు(లు) పేర్లు :
1) మెస్సర్స్ శ్రీ సాయి బాలాజీ ఏజెన్సీస్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ శ్రీ గూడె రాంబాబు, ప్లాట్ నెం.184 & 185, ఆర్ ఎస్ నెం.490/1, శ్రీశైలం కాలనీ రోడ్డు, గొల్లపూడి, విజయవాడ-521225.
2) శ్రీ గూడె రాంబాబు, తండ్రి. శ్రీ నరసింహారావు గూడె, డోర్ నెం.1-48, దుగ్గిరాలపాడు, జి. కొందూరు, విజయవాడ, కృష్ణా జిల్లా-521229.
3) శ్రీమతి గూడె రాధా రాణి, భర్త. గూడె రాంబాబు, డోర్ నెం.1-48, దుగ్గిరాలపాడు, జి. కొందూరు, విజయవాడ, కృష్ణా జిల్లా-521229

రికవరీ కొరకు డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : మెస్సర్స్ శ్రీ సాయి బాలాజీ ఏజెన్సీస్ లోన్ ఖాతా యొక్క డిమాండ్ నోటీసు జారీ చేసిన తేది.29.02.2024 నాటికి రూ.5,84,41,617.67 పై (అక్షరాల ఐదు కోట్ల ఎనభై నాలుగు లక్షల నలభై ఒక్క వేల ఆరు వందల పదిహేడు రూపాయల అరవై ఏడు పైసలు మాత్రమే)

అధీకృత అధికారి యొక్క పేరు / ఫోన్ నెం./ఇ-మెయిల్ ఐ.డి : శ్రీ ఆనంద్ గేదెల, ఫోన్ : 73311 88642, ఇ-మెయిల్ : anand.gedela@hdfcbank.com

స్థిరాస్తి వివరములు	రిజర్వు ధర	ధరావత్తు	బిడ్ పెంపుదల మొత్తం
ఆస్తి-1 : విజయవాడ-520010, పటమట, కె.పి.నగర్, వార్డు నెం.8 (పన్ను రసీదు ప్రకారం), అసెస్‌మెంట్ నెం.1073134285, ఎల్.పి నెం.15/1979, ఆర్.ఎస్.నెం.127/2, ప్లాట్ నెం.19 (ప్రస్తుత ప్లాట్ నెం.59) వద్ద గల విస్తీర్ణం 430 చ॥గ॥లు లేదా 2145.60 చ॥అ॥లులోని డోర్ నెం.59ఎ-11-3/1 తో ఉన్న నివాసయోగ్యమైన ఆస్తి. **(శ్రీ గూడె రాంబాబు & శ్రీమతి గూడె రాధా రాణి గార్ల పేరున గల ఆస్తి దస్తావేజు నెం.7273/2020, తేది.26.11.2020 ఎస్.ఆర్.ఓ పడమట ప్రకారం)** **దస్తావేజు ప్రకారం హద్దులు : ఉత్తరం :** పాతూరి శివ వరప్రసాద్ గారి ఆస్తి (ప్లాట్ నెం.18), **దక్షిణం :** పరిమి నాగేంద్రబాబు గారి ఆస్తి (ప్లాట్ నెం.20), **తూర్పు :** పునుకొల్లు లక్ష్మణ రావు గారి ఆస్తి (ప్లాట్ నెం.31), **పడమర :** 30 అ॥ల మున్సిపల్ రోడ్డు.	**రూ.4,75,00,000/- (అక్షరాల నాలుగు కోట్ల డెబ్బై ఐదు లక్షల రూపాయలు మాత్రమే)**	**రూ.47,50,000/- (అక్షరాల నలభై ఏడు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే)**	**రూ.5,00,000/- (అక్షరాల ఐదు లక్షల రూపాయలు మాత్రమే)**
ఆస్తి-2 : కృష్ణా జిల్లా-521225, విజయవాడ, ఇబ్రహీంపట్నం ఎస్.ఆర్.ఓ, విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి, గొల్లపూడి గ్రామ పంచాయితీ ఏరియా వద్ద గల ఇంటి స్థలం యొక్క ఆర్.ఎస్.నెం.529 & 530/1 లోని స్థలం అన్ని సాధారణ ఉపయోగాలతో 100.00 చ॥అ॥ల కార్ పార్కింగ్‌తో కలదు మరియు ఆర్ ఎస్ నెం.529, అసెస్‌మెంట్ నెం.7913, దస్తావేజు నెం.643/2016 లోని విస్తీర్ణం 1456 చ॥అ॥లుతో "వల్లమూడి ప్లాజా", చిన్మిత బ్లాక్, రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం.సి-302 డోర్ నెం. 22-84/2 తో ఉన్న నివాసయోగ్యమైన ఆస్తి. **డాక్యుమెంట్ హోల్డర్ శ్రీ గూడె రాంబాబు. హద్దులు : ఉత్తరం :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **తూర్పు :** కామన్ కారిడార్, **పడమర :** ఓపెన్ టు స్కై.	**రూ.65,27,000/- (అక్షరాల అరవై ఐదు లక్షల ఇరవై ఏడు వేల రూపాయలు మాత్రమే)**	**రూ.6,52,700/- (అక్షరాల ఆరు లక్షల యాభై రెండు వేల ఏడు వందల రూపాయలు మాత్రమే)**	**రూ.50,000/- (అక్షరాల యాభై వేల రూపాయలు మాత్రమే)**

ఇ-వేలం తేది & సమయం : 16.06.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 02.00 గం॥ల వరకు
(వేలము పూర్తి అగు వరకు 5 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)
బిడ్స్ సమర్పించుటకు ఆఖరి తేది : 13.06.2025, సా॥ 04.00 గం॥ల వరకు
ఆస్తి తనిఖీ కొరకు తేది మరియు సమయం : 12.06.2025,
ఆస్తి-1 : ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01:00 ని॥ల లోపు   ఆస్తి-2 : మ॥ 02.00 గం॥ల నుండి మ॥ 03:30 ని॥ల లోపు

నియమ & నిబంధనలు

1) పైన చెప్పబడిన ఆస్తిని **"ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే"** మరియు **"అక్కడ ఏమి ఉన్నదో అదే"** ప్రాతిపదిక పై కొనుగోలు చేయుటకు ఆహ్వానించుచున్నారు.
2) ఆసిక్తి గల బిడ్డర్లు తమ ఇ.ఎమ్.డి. వివరములు మరియు దస్తావేజులను వెబ్‌పోర్టల్ : **https://www.bankeauctions.com** ద్వారా సమర్పించాలి. (**https://www.bankeauctions.com** లో పేరు నమోదు చేసుకోవడం ద్వారా వినియోగదారుడు ఐడి & పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందవచ్చును) లాగిన్ ఐ.డి & పాస్‌వర్డ్. ఇ.ఎమ్.డి. ఈ క్రింది ఖాతాలో **NEFT / RTGS** ద్వారా చెల్లించబడును. **ఖాతా నెం. 57500000904261, ఖాతా పేరు : DFSO ట్రాన్సిటరీ ఖాతా, లబ్ధిదారుని పేరు : హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లిమిటెడ్, IFSC CODE: HDFC0000240** లేదా **HDFC** కి అనుకూలంగా డ్రా చేయబడిన డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా **ఖాతా నెం.57500000904261** పైన పట్టికలో పేర్కొన్న తేదీలలో లేదా అంతకంటే ముందు సా॥ 04.00 గం॥లలోగా చెక్కులు ఇ.ఎమ్.డి.మొత్తం అంగీకరించబడునని దయచేసి గమనించగలరు.
3) అధీకృత అధికారి యొక్క ఉత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు, ఆస్తులు పై బ్యాంకుల రికార్డు ప్రకారం ఆస్తి పన్నులు, సొసైటీ బకాయిలు మొదలైన చట్టబద్ధమైన బకాయిలకు ఎటువంటి భారం లేదు. ప్రస్తుతం / గత / భవిష్యత్తులో బకాయి ఉన్న చట్టబద్ధమైన బకాయిలు / భారాలు / పన్ను బకాయిలు / విద్యుత్/ బకాయిలు / ఆస్తి పన్ను ఏదైనా ఉన్నచో వాటికి బ్యాంక్ బాధ్యత వహించదు. ఉద్దేశించిన బిడ్డర్లు యొక్క భారాలు, ఆస్తులు / ఐఎస్‌ల టైటిల్ & తమను తాము తనిఖీ చేసుకోవడం & సంతృప్తి చెందడం గురించి వారి స్వంత విచారణ చేయాలి. పైన పేర్కొన్న తేదీ మరియు సమయములలో ఖచ్చితంగా ఆస్తులను తనఖీ చేయవచ్చును.
4) ఇ.ఎమ్.డి. ని డిపాజిట్ చేసిన మరియు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ని రూపొందించడంలో డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్‌ను సమర్పించడంలో ఇ-బిడ్డింగ్ ప్రాసెస్‌పై శిక్షణ ఇవ్వడంలో సహాయం అవసరమై ఉద్దేశించిన బిడ్డర్లు మా సర్వీస్ ప్రొవైడర్ **M/s. C1 India Pvt Ltd., చిరునామా : ప్లాట్ నెం.301, గల్ఫ్ పెట్రో చెమ్ భవనం, ఉద్యోగ్ విహార్, ఫేస్-2, గుర్గాన్. హెల్ప్‌లైన్ నెం.0124-4302020/21/ 22/23/24, శ్రీ ధరణీ కృష్ణ, మొబైల్ నెం.99481 82222,** హెల్ప్‌లైన్ ఇ-మెయిల్ ఐడి : **andhra@c1India.com** మరియు ఏదైనా ఆస్తి సంబంధిత సమాచారం కొరకు కార్యాలయ పనిదినములలో **(ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 05:00 గం॥ల వరకు)** పైన పేర్కొన్న విధంగా అధీకృత అధికారిని సంప్రదించవచ్చును.
5) అత్యధిక బిడ్ **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్** ఆమోదానికి లోబడి ఉంటుంది. అధీకృత అధికారి స్వీకరించినవన్నీ లేదా ఏవైనా ఆఫర్‌లు / బిడ్‌లను అంగీకరించే / తిరస్కరించే హక్కును కలిగి ఉంటాడు లేదా ఎలాంటి కారణాలు చూపకుండా వేలం / విక్రయాన్ని రద్దు చేయవచ్చు. అతని నిర్ణయం అంతిమమైనది & కట్టుబడి ఉంటుంది.

గమనిక : తేది.02.04.2025 న ఇప్పటికే జారీ చేయబడిన రూల్, 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) యొక్క నిబంధన 8(6) జారీ చేసిన ప్రకటన
నియమ నిబంధనలు మరియు షరతుల కొరకు దయచేసి మా వెబ్‌సైట్ : www.hdfcbank.com and www.bankeauctions.com)

తేది : 28.05.2025, ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంకు లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గవర్నర్‌పేట బ్రాంచి (01451)
డి.నెం.27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ-520002.
2.	కొమ్మనబోయిన శ్రీనివాసరావు (రుణగ్రహీత), కొమ్మనబోయిన లక్ష్మి (సహ-రుణగ్రహీత) LHGTR00001488513.	కర్లపాలెం గ్రామం మరియు మండలం బాపట్ల, ఆర్ఓబాపట్ల జిల్లా, కర్లపాలెం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522101పరిధిలోని సర్వే నెం.502/1ఇ లోని 169.4 చ.గ.ల విస్తీర్ణంతో డి.నెం.7-49గల ఆర్‌సిసి రూఫ్డ్ ఇంటి మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: షేక్ మీరా యొక్క స్థలం, దక్షిణం: పంచాయితీ సిసి రోడ్, తూర్పు: సలగల్ రావు స్థలం, పడమర: పంచాయితీ సిసి రోడ్./ స్వాధీనతా తేదీ: 24-మే-2025	16-08-2024 Rs. 88,797.92/-	గుంటూరు
3.	ముట్లూరి తిరుమల గోపి (రుణగ్రహీత), మాడుగుల భాగ్యలక్ష్మి (సహ-రుణగ్రహీత), LHGTR00001526742.	కాటేవరం గ్రామం, కాటేవరం గ్రామ పంచాయతీ ప్రాంతం, తెనాలి (మండలం మరియు వెస్ట్ సబ్ జిల్లా), తెనాలి (ఆర్)జిల్లా), గుంటూరు ఆంధ్రప్రదేశ్-522005 పరిధిలోని 55.19 చ.గ.లు లేదా 46.14 చ.మీ.ల విస్తీర్ణంతో డి.నెం.324/9, ఇంటి నెం.7-94 కలిగిన ఆర్‌సిసి రూఫ్డ్ ఇల్లు మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: 2గజాల వెడల్పు బజార్, దక్షిణం: షేక్ బాబావలి ఆస్తి, తూర్పు:పటాన్ మస్తాన్ వలి ఆస్తి, పడమర: ఈ ఆస్తి మరియు ఎన్ శేషమ్మ ఆస్తి మధ్య ఉమ్మడి గోడ./ స్వాధీనతా చేసుకున్న తేదీ: 24-మే-2025	15-10-2024 Rs. 5,37,332.56/-	గుంటూరు
4.	ముట్లూరి తిరుమల గోపి (రుణగ్రహీత), మాడుగుల భాగ్యలక్ష్మి (సహ-రుణగ్రహీత), LHGTR00001526745.	కాటేవరం గ్రామం, కాటేవరం గ్రామ పంచాయతీ ప్రాంతం, తెనాలి (మండలం మరియు వెస్ట్ సబ్ జిల్లా), తెనాలి (ఆర్)జిల్లా), గుంటూరు ఆంధ్రప్రదేశ్-522005 పరిధిలోని 55.19 చ.గ.లు లేదా 46.14 చ.మీ.ల విస్తీర్ణంతో డి.నెం.324/9, ఇంటి నెం.7-94 కలిగిన ఆర్‌సిసి రూఫ్డ్ ఇల్లు మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: 2గజాల వెడల్పు బజార్, దక్షిణం: షేక్ బాబావలి ఆస్తి, తూర్పు:పటాన్ మస్తాన్ వలి ఆస్తి, పడమర: ఈ ఆస్తి మరియు ఎన్ శేషమ్మ ఆస్తి మధ్య ఉమ్మడి గోడ./ స్వాధీనతా చేసుకున్న తేదీ: 24-మే-2025	15-10-2024 Rs. 14,67,008.26/-	గుంటూరు
5.	ముట్లూరి తిరుమల గోపి (రుణగ్రహీత), మాడుగుల భాగ్యలక్ష్మి (సహ రుణగ్రహీత), LHGTR00001527131.	కాటేవరం గ్రామం, కాటేవరం గ్రామ పంచాయతీ ప్రాంతం, తెనాలి (మండలం మరియు వెస్ట్ సబ్ జిల్లా), తెనాలి (ఆర్)జిల్లా), గుంటూరు ఆంధ్రప్రదేశ్-522005 పరిధిలోని 55.19 చ.గ.లు లేదా 46.14 చ.మీ.ల విస్తీర్ణంతో డి.నెం.324/9, ఇంటి నెం.7-94 కలిగిన ఆర్‌సిసి రూఫ్డ్ ఇల్లు మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: 2గజాల వెడల్పు బజార్, దక్షిణం: షేక్ బాబావలి ఆస్తి, తూర్పు:పటాన్ మస్తాన్ వలి ఆస్తి, పడమర: ఈ ఆస్తి మరియు ఎన్ శేషమ్మ ఆస్తి మధ్య ఉమ్మడి గోడ./ స్వాధీనతా చేసుకున్న తేదీ: 24-మే-2025	15-10-2024 Rs. 70,156.74/-	గుంటూరు

ఇందుమూలంగా పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు బాకీ మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా 30 రోజుల ప్రకటన ఇవ్వబడుతుంది, లేనిచో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత సదరు తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది: 28 మే, 2025, ప్రదేశం: గుంటూరు
అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

ఎంపి మంత్రి విజయ్‌షా అరెస్టుపై సుప్రీంకోర్టు స్టే పొడిగింపు

న్యూఢిల్లీ : మిలటరీ కల్నల్ సోఫియా ఖురేషిపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్‌షాను అరెస్టు చేయకుండా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలును సుప్రీంకోర్టు బుధవారం పొడిగించింది. విజయ్ షా వ్యాఖ్యలపై విచారణ నిర్వహించడానికి సీనియర్ ఐపిఎస్ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఈ నెల 19న జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. భోపాల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ దాఖలు చేసిన స్టేటస్ రిపోర్టును ధర్మాసనం బుధవారం పరిశీలించింది. ఈ నివేదికలో ప్రాథమిక దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, ఫోరెన్సిక్ ఆధారాలు వంటి అంశాలను సిట్ ప్రస్తావించింది. దర్యాప్తు పూర్తి చేయడానికి సిట్ మరింత సమయం కోరింది. దీంతో విజయ్‌షాను అరెస్టు చేయకుండా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలును ధర్మాసనం పొడిగించింది. సిట్టింగ్ మంత్రిపై న్యాయమైన, పారదర్శకమైన సిట్ దర్యాప్తు బిజెపి పాలిత మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి 'లిట్మస్ పరీక్ష' అని జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కల్నల్ సోఫియా ఖురేషిపై తాను చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలకు గాను మంత్రి కున్వర్ విజయ్‌షా చెప్పిన క్షమాపణలను సుప్రీంకోర్టు ఇప్పటికే తిరస్కరించిన సంగతి తెలిసిందే. సమస్య నుంచి బయటపడ్డానికి కోర్టుకు క్షమాపణలు చెప్పడంలో అర్థం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.

అశోకా వర్శిటీ ప్రొఫెసర్‌కు బెయిల్ పొడిగింపు

న్యూఢిల్లీ : అశోకా యూనివర్శిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్ తాత్కాలిక బెయిల్‌ను సుప్రీంకోర్టు బుధవారం పొడిగించింది. ఆయన భావ ప్రకటనా స్వేచ్ఛకు ఎలాంటి అవరోధం లేదని, కానీ తనపై నమోదైన కేసులకు సంబంధించి ఆయన ఆన్‌లైన్‌లో ఎలాంటి పోస్టులు పెట్టరాదని స్పష్టం చేసింది. ఈ నెల 21వ తేదీన తాత్కాలిక బెయిల్ మంజూరుచేస్తూ విధించిన షరతులను మార్చేందుకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపంకర్ దత్తాలతో కూడిన బెంచ్ తిరస్కరించింది. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్న తన ఆన్‌లైన్ పోస్టులు రెండింటికి సంబంధించి ఆయన ఎలాంటి పోస్టు పెట్టరాదని, వ్యాసం రాయరాదని, ఎలాంటి ప్రసంగాలు, వ్యాఖ్యలు చేయరాదని స్పష్టం చేసింది. వచ్చే విచారణ నాటికి సిట్ దర్యాప్తు నివేదికను అందజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాక్ ఘర్షణలకు సంబంధించి ప్రొఫెసర్ పెట్టిన రెండు పోస్టులపైనే దర్యాప్తు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తులో అటూ ఇటూ వెళ్లవద్దని, ఆయన ఫోన్, ల్యాప్‌టాప్ వంటివి అడగవద్దని చెప్పింది. ప్రొఫెసర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఎన్‌హెచ్ఆర్‌సి ఇచ్చిన నోటీసులపై స్పందనను కూడా తమకు తెలియజేయాల్సిందిగా హర్యానా పోలీసులను బెంచ్ కోరింది.

కొత్త నియామకాల్లో 50 శాతం పతనం

న్యూఢిల్లీ : ఐటి కంపెనీల్లో ఉద్యోగ నియామకాలు భారీగా పడిపోతున్నాయి. కృత్రిమ మేధా (ఎఐ) దూసుకొస్తున్న నేపథ్యంలో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రధానంగా టెక్ కంపెనీల్లో ఎఐ సాంకేతికత వినియోగం విస్తృతంగా పెరగడంతో ఫ్రెషర్ నియామకాలు తగ్గాయని వెంచర్ క్యాపిటల్ సంస్థ సిగ్నల్‌ఫైర్ నివేదిక తెలిపింది. అగ్రశ్రేణి టెక్ కంపెనీల్లో ప్రవేశ స్థాయి నియామకాలు 15 శాతం ఉండగా.. ఇప్పుడు 7 శాతానికి పడిపోయాయి. గతంతో పోలిస్తే ఏకంగా 50 శాతం క్షీణించాయి. ఎఐ కారణంగా ఇప్పటికే పలు సంస్థలు సిబ్బందిని తొలగిస్తున్నాయి. తాజాగా ఐబిఎం ఎనిమిది వేల మంది ఉద్యోగులపై వేటు వేసింది.

దాదాపు 87 శాతం మంది రిక్రూటర్లు ఎఐలో అనుభవం ఉన్న అభ్యర్థుల కోసం ఎదురుచూస్తున్నాయి. రానున్న 12-18 నెలల్లో తమ కంపెనీకి చెందిన లామా ప్రాజెక్టుకు సంబంధించి చాలావరకు కోడింగ్‌ను ఇదే పూర్తి చేస్తుందని మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ పేర్కొన్న విషయం తెలిసిందే. అంటే ఎఐ ఎంత తీవ్ర స్థాయిలో ప్రభావం చూపుతోందో స్పష్టమవుతుంది.

అగ్నిగుండంలా భూగోళం!

- రాబోయే ఐదేళ్లలో సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటే అవకాశాలు
- వడగాడ్పులు, వరదలు, కరువు కాటకాలు, అగ్నిప్రమాదాలు అత్యంత సాధారణం
- వాతావరణ సంస్థల హెచ్చరిక



వాషింగ్టన్ : రాబోయే ఐదేళ్లలో భూగోళం మరింత ప్రాణాంతకంగా, మండుతున్న అగ్నిగోళంగా మారే ప్రమాదముందని ప్రపంచంలోనే అగ్రస్థాయిలోని రెండు వాతావరణ సంస్థలు హెచ్చరించాయి. వచ్చే ఐదేళ్లలో ఏదో ఒక ఏడాది సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటేందుకు 86శాతం అవకాశం వుందని పరిశోధకులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఐదేళ్లలో అంటే 2025-2029 మధ్య కాలంలో మొత్తంగా సగటు ఉష్ణోగ్రతలు కూడా పెరిగే ప్రమాదముందని పేర్కొన్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ), బ్రిటన్ వాతావరణ సంస్థలు బుధవారం ఈ మేరకు ఐదేళ్ల అంచనాలతో కూడిన నివేదికను విడుదల చేశాయి.

అంతర్జాతీయంగా సగటు ఉష్ణోగ్రతలు పెరగడమంటే వాటి పర్యవసానాలు, ఫలితాలు రోజువారీ జీవితంలో తీవ్ర విపత్కర పరిస్థితులకు దారి తీసే అవకాశాలు వున్నాయని కార్నెల్ యూనివర్శిటీ వాతావరణ శాస్త్రవేత్త నటాలి మాహోవాల్డ్ చెప్పారు. ఆఫ్రికా, అర్కిటిక్ వంటి ప్రాంతాల్లో మరో మూడు నాలుగు డిగ్రీల మేరకు వేడి పెరుగుతుందని, రాత్రుళ్లలో ఉష్ణోగ్రత 30డిగ్రీలుగా వుండడమనేది సాధారణంగా మారుతుందని, వడగాలులు, వడదెబ్బలనేవి అత్యంత సాధారణమవుతాయని హెచ్చరించింది. మానవులు చేసే పనుల వల్లనే ఒక డిగ్రీలో పదవ వంతు వేడి పెరగడమనేది జరుగుతుంది. వాతావరణంలో వచ్చే మార్పులతో వడగాలులే కాదు, కరువు కాటకాలు, వరదలు, అగ్నిప్రమాదాలు, తుపానులు ఇలా అనేక రూపాల్లో ప్రకృతి మనల్ని హెచ్చరిస్తూనే వుంటుందని జర్మనీలోని క్లైమేట్ ఇంపాక్ట్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ జాన్ రాక్‌స్ట్రామ్ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా పది కేంద్రాల్లోని శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న కంప్యూటర్ల డేటాను ఉపయోగిస్తూ 200కి పైగా అంచనాలు రూపొందించారు. వాటి నుండి వచ్చిన సమాచారం ఇది. ఇలాంటి పరిస్థితులను మనం ఎవరూ చూడకూడదనే కోరుకుంటామని, కానీ సైన్స్ మనకు చెబుతోంది మాత్రం ఇదేనని మరో శాస్త్రవేత్త లియోన్ హెర్మాన్సన్ చెప్పారు.

ఆరుతడి పంటలకు ధర పెంపు

- వరిసాగు నుండి దృష్టి మళ్లించడంలో తొలిఅడుగు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఖరీఫ్‌లో మద్దతు ధరల పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వరికి క్వింటాకు రూ.69 ప్రకటించింది. దీంతో వరి మద్దతు ధర రూ.2,369కు చేరింది. అదే సమయంలో ఆరుతడి పంటల మద్దతు ధరను పెంచింది. కందిపప్పు క్వింటాకు రూ.450 పెంచడంతో క్వింటా రూ.8000కు చేరింది. పెసరకు రూ.86 పెంచి రూ.8,768 చేశారు. మినుములకు రూ.400 పెంచడంతో క్వింటా రూ.7800కు చేరింది. వేరుశనగకు రూ.480, పొద్దుతిరుగుడుకు రూ.441, సోయాబీన్‌కు రూ.436 పెంచారు. అయితే వీటిపై పలు సందేహాలు అందరిలోనూ నెలకొన్నాయి. సాగు ఖర్చు కనీసం 10 శాతం పెరిగిందని ప్రభుత్వాలు ప్రకటించినా మద్దతు ధరను మాత్రం మూడుశాతమే పెంచింది. అయితే వరిని అమెరికా నుండి దిగుమతి చేసుకునే ఒప్పందంలో భాగంగా ప్రస్తుతం మద్దతు ధరను తక్కువగా ప్రకటించిందనే విమర్శలూ ఉన్నాయి. దీని ద్వారా రైతుల దృష్టిని వరిసాగు నుండి మళ్లించాలనే ఆలోచనను కేంద్రం విజయవంతంగా అమలు చేస్తోందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. మరోవైపు తక్కువగా సాగు, వినియోగమయ్యే తృణధాన్యాలకు ధరను పెంచింది. దీనిద్వారా రైతులను ఆటువైపు మళ్లించాలనే కేంద్రం ఆలోచనను ఈ ఖరీఫ్ సీజన్లో అమలు చేశారు. అలాగే జొన్నకు రూ.328, సజ్జలకు రూ.150, రాగులకు రూ.596, కుసుములకు రూ.579, ఒలిసెలకు రూ.820 చొప్పున పెంచారు. వాస్తవంగా ఎపి లాంటి రాష్ట్రాల్లో వీటి వినియోగం చాలా తక్కువ. వరిసాగు ఎక్కువ. ప్రతియేడాది వరిసాగు ఖర్చు పెరుగుతోంది. దీనికి అనుగుణంగా సి2ప్లస్50 ప్రకారం మద్దతు ధర నిర్ణయించాల్సి ఉండగా అలా చేయలేదు. వరిసాగుకు రూ.1900కుపైనే ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపినట్లు తెలిసింది. పెరిగిన ధరలకు అనుగుణంగా ఈ ఖర్చును చూపించడం లేదనే విమర్శలూ ఉన్నాయి. ఖర్చు పెరుగుదలకు అనుగుణంగా మద్దతు ధరను కేంద్రం నిర్ణయిస్తోంది. కేంద్రం ఇచ్చిన ధరలు సరిపోవనే ఉద్దేశంతో కేరళ సి2ప్లస్50 ప్రకారం ధర అమలు చేస్తోంది. తమిళనాడు కేంద్రం ఇచ్చే ధరపై క్వింటాకు రూ.400 నుండి రూ.500 అదనంగా ఇస్తోంది. తెలంగాణ రూ.500 అదనంగా ప్రకటించింది.

ధర నిర్ణయం అన్యాయం

ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి

వరి కనీస మద్దతు ధర విషయంలో కేంద్రం రైతులను మరోసారి మోసం చేసిందని, సాగు పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా పెంపుదల లేదని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి, సీనియర్ నాయకులు వై కేశవరావు తెలిపారు. సాగు ఖర్చు పది శాతం పెరిగిందని చెబుతున్న ప్రభుత్వాలు దానిక నుగుణంగా ధరను పెంచడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. పెట్టుబడి ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సి2ప్లస్50కి అనుగుణంగా కనీస మద్దతు ధర ప్రకటించాలని వారు కోరారు.

ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వండి

- గవర్నరును కోరిన మణిపూర్ బిజెపి ఎమ్మెల్యేలు

ఇంఫాల్ : ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బిజెపి మళ్లీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. రాష్ట్రానికి చెందిన పది మంది ఎమ్మెల్యేలు బుధవారం గవర్నర్ అజయ్ కుమార్ భల్లాతో సమావేశమయ్యారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. గవర్నరును కలిసిన వారిలో ఎనిమిది మంది బిజెపి ఎమ్మెల్యేలు, నేషనల్ పీపుల్స్ పార్టీకి చెందిన ఒకరు, ఓ స్వతంత్ర సభ్యుడు ఉన్నారు. తమకు 22 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నదని వారు గవర్నరుకు తెలిపారు. మణిపూర్ శాసనసభలో 60 మంది సభ్యులు ఉన్నారు. గవర్నరును కలిసిన అనంతరం బిజెపి ఎమ్మెల్యే తోక్‌చమ్ రాధేశ్యామ్ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు 44 మంది శాసనసభ్యులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా కారణంగా మణిపూర్‌లో ఫిబ్రవరి 13 నుండి రాష్ట్రపతి పాలన అమలులో ఉంది.

గాజాలో ఆహార పంపిణీ కేంద్రం వద్ద ఇజ్రాయిల్ కాల్పులు

- ముగ్గురు మృతి : 48 మందికి గాయాలు

గాజా, జెనీవా : ఆహార పంపిణీ కేంద్రం వద్ద తోపులాట చోటుచేసుకుందనే పేరుతో ఇజ్రాయిల్ కాల్పులు జరిపి, ముగ్గురిని బలిగొంది. ఈ కాల్పుల్లో మరో 48 మంది తీవ్రంగా గాయపడ్డారు. నెలల తరబడి ఆహారం అందక ఇబ్బందులు పడుతున్న గాజా ప్రజలు, సాయం పంపిణీకి అనుమతించడంతో మంగళవారం ఆహార పంపిణీ కేంద్రాలకు అధిక సంఖ్యలో వచ్చారు. గాజాలోని రఫా నగరంలో అంతకుముందు రోజే కొత్తగా ఏర్పాటు చేసిన అమెరికా మద్దతు గల గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) పంపిణీ కేంద్రానికి గుంపులు, గుంపులుగా ప్రజలు మంగళవారం చేరుకున్నారు. వారిని చెదరగొట్టే పేరుతో ఇజ్రాయిల్ దుర్మార్గంగా కాల్పులకు తెగబడింది. దీంతో, ముగ్గురు పాలస్తీనియన్లు మరణించగా, 48మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు బుధవారం తెలిపాయి. మరో ఏడుగురు గల్లంతయ్యారని పేర్కొన్నాయి.

ఆహార పంపిణీ కేంద్రం వద్ద జనం

కాల్పుల వల్లే ఎక్కువమందికి గాయాలు : ఐరాస

గాజాలో ప్రధాన ఆహార పంపిణీ సరఫరాదారుగా వున్న ఐక్యరాజ్య సమితిని మించి సాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఆహార పంపిణీ చేపట్టినట్లు అమెరికా మద్దతు గల గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) చెబుతోంది. ఈ సంస్థ కార్యకలాపాలు ఆది నుండి వివాదాస్పదమవుతునే వున్నాయి. సైనికుల తుపాకీ కాల్పుల వల్లే ఎక్కువమంది గాయపడ్డారని ఐరాస మానవ హక్కుల కార్యాలయ అధిపతి అజిత్ సన్‌ఘే జెనీవాలో విలేకర్లకు తెలిపారు. గాజాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆహార పంపిణీ వ్యవస్థను ఐక్యరాజ్య సమితి, ఇతర మానవతా సంస్థలు తిరస్కరించాయి. ఈ పద్ధతి వల్ల లక్షలాదిమంది ప్రజల ఆహార అవసరాలు తీరవని పేర్కొంటున్నాయి. మానవతావాద సూత్రాలను ఉల్లంఘిస్తోన్నందున ఈ జిహెచ్‌ఎఫ్ వ్యవస్థలో పాల్గొనడానికి ఐక్యరాజ్య సమితి, ఇతర మానవతా గ్రూపులు నిరాకరించాయి.

హృదయవిదారకం : గుటెరస్

జిహెచ్‌ఎఫ్ ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల వద్ద దృశ్యాలు హృదయ విదారకంగా వున్నాయని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. గాజా జనాభాకు సహాయం అందించడానికి భాగస్వామ్య పక్షాలతో కలిసి సూత్రబద్ధంగా, సవివరమైన పక్కా ప్రణాళికలను రూపొందించినట్లు చెప్పారు. నిష్పక్షపాతంగా, ఆహార పంపిణీ జరగాల్సిన అవసరం వుందని ఆయన వ్యాఖ్యానించారు.

యెమెన్ రాజధాని సానా ఎయిర్‌పోర్టుపై ఇజ్రాయిల్ దాడి

సానా : యెమెన్ రాజధాని సానా విమానాశ్రయంపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ బుధవారం ప్రకటించింది. నెల రోజుల వ్యవధిలోనే దాడిచేయడం రెండవసారి. హౌతి మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకుని దాడి జరిపినట్లు చెబుతోంది. ఈ నెల 6వ తేదీన జరిపిన ఇజ్రాయిల్ దాడిలో విమానాశ్రయంలోని టెర్మినల్‌ను ధ్వంసం చేశారు. రన్‌వేపై పెద్ద పెద్ద గోతులు పడేలా బాంబుల వర్షం కురిపించారు. విమానాల రాకపోకలు నిలిచిపోగా, ఈ నెల 17న వాటిని హౌతీలు పునరుద్ధరించారు.

హమాస్ సీనియర్ నేత మొహమ్మద్ సిన్వర్ మృతి

హమాస్ సీనియర్ నాయకుడు, యాహ్యా సిన్వర్ సోదరుడు మొహమ్మద్ సిన్వర్ గాజా స్ట్రిప్‌లో జరిగిన వైమానిక దాడిలో మరణించినట్లు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు బుధవారం ప్రకటించారు. ఇజ్రాయిల్‌పై దాడికి ప్రధాన సూత్రధారిగా చెబుతున్న యాహ్యా సిన్వర్ గతంలో మరణించారని, ఇప్పుడు మొహమ్మద్ సిన్వర్ తాజా దాడుల్లో మరణించారని ఇజ్రాయిల్ తెలిపింది.

నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద నారా భువనేశ్వరి, జూనియర్ ఎన్‌టిఆర్, కళ్యాణ్‌రామ్, సినీ దర్శకుడు వైవిఎస్ చౌదరి, నందమూరి కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు నివాళులు అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఎన్‌టిఆర్ స్ఫూర్తితో తెలంగాణలో టిడిపి పునర్వైభవం తీసుకొస్తామని టి.టిడిపి నాయకులు తెలిపారు. ప్రముఖుల రాక సందర్భంగా ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో టిడిపి శ్రేణులు ఎన్‌టిఆర్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించాయి.

కొద్ది దూరానికే విమాన ప్రయాణమా?

- గవర్నర్‌పై మణిపూర్ ప్రజల ఆగ్రహం
- నిరసనలు, ఆందోళనలతో హోరెత్తుతున్న రాష్ట్రం
- కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు తాళం

ఇంఫాల్ : మణిపూర్‌లో నిరసనలు బుధవారం నాలుగో రోజుకు చేరాయి. మణిపూర్ సమగ్రతపై ఏర్పడిన సమన్వయ కమిటీ (కొకోమీ) సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన ఉధృతం చేశారు. రెండు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు తాళం వేశారు. మరోవైపు రాష్ట్రంలో జాతుల మధ్య నెలకొన్న సంక్షోభంపై దేశ రాజధాని ఢిల్లీలో సమన్వయ కమిటీ ప్రతినిధులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖతో చర్చలు కొనసాగిస్తున్నారు. గవర్నర్ అజయ్ కుమార్ భల్లా క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్‌తో చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా కొకోమీ విద్యార్థి విభాగానికి చెందిన వారు దక్షిణ ఇంఫాల్‌లో ఉన్న ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి తాళం వేశారు. ఈ నెల 20న జరిగిన ఘటన ఆందోళనలకు దారితీసింది. ఓ ఉత్సవం నుండి పాత్రికేయులను తీసుకొస్తున్న ప్రభుత్వ రంగానికి చెందిన బస్సుపై 'మణిపూర్ రాష్ట్ర రవాణా' అని రాసి ఉంది. ఆ పదాలను తొలగించాలంటూ భద్రతా సిబ్బంది ఆదేశించడంతో వివాదం మొదలైంది. విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించారు. 'మణిపూర్‌కు క్షమాపణలు చెప్పండి... లేదా వెళ్లిపోండి', 'మణిపూర్ గుర్తింపును అవమానిస్తున్న రాష్ట్రపతి పాలనను నిలిపివేయాలి' అని రాసి ఉన్న ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఇంఫాల్ విమానాశ్రయం నుండి కాంగ్లా ఫోర్ట్‌కు గవర్నరును సైనిక విమానంలో తరలించడం ప్రజాగ్రహాన్ని మరింత పెంచింది. కాంగ్లా ఫోర్ట్ రాజ్‌భవన్‌కు కేవలం 300 మీటర్ల దూరంలోనే ఉంది. రోడ్లను దిగ్బంధించిన నిరసనకారుల నుండి తప్పించుకునేందుకే గవర్నరును విమానంలో తరలించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన వైఫల్యానికి ఈ ఘటన అద్దం పడుతోందని కాంగ్రెస్ విమర్శించింది. విమానాశ్రయం నుండి రాజ్‌భవన్‌కు ఆరు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉన్నదని, ఈ కొద్ది దూరానికే గవర్నరును విమానంలో తరలించడాన్ని చూస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం విఫలమైనట్లు అర్థమవుతోందని పేర్కొంది.

మణిపూర్‌లో వరుస భూకంపాలు

ఇంఫాల్ : మణిపూర్‌లో బుధవారం మూడు వరుస భూకంపాలు సంభవించాయి. చురాచంద్‌పూర్ జిల్లాలో తెల్లవారుజామున 1:54 గంటలకు ఇవి ప్రారంభమయ్యాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. వీటిల్లో 1:54 గంటలకు వచ్చిన భూకంపం అతిఎక్కువ తీవ్రత (5.2) కలిగిందని పేర్కొంది. తరువాత ఉదయం 2.26 గంటలకు 2.5 తీవ్రతతో రెండో భూకంపం, ఉదయం 10.23 గంటలకు 3.9 తీవ్రతతో మూడో భూకంపం సంభవించినట్లు తెలిపింది.

టిజివి ఎస్ఆర్ఎంసి ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి అక్రమ కేసులు ఎత్తివేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. పాలి టెట్రా ఫ్లోరో ఇథిలిన్ (పిటిఎఫ్ఇ) ఉత్పత్తికి వాడే పెర్ఫ్లోరో అక్టానోయిక్ యాసిడ్ (పిఎఫ్ఒఎ) అత్యంత ప్రమాదకరమైనదని, దానిని నిషేధించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ఒఎ వాడడం లేదని టిజివి పరిశ్రమ యాజమాన్యం చెబుతోందని, అది నిర్ధారించాల్సింది అధికారులని తెలిపారు. ఈ పరిశ్రమ కాలుష్యం వల్ల ఇప్పటికే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మళ్లీ విస్తరణ అంటే ఊరు వల్లకాడు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో అభ్యంతరాలను చెప్పనీయకుండా కంపెనీ గూండాలు ఎత్తుకెళ్తుంటే, గూండాలకు పోలీసులు సహకరించారని, పోలీసులు ఉన్నది గూండాలకు సహకరించడానికా? అని ప్రశ్నించారు. అధికారుల సమక్షంలో పోలీసుల మద్దతుతో ప్రజాభిప్రాయ సేకరణ ఒక ప్రసహనంగా జరిగిందన్నారు. టిజి వెంకటేష్ అక్కడే ఉండి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. పరిశ్రమలో వెయ్యి మంది ఉంటే 300 మంది స్థానికులకు మాత్రమే ఉద్యోగాలు కల్పించారన్నారు. ఉద్యోగుల జాబితా బయట పెట్టాలని డిమాండ్ చేశారు. టిజి వెంకటేష్ బెదిరించి ప్రాణాలతో చెలగాటం ఆడి కోట్లు మూటగట్టుకుంటామంటే చెల్లదన్నారు. సిఎం చెప్పే గ్రీన్ ఎకానమీ ఈ పరిశ్రమకు వర్తిస్తుందా? వర్తించదా? అని ప్రశ్నించారు. దీనిపై సిఎం దృష్టి పెట్టాలని కోరారు. కలెక్టర్, ఎస్‌పి జోక్యం చేసుకుని ఈ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి కలెక్టరేట్‌లో మళ్లీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మహానాడు ఆరు శాసనాల్లో కొత్తదనమేమీ లేదు

-టిడిపి కూటమి పాలనపై ప్రజలు సంతృప్తిగా లేరు

టిడిపి మహానాడులో చేసిన ఆరు శాసనాల్లో కొత్తదనమేమీ లేదని, అంతా పాత చింతకాయ పచ్చడేనని వి.శ్రీనివాసరావు అన్నారు. టిడిపి కూటమి ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తిగా లేరని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డిఎస్‌సి అమల్లోకి రావడానికి సంవత్సరం పట్టిందన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ల మీద స్పీడ్‌గా ఉందని, ప్రజల విషయంలో ఈ విధంగా లేదని వివరించారు. తెనాలిలో యువకులను పోలీసులు నడి బజార్‌లో కొట్టడం దుర్మార్గమన్నారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన తరువాత మృతదేహాలను బంధువులకు ఇవ్వకుండా పోలీసులే అంత్యక్రియలు నిర్వహించడంపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు వినతి

కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వి.శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. వెంకటేశ్వర్లుపై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలని, ప్రయివేటు గూండాలతో ప్రసహనంగా జరిగిన టిజివి ఎస్ఆర్ఎంసి ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేసి కలెక్టరేట్‌లో నిర్వహించాలని, పరిశ్రమలో వాడే రసాయనాల వివరాలు బయట పెట్టాలని, ఉద్యోగుల్లో ఎంతమంది స్థానికులు ఉన్నారో వివరాలు వెల్లడించాలని కలెక్టర్‌ను కోరారు. ఎస్‌పితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని, పరిశ్రమ విస్తరణకు అభ్యంతరాలుంటే ఇప్పుడైనా తెలపవచ్చని కలెక్టర్ అన్నారు.

కాలుష్యంతో అల్లాడుతున్నాం

టిజివి ఎస్ఆర్ఎంసి పరిశ్రమ కాలుష్యంతో అల్లాడుతున్నామని ప్రభావిత గ్రామమైన ఇ.తాంద్రపాడు గ్రామస్తులు వి.శ్రీనివాసరావు వద్ద వాపోయారు. ఈ గ్రామంలో పర్యటించిన ఆయనకు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. పరిశ్రమ కాలుష్యం వల్ల ఆయాసం వస్తోందని గ్రామ మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాతావరణ కాలుష్యమై పంటలు పండడం లేదని, దిగుబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు సైతం కలుషితం కావడం వల్ల బోర్ల నుంచి నీరు ఎర్రగా వస్తోందని తెలిపారు. పరిశ్రమ వ్యర్థాలను తుంగభద్రలోకి కలుపుతున్నారని తెలిపారు. పని కోసం కంపెనీకి వెళ్తే స్థానికులను వద్దంటున్నారని, పరిశ్రమ కాలుష్యాన్ని భరిస్తున్నా తమకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలుష్యానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని, వీటిపై గ్రామస్తులు ప్రశ్నించాలని, హక్కులను కాపాడుకునేందుకు ముందుకు రావాలని కోరారు. పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యాన్ని నియంత్రించేందుకు యాజమాన్యం కట్టుదిట్టమైన ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

సోషల్ మీడియా ఖాతాలు పరిశీలిస్తాం

- అమెరికాకు వచ్చే వారికి తేల్చిచెప్పిన ట్రంప్ సర్కార్
- విద్యార్థి వీసాల షెడ్యూలింగ్ తాత్కాలిక నిలిపివేత

న్యూయార్క్ : విద్యార్థులతో సహా తమ దేశానికి రావాలనుకుంటున్న వారి సామాజిక మాధ్యమ ఖాతాలను సమగ్రంగా, కూలంకషంగా పరిశీలిస్తామని, ఇందుకోసం అందుబాటులో వున్న ప్రతి సాధనాన్ని ఉపయోగించుకుంటున్నామని ట్రంప్ ప్రభుత్వం చెప్పింది. ఈ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు కొత్తగా దరఖాస్తులు పెట్టుకున్న విద్యార్థి వీసాల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా ఆపాల్సిందిగా విదేశాల్లోని తమ ఎంబసీలకు, కాన్సులర్ వర్గాలకు ట్రంప్ ఆదేశించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో పొలిటికోలో వార్తా కథనం వెలువడింది.

మంగళవారం విదేశాంగ ప్రతినిధి టామీ బ్రూస్‌ను విలేకర్లు దీనిపై ప్రశ్నించగా, దీనిపై నెలల తరబడి చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. 'అమెరికాకు రావాలనుకుంటున్నవారు ఎందుకు వస్తున్నారు, వారెవరు, ఏంచేస్తారు, ఇక్కడ వున్నపుడు ఏం చేస్తారు వంటి అంశాలను పరిశీలించుకోవాల్సి వుంది. ప్రతి సార్వభౌమ దేశానికి ఈ హక్కు వుంటుంది. అమెరికా కూడా అదే చేయాలనుకుంటోంది. వారు విద్యార్థులైనా, మరెవరైనా సరే ఈ ప్రక్రియ తప్పదని' స్పష్టం చేశారు. ఈ నెల 27న విదేశాంగ మంత్రి మార్క్ రూబియో సంతకాలు చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఈ సందర్భంగా పొలిటికో రిపోర్ట్ ఉటంకించింది. దీనివల్ల ప్రొసెసింగ్ జాప్యాలు వుంటాయా అని ప్రశ్నించగా, వ్యక్తిగతంగా జరిగే ఆలస్యం గురించి తాను స్పందించబోనని చెప్పారు. ఈ దేశానికి రావాలనుకుంటున్న వారికి ఎలాంటి క్రిమినల్ ఉద్దేశాలు కూడా వుండకూడదన్నారు. ఇటీవల అమెరికా విశ్వవిద్యాలయాల్లో పాలస్తీనియన్లకు మద్దతుగా వేలాదిమంది విద్యార్థులు ఆందోళనలు చేసిన నేపథ్యంలో ట్రంప్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు బాసట

ఫ్రాన్స్, పనామా ప్రభుత్వాల హామీ

పారిస్, పనామా సిటీ : ఉగ్రవాదంపై భారత్ సాగించే పోరులో తాము బాసటగా వుంటామని ఫ్రాన్స్, పనామా ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. ఈ విషయంలో ప్రజాస్వామ్య దేశాలు ఒక్క తాటిపై వుండాల్సిన అవసరం వుందని ఫ్రాన్స్ స్పష్టం చేసింది. బిజెపి నేత రవి శంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిల పక్ష బృందం ఫ్రాన్స్‌లో, కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ నేతృత్వంలోని అఖిల పక్ష బృందం పనామాలో పర్యటించాయి. ఈ బృందాలు తీవ్రవాదంపై పోరుకు సం బంధించి భారత ప్రభుత్వ సందేశాన్ని వారికి తెలియజేశాయి.

పనామాలో...

శశిథరూర్ నేతృత్వంలోని అఖిల పక్ష బృందం పనామా నేషనల్ అసెంబ్లీ అధ్యక్షురాలు డానా కేస్టనెడాతో భేటీ అయింది. భారత్‌కు అవసరమైన తోడ్పాటు, మద్దతు తమ వైపు నుండి ఎల్లప్పుడూ వుంటుందని వారు హామీ ఇచ్చినట్లు శశిథరూర్ బుధవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కృత నిశ్చయంతో పోరు సాగించాల్సిందిగా వారు భారత్‌ను కోరారని తెలిపారు. అంతకుముందు శశి థరూర్ సందర్శకుల పుస్తకంలో సంతకంచేశారు. పనామాలో గల దాదాపు 300మంది భారతీయులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఇండియా పోరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

పారిస్‌లో...

ఫ్రాన్స్ విదేశీ, రక్షణ వ్యవహారాల కమిటీలు, భారత్, ఫ్రాన్స్ మిత్రబృంద ప్రతినిధులు అఖిలపక్ష బృందంతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఫ్రాన్స్ సెనెట్‌లోని సహచరులందరూ ముక్త కంఠంతో భారత్‌కు చేయూతనందిస్తామని హామీ ఇచ్చారని రవిశంకర్ ప్రసాద్ మీడియాకు తెలిపారు. వారందించిన తోడ్పాటుకు, వారి సహృదయతకు కృతజ్ఞతలని ప్రసాద్ చెప్పారు. ఫ్రాన్స్‌లో కూడా ఉగ్రవాదంపై పోరాడుతున్నామని భారత్, ఫ్రాన్స్ మిత్రబృంద అధ్యక్షుడు థెర్రే టెసాన్ చెప్పారు. తీవ్రవాదమనేది కేన్సర్ వంటిదని దాన్ని సమూలంగా నిర్మూలించాల్సిందేనని సెనెట్ నేతలు పేర్కొన్నారు.



వేసవి విడిది

సెలవుల్లో సరదాగా



హాయ్ ఫ్రెండ్స్,
నా పేరు జ్ఞాన్వి. ఈ వేసవి సెలవుల్లో నేను మా అమ్మమ్మ గారి ఊరు సిద్దిపేటకు వెళ్ళాను. అక్కడ పదిహేను రోజులు ఉన్నాను. ప్రతి రోజూ మా అమ్మమ్మ చిన్న చిన్న కథలు చెప్పింది. నేను కూడా ఆమెకు కథలు చెప్పాను. బొమ్మలు వేయడం కూడా నేర్చుకున్నాను. అష్టా చెమ్మా, కైలాసం లాంటి ఆటలు ఆడడం మంచిగా అనిపించింది. సాయంత్రం వేళల్లో పార్కుకు వెళ్ళి రన్నింగ్, ఊయల ఆటలు ఆడాను. ప్రతి రోజూ రాత్రి తాతయ్యతో కలిసి నాటికలు వేసాను. అందులో నేను టీచర్‌గా నటించాను. నా నటన మెచ్చుకుని బహుమతులు కూడా ఇచ్చారు. కబడ్డీ, క్యారమ్ ఎలా ఆడాలో కూడా నేర్చుకున్నాను. ఏడు చేపల కథ అంటే నాకు చాలా ఇష్టం. జంతువుల కథలు వింటుంటే మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తుంది.



- బి. జ్ఞాన్వి,
1వ తరగతి,
శ్రీ చైతన్య స్కూలు,
సిద్దిపేట.

మామిడి చెట్టు

ఒక ఊరిలో ఓ మామిడిచెట్టు ఉంది. వేసవిలో అది చాలా పళ్ళు కాసింది. ఎంతో తియ్యగా ఉండే ఆ పళ్లని చూసుకుని మామిడిచెట్టు చాలా గర్వం పడేది. ఒకసారి ఓ పిచ్చుక ఆ చెట్టుపై వాలింది. తియ్యని వాసన వస్తున్న ఓ మామిడి పండుని చూసి కొరికింది. అప్పుడు మామిడి చెట్టు పిచ్చుకని బాగా తిట్టింది. 'నా పళ్లని ఎందుకు అలా ఎంగిలి చేస్తున్నావు? ఇక్కడి నుండి వెళ్లిపో!' అని గట్టిగా కొమ్మలు ఊపింది. భయంతో పిచ్చుక అక్కడి నుండి ఎగిరిపోయింది. ఇంకోరోజు ఆ చెట్టు దగ్గరికి ఓ కుందేలు వచ్చింది. దాన్ని చూస్తూనే మామిడి చెట్టు పగలబడి నవ్వింది. 'ఏంటి నువ్వు ఇంత చిన్నగా ఉన్నావు? చిన్న అలికిడి అయితేనే వెళ్లి కలుగులో కూర్చొంటావు. ఇంత పిరికిదానివి నా దగ్గరికి ఎందుకు వచ్చావు? నేను చూడు ఎంత పెద్దగా ఉన్నానో!' అంటూ గర్వంగా మాట్లాడింది. ఆ మాటలకి కుందేలు చిన్నబుచ్చుకుని అక్కడి నుండి వెళ్లిపోయింది.

మామిడిచెట్టుకి దాని వేర్లంటే అసలు ఇష్టముండేది కాదు. అవి ఎప్పుడూ మట్టిలో ఉంటాయని వాటిని తక్కువగా చూసేది. ఒకసారి ఒక ఎలుకల గుంపు మామిడి చెట్టు వేర్లని కొరుకుతూ నేలలో బొరియలు చేసుకున్నాయి. కొన్ని రోజులకు వేర్లు ఎండిపోయి చెట్టు వాడిపోయింది. అప్పుడు మామిడి చెట్టు ఎంతో భయపడిపోయింది. వాన కోసం ఎంతో ఎదురుచూసింది. పచ్చని చెట్టు ఎండిపోవడం చూసి పిచ్చుక, కుందేలు కూడా చాలా దిగాలు పడ్డాయి. ఏడుస్తున్న మామిడిచెట్టుని ఓదార్చాయి. తాను ఎంత హీనంగా చూసినా పిచ్చుక, కుందేలు తనపట్ల ప్రేమ చూపిస్తున్నందుకు మామిడిచెట్టు పశ్చాత్తాపంతో కన్నీరు కార్చింది. అప్పుడే ఆకాశంలో ఉరుములు, మెరుపులతో పెద్ద వాన పడింది. ఆ వానకి పిచ్చుక, కుందేలు ఎగిరి గంతేశాయి. మామిడిచెట్టు కూడా ఆనందంతో కొమ్మలు అటూఇటూ ఊపింది.

- ఎన్.స్నేహ,
8వ తరగతి,
కేంద్రీయ విద్యాలయ ఓఎన్‌జిసి,
రాజమండ్రి,
తూర్పుగోదావరి జిల్లా.

బొమ్మల కొలువు

రావినూతల
మోహన వశిష్ట,
3వ తరగతి,
సిల్వర్ ఓక్స్ స్కూలు,
ఒంగోలు సృష్టి ఆర్ట్స్ అకాడెమీ,
హైద్రాబాద్.

కె. సాయి సాకేత్,
6వ తరగతి,
జెనిసిస్ ఇంటర్నేషనల్ స్కూలు,
మదీనాగూడ,
హైదరాబాద్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

కొండపల్లి బొమ్మ జిగేలు..
తయారీదారు దిగాలు..

కోడెగిత్తల బండిపై పైదాకా నెట్టుగట్టిన ధాన్యం బస్తాలు - బండి తొట్టిలో మహిళా రైతు, బండి ముందు రైతు మారాజు.. ఆ దృశ్యమే అత్యద్భుతం! ఏనుగు అంబారీ మావటివాడు.. వధూవరులను పల్లకీలో బోయీలు మోసుకెళ్లడం.. రథంపై కృష్ణార్జునులు.. వివిధ గ్రామీణ, చేతివృత్తుల వారి సమూహం.. దశావతారాలు, బృందావన దృశ్యం.. డాన్సింగ్ డాల్ (బుట్టబొమ్మ).. సన్నాయి మేళం ఆకృతి.. ఇలాంటి కొండపల్లి బొమ్మలను చూస్తుంటే- కళ్లు జిగేలుమంటాయి. ఆ బొమ్మలను తయారు చేస్తున్న కళాకారుల స్థితిగతులు మాత్రం కడు దీనంగా ఉన్నాయి.

విజయవాడకు సుమారు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపల్లి ఖిల్లాకు (కోట) దేశీయంగా పేరయితే.. కొండపల్లి బొమ్మలకు అంతర్జాతీయంగా పేరు. కొండపల్లి బొమ్మలు ఇంట్లో (షోకేసులో) ఉంచుకోవడం (కళాత్మక) దర్పానికి చిహ్నంగా భావిస్తారంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. కొండపల్లి బొమ్మలు మన తెలుగుజాతికి గర్వకారణం. అయితే రాను రానూ కొండపల్లి బొమ్మల తయారీదార్లు.. హస్తకళాకారులు తగ్గిపోతున్నారు. నేటి తరం వాళ్ల ఈ కళాత్మక వృత్తిలోకి రావడానికి అంతగా ఇష్టపడటం లేదు. దాదాపు నాలుగొందలేళ్ల నాటి ఆ వృత్తిని పెద్దవాళ్లే ఇంకా పట్టుకు వ్రేలాడుతున్నారు.

వాస్తవానికి బొమ్మలకు గిరాకీ తగ్గలేదు. డిమాండ్ బాగానే ఉంది. కొన్ని బొమ్మలయితే ధనికులు మాత్రమే కొనగలిగే రేట్లు పలుకుతాయి. అయినా కళాకారుడి కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదు. బొమ్మ తయారీకి అవసరమయ్యే 'తెల్ల పొనికి' కర్ర కొండపల్లి అడవుల్లో ఏమాత్రం దొరకడం లేదు. కొండపల్లి అడవుల్లో 'తెల్ల పొనికి' కర్ర పెంచే ప్రణాళిక ఎన్నాళ్లకూ అందిరాక తిరువూరు, ఎ.కొండూరు, చీమలపాడు తదితర దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సొస్తోంది. ఇంతకుముందు సుమారు రూ.250కు లభ్యమయ్యే కర్రకు ఇప్పుడు రూ.1300 నుండి రూ.1500 వరకూ పెట్టాల్సొస్తోందని హస్తకళాకారులు వాపోతున్నారు.

తయారీ ధర పెరిగిన మేరకు మజూరీ ధరలు పెరగలేదు. బొమ్మబొమ్మనూ తయారు చేయాల్సిందే.. ఒకటి పూర్తయితే దాన్నుంచి కాపీలు తీసుకున్నట్టు కుదరదు. గంటల తరబడి కూర్చుని తదేక దృష్టితో.. ఏకాగ్రతతో కేంద్రీకరించి పొద్దంతా చేసినా సరాసరిన రోజుకు గరిష్టంగా రూ. ఏడెనిమిదొందలు దక్కడం గగనం.

ఈ స్థితిలో యువతరం వాళ్లు బొమ్మల తయారీకి సిద్ధపడలేక రోజు వారీ కూలి పనులు సహా ఇతరత్రా పనులు వెతుక్కుంటున్నారు. మగవారు తయారుచేసే బొమ్మలకు రంగులద్దడం, ప్యాకింగ్ వగైరా సహాయక చర్యలకే ఇటీవల వరకూ పరిమితమైన స్త్రీలు క్రమంగా పూర్తిస్థాయిలో ప్రధాన పని కూడా సమర్ధంగా చేయడం ముదావహం. ఏమైనప్పటికీ బొమ్మల తయారీ హస్తకళాకారుల సంఖ్య గణనీయంగా తగ్గడం ఓ చేదు నిజం.

నాలుగు దశాబ్దాల క్రితం వరకూ 80 రకాలకు పైగా బొమ్మలు తయారు చేసేవారు. ఈమధ్య పది రకాల లోపే చేస్తున్నారు. బొమ్మల తయారీలో యంత్రాల ప్రవేశం కూడా హస్త కళాకారులను కొంతమేర దెబ్బతీసింది. దేశానికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కించిన కొండపల్లి బొమ్మల తయారీదార్లని ఆదుకోవడానికి ప్రభుత్వాలు ముందుకురావాల్సిన తరుణం. 'లేపాక్షి' వారు అరవయ్యేళ్లు దాటిన హస్తకళాకారులకు నెలకు రూ. 500 చొప్పున ఇస్తున్నా ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ వంటివి సమకురుస్తున్నా అంతంత మాత్రమే. వీటికి తోడు ప్రధానంగా బొమ్మల తయారీకి సహకరించాలి. కర్ర తేలిగ్గా సబ్సిడీపై దొరికే ఏర్పాటుచేయాలి. తయారీదారులకే మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. మధ్య దళారీల పెట్టుబడిదారీ షాపుల వాళ్ల హవా తగ్గి వీళ్ల కఠోర శ్రమలో ప్రధాన భాగం వీరికే దక్కేలా చూడాలి.

సుమారు 400 సంవత్సరాల క్రితం రాజస్థాన్ నుండి వలసవచ్చిన బొమ్మల తయారీ నిపుణులు కొండపల్లి ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వారిని 'ఆర్య క్షత్రియులు' అనే వారు. కాలక్రమంలో ఇతర కులాల వారు కూడా ఈ వత్తిని నేర్చుకుని ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. ప్రభుత్వాలు ఇందులో శిక్షణ ఇస్తూ కొంతవరకూ ప్రోత్సహిస్తూ వచ్చాయి.

ఎన్టీఆర్ హయాంలో కొండపల్లి బొమ్మల తయారీదార్లకి కాలనీ, ఇళ్లు ఇచ్చారు. ఇప్పుడు ఇళ్లన్నీ పాడై పోయాయి. ఎంతో పల్లమయ్యాయి. చాలా ఇళ్లు మరీ అధ్వానంగా, ఘోరంగా ఉన్నాయి. బొమ్మల తయారీకి ఏమాత్రం చాలడం లేదు. అంతకంటే అనువుగా లేవు. మంచినీళ్ల అందుబాటులోలేక అవస్థలు పడుతున్నామని మహిళలు ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజ్ వ్యవస్థ లేదు. ఇప్పటికీ పర్యాటకుల్ని ఏదోమేరకు ఆకర్షిస్తున్న ఖిల్లాకు ఊళ్లో నుంచి కాలి నడక మార్గమే ఉంది. ఫోర్ వీలర్స్ కూడా కొండపైకి వెళ్లే అవకాశం కొండపల్లి నుంచే కల్పిస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందేదనిపిస్తుంది.

- జి.వి.రంగారెడ్డి,
99126 15747

శిక్షణ తరచూ ఏర్పాటు చేయాలి



దళారీలు బాగుపడుతున్నారు మాకు చాకిరీయే మిగులుతోంది. ప్రధానంగా మధ్య దళారీలు సొమ్ము చేసుకుంటున్నారు. థర్మల్ బూడిద కారణంగా కొండపల్లి అడవుల్లో 'తెల్ల పొనికి' కర్ర పెరగడం లేదు. బొమ్మల తయారీలో గతంలో మాదిరి శిక్షణ తరచూ ఏర్పాటుచేయాలి. మరింత మందిని ఈ రంగంలోకి ఆకర్షించేలా ప్రభుత్వాలు పూనుకోవాలి.

- చందూరి కోటయాచారి (61)

కొండపల్లి బొమ్మ కళ పోయింది



యాబయ్యేళ్లకు పైగా ఈ పనిలో ఉన్నా. అప్పుడున్నంత మోజు ఇప్పుడు లేదు. పనికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. అందుకే యువతరం ఈ వృత్తిని ఎంచుకోలేకపోతోంది. మేం తయారుచేసిన బొమ్మలు సొసైటీ ద్వారా మేమే అమ్ముకునేలా ప్రభుత్వం తోడ్పడాలి.

- నంచర్ల రామకృష్ణాచారి (76)

వేన్నీళ్లకు చన్నీళ్లలా

ఇంటి పని పూర్తిచేసుకుని మధ్యాహ్నం నడుం వాల్చ కుండా పార్ట్ టైమ్‌గా బొమ్మలు తయారుచేస్తుంటా. రిపేర్లూ చేస్తుంటా. సరాసరిన నెలకు రూ. ఐదారు వేలు దక్కుతుంటాయి. కుటుంబం గడవడానికి వేన్నీళ్లకు చన్నీళ్లలా ఉంటాయని చేస్తున్నా. కానీ ఇల్లంతా కారిపోతోంది. బాగు చేయించుకోలేక పట్టా కప్పించుకున్నాం.

- వల్లేటి మంగమ్మ (56)

ఓవర్ హెడ్ ట్యాంక్ అవశ్యకత

కొండపల్లి బొమ్మల తయారీదార్లు ఎక్కువగా ఉండే ప్రాంతంలో మంచినీటి సమస్యను తక్షణం పరిష్కరించాలి. అనువైన చోట కనీసం ఒకటయినా ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలి. జానా బెత్తెడు ఇంట్లో వారి అవస్థలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. ప్రభుత్వం పట్టించుకోవాలి.

- విఠల్ రావు, సీపీఐ(ఎం)

తిరుగులేని మహానటుడు ఎన్టీఆర్

సినీ ప్రముఖుల నివాళి

'తెలుగు సినిమా ప్రస్తావన వస్తే ముందుగా గుర్తొచ్చే పేరు ఎన్టీఆర్. ఓ వైపు పౌరాణిక చిత్రాల్లో నటిస్తూ వెండితెరను శాసించేలా వెలు గొందినా.. మరోవైపు మాస్ సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులను ఉర్రూత లూగించినా అది ఒక్క ఎన్టీఆర్‌కే దక్కింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తెలుగు వారితో అన్న అని పిలిపించుకున్న గొప్ప నాయకుడు, నటుడు ఎన్టీఆర్. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా.. రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు నందమూరి తారకరామరావు. తెలుగు ప్రజలు ఉన్నన్ని రోజులు ఎన్టీఆర్ అనే పేరు వినిపిస్తూనే ఉంటుంది. వెండతెరపై చెరగని ముద్ర వేసిన ఎన్టీఆర్ మొత్తం 302 సినిమాల్లో నటించారు. వీటిలో ఏకంగా 275 సినిమాలు బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించాయి. ఆయన జీవిత చరిత్ర అజరామరం. ఆడబిడ్డలకు 33శాతం రిజర్వేషన్లు, మండల పరిషత్ వ్యవస్థను తీసుకొచ్చి పాలనను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

సామాన్యుడికి ఈ రోజుకి కిలో రెండు రూపాయల బియ్యం అంటే గుర్తుకు వచ్చేది ఎన్టీఆర్ మాత్రమే. తెలుగువాడి ఖ్యాతిని నలుదిశలా విస్తరింపజేసిన ఎన్టీఆర్‌కు సాటి ఎవ్వరూ లేరు' అని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి జెవి మోహన్‌గౌడ్, ఛాంబర్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజా వాసిరెడ్డి భూపాల్ ప్రసాద్ అన్నారు. కీర్తిశేషులు నందమూరి తారకరామారావు 102వ జయంతి సందర్భంగా అమరావతిలోని ఛాంబర్ కార్యాలయంలో సినీరంగ ప్రముఖులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఛాంబర్ ట్రెజరర్ ఛాంబర్ ట్రెజరర్ ఎం.శ్రీనాథరావు, జాయింట్ సెక్రటరీ పులి రమణారెడ్డి, కల్చరల్ కమిటీ చైర్మన్ రావి సౌజన్య, కార్యవర్గ సభ్యులు కన్నెగంటి రవీంద్రనాథ్ ఠాగూర్ బాబు, ఉప్పాల వెంకట్రావు, ఎన్‌టిఆర్ జిల్లా కోఆర్డినేటర్ బెల్లం జయకుమార్, కృష్ణాజిల్లా కోఆర్డినేటర్ వెంకట్, నిర్మాతలు, సభ్యులు శంకర్, విఠల్, మూర్తి నం.1 పాల్గొన్నారు.

ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ నివాళి

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నందమూరి తారక రామారావు (జూనియర్ ఎన్టీఆర్), నందమూరి కళ్యాణ్‌రామ్ పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. పులువురు కుటుంబ సభ్యులు కూడా నివాళు లర్పించిన వారిలో ఉన్నారు.

'నాగార్జున అభిమానిని'

ధనుష్, నాగార్జున కాంబినేషన్లో తెరకెక్కిన 'కుబేర' చిత్రం మరో 20 రోజుల్లో థియేటర్లలోకి రానుంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకి దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. రష్మిక మందన్నా, జిమ్ షర్భ్, దలిప్ తహిల్ కీలక పాత్రల్లో నటించారు. శ్రీవేంకటేశ్వర సినిమాస్, అమిగోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఒక ఇంటర్వ్యూలో ధనుష్ మాట్లాడుతూ.. నాగార్జునపై తనకున్న అభిమానాన్ని తెలియ జేశారు. 'నాగార్జున గారితో కలిసి నటించడం ఎంతో ఆనందాన్ని కలిగించింద'ని, ఆయన నటించిన సినిమాల్లో రక్షకుడు బాగా ఇష్టమ'ని చెప్పారు. 'నాగార్జున సినిమాలకు నేను చిన్నప్పటి నుంచి అభిమానినే. ఇప్పుడు ఆయనతో కలిసి నటించడం ఎంతో సంతోషంగా ఉంది. సెట్‌లో ఆయనను చూస్తూ ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. షూటింగ్ సమయంలో ఆయన నుంచి నేర్చుకున్న పాఠాలు నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండి పోతాయి' అని అన్నారు.

'మిరాయ్' టీజర్ విడుదల

'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా.. ఇప్పుడు 'మిరాయ్' మూవీతో రాబోతున్నాడు. తాజాగా టీజర్‌ను మేకర్లు విడుదల చేశారు. అలాగే మూవీ కొత్త రిలీజ్ తేదీని కూడా ప్రకటించారు. తేజ సజ్జా హీరోగా నటిస్తున్న 'మిరాయ్'లో పవర్‌ఫుల్ విలన్‌గా మంచు మనోజ్ కనిపించబోతున్నాడు. టీజర్ ఆసక్తిగా సాగింది. ప్రభాస్ 'కల్కి' తరహాలో త్రేతా యుగం, కలియుగం మధ్య ఏదో లింక్ ఉన్నట్లుగా విజువల్స్ చూపించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. తొలుత అనుకున్నట్లు ఆగస్టు 1న కాకుండా సెప్టెంబరు 5న ఏడు భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.



జూన్‌లో విజయ్ సేతుపతి కొత్త సినిమా

విజయ్‌సేతుపతి కథానాయకుడిగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్క బోతోంది. ఇందులో టబు, కన్నడ నటుడు విజయ్‌కుమార్ కీలకపాత్రల్లో నటించ నున్నారు. పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మించనున్నారు. జూన్ చివరి వారంలో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటు న్నారు. మొదటి నుంచి తుది షెడ్యూల్ వరకూ షూటింగ్ కాల్షీట్లు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై ప్రాంతాల్లో షూటింగ్ ప్రదేశాల ఎంపికపై కసరత్తు జరుగుతోంది.

నటీనటుల ఎంపికతోపాటుగా పాత్రల ఎంపిక కూడా పూర్తయ్యింది. షూటింగ్ మొదలయ్యాక మిగతా విషయాలు వెల్లడిస్తా మని చిత్ర యూనిట్ ప్రకటించింది.

ఫైనల్‌కు చేరేదెవరో..?

- నేడు క్వాలిఫయర్-1లో పంజాబ్-బెంగళూరు ఢీ
- రాత్రి 7.30గం॥లకు

ఛండీగఢ్: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లో లీగ్ దశ పోటీలు ముగిసాయి. అందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ.. పంజాబ్ కింగ్స్-రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు ఈసారి టాప్-2 బెర్త్‌ల్లో నిలిచాయి. భారీ అంచనాలతో బరిలోకి దిగిన డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ఈసారి ప్లే-ఆఫ్స్‌కు చేరడంలో విఫలమయ్యాయి. ఈ క్రమంలో గురువారం జరిగే ప్లే-ఆఫ్స్‌లో పంజాబ్, బెంగళూరు జట్లు ఫైనల్ బెర్త్ కోసం అమీ తుమీ తేల్చుకోనున్నాయి. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచి జట్ల మధ్య క్వాలిఫయర్-1 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. ఐపిఎల్ చరిత్రలో ఆర్సీబీ ప్లే-ఆఫ్స్‌కు చేరడం ఇది పదోసారి. బెంగళూరు జట్టు మూడుసార్లు(2009, 2011, 2016) ఫైనల్‌కు చేరినా.. ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయింది. ఐపిఎల్ చరిత్రలో 15 ప్లే-ఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ.. ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి, పదింట ఓడింది. ప్లే ఆఫ్స్‌లో ఆర్సీబీని అత్యంత దురదృష్టమైన జట్టు అని అంటారు. లీగ్ దశలో చెలరేగి ఆడే ఈ జట్టు నాకౌట్ మ్యాచ్‌లు వచ్చే సరికి ఢీలా పడిపోతుంది. కానీ ఈసారి పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తుంది. ఆర్సీబీ ఈ సీజన్‌లో చాలా కాన్ఫిడెంట్‌గా ఉంది. ఇందుకు లక్నోతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్ నిదర్శనం. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 228 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లి, సాల్ట్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెఫర్డ్, మయాంక్ అగర్వాల్ అద్భుత ఫామ్‌లో ఉన్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న ఆర్సీబీ జట్టు లక్నోపై నాలుగు వికెట్లు కోల్పోయినా ఏ మాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అబ్బురపడే విజయం సాధించింది.

దుర్భేధ్యఫామ్‌లో పంజాబ్..

ఇక పంజాబ్ కింగ్స్‌ను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఆ జట్టు లీగ్‌లో ఆడిన 14 మ్యాచుల్లో ఏకంగా 9మ్యాచుల్లో విజయాలను నమోదుచేసుకుంది. ఢిల్లీతో మ్యాచ్ రద్దు కావడంతో ఒక పాయింట్ దక్కింది. ఇక లీగ్ దశలో బెంగళూరుపై 5వికెట్ల తేడాతో విజయం సాధించిన ఘన పంజాబ్‌దే. ఇక చివరి లీగ్ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు ఏకంగా ఐదుసార్లు ఛాంపియన్ ముంబయి ఇండియన్స్‌ను చిత్తుచేసి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. అత్యధిక ధరకు పంజాబ్ చెంతకు చేరిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అద్భుత ప్రదర్శనతో ఆ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. యువ బ్యాటర్ ప్రియాన్ష్ ఆర్యా, ప్రభ్ సిమ్రన్, ఇంగ్లిస్, శశాంక్ సింగ్, స్టొయినీస్, జాన్సెన్‌ను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఈ క్రమంలో పంజాబ్-బెంగళూరు జట్ల మధ్య జరిగే తొలి క్వాలిఫయర్ మ్యాచ్ హోరాహోరీగా సాగడం ఖాయం.

జట్లు(అంచనా)...

బెంగళూరు: రజత్ పటీధర్(కెప్టెన్), సాల్ట్, కోహ్లి, లివింగ్‌స్టోన్, మయాంక్ అగర్వాల్, జితేశ్ శర్మ, షెఫర్డ్, కృనాల్ పాండ్య, భువనేశ్వర్, యశ్ దయాల్, తుషార/సుయాశ్ శర్మ.

పంజాబ్: శ్రేయస్(కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్యా, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ఇంగ్లిస్, నేహాల్ వధేరా, శశాంక్ సింగ్, స్టొయినీస్, జాన్సెన్, హర్‌ప్రీత్ బ్రార్, జేమీసన్, వ్యాషక్/అర్ష్‌దీప్ సింగ్.

4×400మీ. మిక్స్‌డ్ రిలేలో భారత్‌కు స్వర్ణం

- ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్

గుమీ (దక్షిణకొరియా): ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ లో మన అథ్లెట్లు పతకాలు కొల్లగొడుతున్నారు. బుధవారం జరిగిన 4×400మీ. మిక్స్‌డ్ రిలేలో భారత్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఫైనల్లో భారత అథ్లెట్ల బృందం 3నిమిషాల 18:12సెకన్లలో గమ్యానికి చేరారు. రూపల్ చౌదరి, సంతోష్ కుమార్, తమిళరాసన్, విశాల్, శుభా వెంకటేశన్‌లతో కూడిన భారత బృందం బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. 2023లో తొలిసారి స్వర్ణ పతకం చేజిక్కించుకున్న భారత బృందం.. 2019లో రజత పతకానికే పరిమితమైంది. చైనా (3:20.52సెకన్లు), శ్రీలంక (3:21.95సెకన్లు) రజత, కాంస్య పతకాలను చేజిక్కించుకున్నాయి. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ రజత పతకాన్ని సాధించాడు. ఫైనల్‌కు చేరిన ఎనిమిది మంది అథ్లెట్ల మధ్య జరిగిన పతక పోరులో తేజస్విన్ 7,618పాయింట్లతో రెండోస్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఫీ షియాంగ్(చైనా) 7,534పాయింట్లు స్వర్ణ పతకం సాధించగా.. జపాన్‌కు చెందిన కిసుకే ఒకోడా 7,602పాయింట్లు కాంస్య పతకం సాధించారు. మహిళల 400మీ. పరుగులో రూపల్ చౌదరి, 1500మీ. పరుగులో పూజ, పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీన్ చిత్రవేల్ రజత పతకాలను సాధించారు. ఏకైక కాంస్య పతకాన్ని పురుషుల 1500మీ. పరుగులో యువాన్ షా సాధించాడు. రెండోరోజు భారత్‌కు ఆరు పతకాలు దక్కాయి. ఇందులో ఒక స్వర్ణ, నాలుగు రజత పతకంతోపాటు మరో కాంస్య పతకం దక్కింది. రెండోరోజు పోటీలు ముగిసేసరికి భారత్ 2స్వర్ణ, 4రజత, 2కాంస్యాలతో సహా 8పతకాలతో మూడోస్థానంలో ఉంది.

మూడోరౌండ్‌కు పోలిని, జంగ్

- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ మూడోరౌండ్‌లోకి 4వ సీడ్ జాస్మినే పోలిని(ఇటలీ), చైనాకు చెందిన 8వ సీడ్ జంగ్ క్విన్‌వెన్ దూసుకెళ్లారు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో 2024 ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ పోలిని 6-3, 6-3తో ఆస్ట్రేలియాకు చెందిన అజ్లా టోమ్జానోవిక్‌ను చిత్తుచేసింది. పారిస్ ఒలింపిక్ ఛాంపియన్, చైనాకు చెందిన జంగ్ క్విన్‌వెన్ 6-2, 6-3తో అన్‌సీడెడ్, కొలంబియాకు చెందిన అరాంగోపై వరుససెట్లలో విజయం సాధించింది. ఇతర పోటీల్లో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్, 22వ సీడ్, డెన్మార్క్‌కు చెందిన టూసన్, 13వ సీడ్, ఉక్రెయిన్‌కు చెందిన స్విటోలినా 7-6(7-4), 7-5తో బోండార్(హంగేరి)పై విజయం సాధించి మూడోరౌండ్‌కు చేరారు. మరో పోటీలో 18వ సీడ్ వేకిక్(క్రొయేషియా), 14వ సీడ్ ముఛోవా(చెక్ రిపబ్లిక్) అన్‌సీడెడ్ క్రీడాకారిణుల చేతిలో ఓటమిపాలయ్యారు.

అల్కరాజ్, మసెట్టి కూడా...

ఇక పురుషుల సింగిల్స్‌లో 2వ సీడ్, కార్లోస్ అల్కరాజ్, 9వ సీడ్, ఇటలీకి చెందిన మసెట్టి ప్రత్యర్థులను చిత్తుచేసి మూడోరౌండ్‌కు చేరారు. స్పెయిన్ యువ సంచలనం, 2024 టైటిల్ విజేత అల్కరాజ్ 6-1, 4-6, 6-1, 6-2తో ఫరోజోసన్(హంగేరి)పై, మసెట్టి 6-4, 6-0. 6-4తో గాలన్(కొలంబియా)పై విజయం సాధించి మూడోరౌండ్‌కు చేరారు. మరో పోటీలో 7వ సీడ్ రూథ్(నార్వే) అనూహ్యంగా రెండోరౌండ్‌లో అన్‌సీడెడ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో భారత్‌క చెందిన యుకీ బాంబ్రీ-గల్లావేయ్(అమెరికా) జంట 6-3, 6-7(8-10), 6-3తో హాస్(ఫ్రాన్స్)-జెబెన్స్(జర్మనీ) జంటను ఓడించి రెండోరౌండ్‌కు చేరారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68